ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

వ్యవసాయం

ఏప్రిల్, 2025

సంపుటి - 11 సంచిక-04 పేజీలు- 52 వెల : ₹ 20/-

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక

రైతు నేస్తం కార్యక్రమం కోసం వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య

నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న విశ్వవిద్యాలయ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం

విశ్వవిద్యాలయ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమంలో శిక్షణకు సంబంధించిన ప్రచురణను విడుదల చేస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సి.హెచ్. విద్యాసాగర్ మరియు ఇతర అధికారులు

ఏరువాక కేంద్రం, సంగుపేటలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు మరియు రైతులు

ఏరువాక కేంద్రం, తాండూరులో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు మరియు రైతులు

రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందచేస్తున్న వర్సిటీ ఉన్నతాధికారులు

వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

ఏప్రిల్, 2025

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర చైత్ర శుద్ధ తదియ నుండి వైశాఖ శుద్ధ తదియ వరకు

సంపాదక వర్గం

ప్రధాన సంపాదకులు

డా॥ ఆర్. సునీత దేవి

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ ఎన్. రామగోపాల వర్మ

ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

డా॥ ఎ. వి. రామాంజనేయులు

ప్రధాన శాస్త్రవేత్త (అగ్రో) & హెడ్

వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.

డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి

చిరునామా :

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం

ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.

తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380

e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com

పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

విషయ సూచిక

1. ఉపకులపతి సందేశం........ 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు........ 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ........ 11
4. సాంకేతిక వ్యాసాలు
   - వరిలో కంకినల్లి మరియు సుడిదోమ యాజమాన్యం..... 12
   - వరిలో డ్రోన్‌తో రసాయనిక గుళిక మందులు వెదజల్లటంలో మెళకువలు........ 14
   - చిరుధాన్యాలు-ఆరోగ్య ప్రయోజనాలు........ 16
   - వేరుశనగకు విలువ జోడించటం ద్వారా రెట్టింపు ఆదాయం........ 19
   - ప్రకృతి వ్యవసాయము-ఆరోగ్యకరమైన ఎంపిక........ 22
   - తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2025-26లో వ్యవసాయరంగ కేటాయింపులు........ 26
   - సహజ పద్ధతిలో మామిడి పండ్లను పండిద్దాం-ఆరోగ్యాన్ని కాపాడుకుందాం........ 28
   - వ్యవసాయ పదవినోదం........ 31
   - ఏప్రిల్ మాసంలో ఉద్యానపంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు........ 32
   - వేసవి కూరగాయల సాగులో చేపట్టవలసిన ప్రత్యేక యాజమాన్య పద్ధతులు........ 34
   - వేసవికాలంలో ఆయిల్‌పామ్ తోటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు........ 36
   - సీతాఫలం ఆధారిత అగ్రోఫారెస్ట్రీ పద్ధతి........ 38
   - ఉద్యానవన పంటలలో ఎరల (ట్రాప్స్) యొక్క ప్రాముఖ్యత........ 40
   - వేసవిలో మోతి బాజ్ర సాగు పాడి రైతులకు లాభదాయకం........ 44
   - లాభసాటి పాడికోసం దూడల సంరక్షణకు పాటించవలసిన పదిసూత్రాలు........ 45
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు........ 46
6. రైతన్నకో ప్రశ్న........ 47
7. విశ్వవిద్యాలయ వార్తలు........ 48
8. రైతు విజయగాథ
   - నల్లరేగడి నేలల్లో శనగకు బదులుగా ధనియాలతో పంట మార్పిడి చేసి అధిక దిగుబడులు ఆర్జిస్తున్న రైతుల విజయగాథ........ 49

ఏప్రిల్ మాసం క్యాలెండర్ - 2025

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర చైత్ర శుద్ధ తదియ నుండి వైశాఖ శుద్ధ తదియ వరకు

SUN ఆది రాహుకాలం సా. 4.30-6.00	MON సోమ రాహుకాలం ఉ.7.30-9.00	TUE మంగళ రాహుకాలం మ.3.00-4.30	WED బుధ రాహుకాలం మ.12.00-1.30	THU గురు రాహుకాలం మ.1.30-3.00	FRI శుక్ర రాహుకాలం ఉ.10.30-12.00	SAT శని రాహుకాలం ఉ.9.00-10.30
		1 చైత్ర శుద్ధ తదియ ఉ. 9-54 భరణి ప. 3-24 రా.వ. 2-37 ల 4-07	2 చవితి ఉ. 7-33 పంచమి తె. 5-25 కృత్తిక ప. 1-50 తె.వ. 4-55 ల	3 షష్ఠి తె. 3-28 రోహిణి ప. 12-26 ఉ.శే.వ. 6-25 సా.వ. 5-46 ల 7-17	4 సప్తమి రా. 1-49 మృగశిర ఉ. 11-17 రా.వ. 7-24 ల 8-57	5 అష్టమి రా.12-31 ఆర్ద్ర ఉ. 10-27 రా.వ. 10-14 ల 11-48
6 నవమి రా. 11-38 పునర్వసు ఉ. 10-00 సా.వ. 6-00 ల 7-36	7 దశమి రా. 11-14 పుష్యమి ఉ. 10-00 రా.వ. 11-04 ల 12-42	8 ఏకాదశి రా. 11-20 ఆశ్రేష ఉ. 10-30 రా.వ. 11-00 ల 12-40	9 ద్వాదశి రా. 11-56 మఘ ఉ. 11-29 రా.వ. 7-59 ల 9-41	10 త్రయోదశి రా. 1-01 పుబ్బ ప. 12-58 రా.వ. 8-44 ల 10-28	11 చతుర్దశి రా. 2-32 ఉత్తర ప. 2-53 రా.వ. 12-05 ల 1-50	○ 12 పూర్ణిమ తె. 4-22 హస్త సా. 5-10 రా.వ. 2-00 ల 3-46
13 చైత్ర బ॥ పాడ్యమి పూర్తి చిత్ర రా. 7-41 రా.వ. 1-54 ల 3-40	14 పాడ్యమి ఉ. 6-25 స్వాతి రా. 10-18 తె.వ. 4-29 ల	15 విదియ ఉ. 8-30 విశాఖ రా. 12-49 ఉ.శే.వ. 6-15 వ తె.వ. 5-11 ల	16 తదియ ఉ. 10-24 అనూరాధ తె. 3-06 ఉ.శే.వ. 6-57 వ	17 చవితి ప. 12-00 జ్యేష్ఠ తె. 5-02 ఉ.వ. 9-08 ల 10-52	18 పంచమి ప. 1-11 మూల పూర్తి ప.వ. 1-13 ల 2-51 తె.వ. 4-50 ల	19 షష్ఠి ప. 1-55 మూల ఉ. 6-37 ఉ.శే.వ. 6-37 సా.వ. 4-37 ల 6-17
20 సప్తమి ప. 2-06 పూర్వాషాఢ ఉ. 7-36 ప.వ. 3-46 ల 5-24	21 అష్టమి ప. 1-49 ఉత్తరాషాఢ ఉ. 8-05 ప.వ. 12-06 ల 1-42	22 నవమి ప. 1-03 శ్రవణం ఉ. 8-08 ప.వ. 12-04 ల 1-38	23 దశమి ప. 11-50 ధనిష్ఠ ఉ. 7-42 ప.వ. 2-40 ల 4-13	24 ఏకాదశి ఉ. 10-14 శతభిషం ఉ. 6-53 పూర్వాభాద్ర తె. 5-42 ప.వ. 12-58 ల 2-29	25 ద్వాదశి ఉ. 8-21 ఉత్తరాభాద్ర తె. 4-19 ప.వ. 2-45 ల 4-15	26 త్రయోదశి ఉ. 6-11 చతుర్దశి తె. 3-48 రేవతి రా. 2-46 ప.వ. 3-32 ల 5-02
● 27 అమావాస్య రా. 1-22 అశ్విని రా. 1-07 రా.వ. 9-23 ల 10-53	28 వైశాఖ శు॥ పాడ్యమి రా. 10-57 భరణి రా. 11-28 ఉ.వ. 10-03 ల 11-32	29 విదియ రా. 8-36 కృత్తిక రా. 9-53 ఉ.వ. 10-40 ల 12-10	30 తదియ సా. 6-23 రోహిణి రా. 8-27 ప.వ. 12-56 ల 2-26 రా.వ. 1-47 ల 3-18			

01 రంజాన్ తదుపరి దినం
05 బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి
06 శ్రీరామ నవమి
14 డా॥ బి. ఆర్. అంబేద్కర్ జయంతి
18 గుడ్ ఫ్రైడే

10 మహావీర్ జయంతి
14 తమిళ్ న్యూఇయర్స్ డే
30 బసవ జయంతి

రేవతి కార్తె (31.03.25 నుండి 13.04.25)

అశ్విని కార్తె (14.04.25 నుండి 27.04.25)

సజ్జ : వేసవి పైరు కోతలు

వరి : కోతలు కత్తెరకు(కృత్తిక) వరి నారు పోయుట

భరణి కార్తె (28.04.25 నుండి 10.05.25) వేసవి పనులు

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు - రైతు సమగ్ర అభివృద్ధికి సోపానాలు

అల్దాస్ జానయ్య
ఉపకులపతి

భారతదేశంలో రైతులు ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నప్పటికీ గత దశాబ్ద కాలంలో వ్యవసాయంలో గణనీయమైన ప్రగతి కనిపిస్తోంది. రైతులందరూ ఎవరికి వారుగా ఉంటే వ్యక్తిగతంగా వ్యవసాయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న కమతాలతో అటు వాతావరణంతోనూ, ఇటు ఆర్థిక సామాజిక పరిస్థితులతోనూ పోరాటం చేస్తున్న రైతుని గెలిపించేందుకు, రైతుల శ్రేయస్సు మరియు సమగ్ర అభివృద్ధి కోసం అసంఘటితంగా ఉన్న రైతులను సంఘటిత పరిచి, రైతులందరిని ఒక తాటి మీదికి తీసుకురావడానికి మన ప్రభుత్వాల ముమ్మర ప్రయత్నంలో భాగంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు లేదా సంస్థలను (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్-ఎఫ్‌పిఓ) ఏర్పాటు చేసారు. ఈ ఆలోచన మూలం "సంఘే శక్తి కలియుగే" అన్నారు పెద్దలు. అంటే ఏ యుగంలోనైనా ఐక్యమత్యమే మహా బలమన్నది అందరికీ తెలిసిన సత్యమే (కలిసి ఉంటే కలదు సుఖము) కావున అసంఘటితంగా ఉన్న రైతులను సంఘటితంగా, కలిసికట్టుగా నిలుపుతూ విజేతలుగా నిలబెడుతున్నాయి.

ఓ ఏడాది కరువు, మరో ఏడాది అకాల వర్షాలు, చీడపీడల ఉధృతి వలన పంటలు సరిగా పండక పోవడం లేదా ఒకవేళ సమృద్ధిగా పండినా సరైన ధర లభించకపోవడం, మార్కెట్ విపణిలో దళారుల ప్రమేయం ఇవన్నీ రైతుకి అప్పులను మిగుల్చుతున్నాయి. ఇలాంటి తరుణంలో రైతులు సంఘటితమైతే కలిగే ప్రయోజనాలను కొన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘాల పనితీరు ద్వారా కళ్ళకు కట్టినట్లు కనపడుతున్నాయి. ఉదాహరణకు ముల్కనూరు కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మరియు మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, ప్రజామిత్ర రైతు మ్యాక్‌ఫెడ్ లిమిటెడ్, ఆర్మూర్ ఇంటిదీపం మ్యాక్స్. అన్నదాతల ఆదాయం పెంచడానికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఎంతో కృషి చేస్తున్నాయి. అంతేకాకుండా పెట్టుబడుల కోసం తక్కువ వడ్డీకి ఋణాలు అందించడం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు వంటి వాటిని తక్కువ ధరకు నేరుగా వాటి తయారీ కంపెనీ నుండి కొని రైతుకు అందించడం వలన పెట్టుబడి ఖర్చులు తగ్గి పంటల సాగు వ్యయం మిగిలే అవకాశముంది. అదేవిధంగా నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులను మంచి ధరకు అమ్మడం ద్వారా రైతులకు మరియు వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుంది. మనదేశంలో ఉద్యాన పంటలను పండించే రైతులలో సరైన పంటకోతానంతర సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, క్షేత్రస్థాయిలో కావాల్సినన్ని ఆహారశుద్ధి, విలువ జోడింపు పరిశ్రమలు లేకపోవడం వలన పంట ఉత్పత్తిలో సుమారు 30 శాతం వరకు నష్టాలను చవిచూడాల్సివస్తున్నది. ఇలా పాడయ్యే వాటి విలువ దేశం మొత్తం మీద నలభై వేల కోట్లలో ఉంటుందని అంచనా. దీనికి మేలైన పరిష్కారంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను రూపొందించి, చట్టపరంగా ఈ సంఘాలను సమిష్టి సంస్థగా నిర్వహించడం ద్వారా రైతుకు మెరుగైన ఆదాయం లభిస్తుందని చెప్పవచ్చును.

దేశంలో ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం 10,000 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటయ్యాయి. అయితే దాదాపు ఆరు లక్షల గ్రామాలున్న మనదేశంలో వ్యవసాయరంగంలో కోరుకున్న మార్పు రావాలంటే ఇలాంటి ఎఫ్‌పిఓలు ఇంకా చాలా ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా రైతులందరూ కదిలితే అప్పుడు నిజంగానే రైతు రాజవుతాడు, రాబడి రెట్టింపవుతుంది.

మన తెలంగాణ ఉమ్మడి 10 జిల్లాల్లో 119 రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఉన్నాయి. వీటి ద్వారా ముఖ్యంగా మన రాష్ట్ర రైతాంగం వరి, ప్రత్తి, కందులు, సోయాచిక్కుడు, మినుములు, పెసర్లు మరియు సేంద్రియ పంటలను పండించి, విక్రయించడం ద్వారా లాభాలను ఆర్జిస్తున్నారు. అంతేకాకుండా ఎఫ్‌పిఓ ఆధ్వర్యంలో కస్టమ్స్ హైరింగ్ సెంటర్ ఏర్పాటుచేసి వ్యవసాయ పనిముట్లను మార్కెట్ రేటు కంటే తక్కువకు అద్దెకు ఇవ్వడం, జిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేసి సిసిఐకి అద్దెకివ్వడం, రైతుల నుండి నేరుగా పండ్లు, కూరగాయలు కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని ఔట్‌లెట్ దుకాణాలకు తరలించడం, కిసాన్‌మార్ట్ యాప్ ద్వారా పలు పంట ఉత్పత్తులను ఇంటింటికి విక్రయిస్తూ మంచి లాభాలను పొందుతున్నారు. తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్రకు చెందిన కొన్ని సేంద్రియ రైతుసంఘాలు కలిసి 'సహజ ఆహారం ప్రొడ్యూసర్ కంపెనీ' ని పెట్టుకొని "సహజ ఆహారం" అన్న బ్రాండ్ పేరుతో తమ ఉత్పత్తుల్ని అమ్ముతున్నాయి. మన రాష్ట్రంలో బేనిషాన్ రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య రాష్ట్ర వ్యాప్తంగా 56 రైతు సంఘాలు పండిస్తున్న పండ్లు, కూరగాయల్ని మార్కెట్ చేస్తూ కోట్ల రూపాయలలో టర్నోవర్ సాధిస్తున్నది.

కావున మన రాష్ట్ర రైతాంగం వీటిని ఆదర్శంగా తీసుకొని, సంఘాల ప్రాముఖ్యత గురించి అవగాహన చేసుకొని ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో తమ పరిధిలో సంస్థలను ఏర్పాటు చేసుకొని, విశ్వవిద్యాలయం అందించే అధిక దిగుబడినిచ్చే వంగడాలను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ తాము పండించే పంటలకు, ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలు అందిపుచ్చుకోవాలని ఆశిస్తూ...

(అల్దాస్ జానయ్య)
ఉపకులపతి

వరి

- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి పైర్లు చిరుపొట్ట దశ నుండి ఈనిక దశలో ఉన్నాయి. ముందుగా వేసిన కొన్ని ప్రాంతాల్లో కోతదశలో ఉన్నాయి.
- చిరుపొట్ట దశ లోపు నత్రజని మరియు పొటాష్ ఎరువులు వేయడం పూర్తి చేయాలి. నీటి సమస్య ఉన్నచో ఆరుతడిగా నీరు పెట్టుకోవాలి
- చిరుపొట్ట నుండి ఈనిక దశ కీలక దశ. ఈ దశలో వరి నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి.
- క్రమం తప్పకుండా పైరును గమనిస్తూ పురుగులు మరియు తెగుళ్ళ ఉధృతిని అంచనా వేసుకోవాలి. ఒకవేళ నష్టపరిమితి స్థాయి దాటే అవకాశం ఉన్నచో తగు సస్యరక్షణ చర్యలు నిపుణుల సలహా మేరకు చేపట్టాలి.
- గత రెండు సంవత్సరాల నుండి యాసంగి వరిలో కాండం తొలుచు పురుగు అధికంగా ఆశించి నష్టపరుస్తుంది. ఎకరాకు 3-4 లింగాకర్షక బుట్టలు అమర్చి రెక్కల పురుగుల ఉధృతిని గమనించాలి. ఈ పురుగు నివారణకు చిరు పొట్ట దశలో ఉన్న వరి పైర్లలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% ఎస్.పి 400 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5% ఎస్‌సి 60 మి.లీ. లేదా టెట్రానిలిప్రోల్ 18.18% ఎస్‌సి 100 మి.లీ. ఎకరానికి పిచికారి చేయాలి.
- అలాగే ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితుల్లో ఆకునల్లి ఆశించి ఆకుల వెనుక నుండి రసాన్ని పీల్చడం వలన ఆకులు లేత ఆకుపచ్చ లేదా పసుపు రంగుకు మారతాయి. ఈ పురుగు నివారణకు స్పైరోమెసిఫెన్ 200 మి.లీ. 200 లీటర్ల నీటితో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.
- గింజ పాలుపోసుకునే దశలో మెడవిరుపు లక్షణాలు తొలిదశలో గమనించినట్లైతే ఎకరానికి ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ 500 గ్రా. లేదా ఐసోప్రోథయోలేన్ 320 మి.లీ. లేదా కాసుగామైసిన్ 500 మి.లీ. పిచికారి చేయాలి. ఉధృతి అధికంగా ఉన్నట్లైతే ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ 25% + టెబ్యుకొనజోల్ 50% (75 డబ్ల్యుజి) 80 గ్రా. లేదా పికాక్సీస్ట్రోబిన్ 6.78% + ట్రైసైక్లోజోల్ 20.33% ఎస్‌సి 400 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 16.7% + ట్రైసైక్లోజోల్ 33.3% ఎస్‌సి 200 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 18.2% + డైఫెన్‌కొనజోల్ 11.4% ఎస్‌సి 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.
- విత్తనోత్పత్తి చేపట్టే రైతులు బెరుకులు/కేళీలు/ కల్తీ మొక్కలు (రోగింగ్) ఏరి వేయుటకు ఈనిక దశ ముఖ్యమైనది. రైతులు ఒక చిన్న మడిని ఎంచుకొని బెరుకులు/కేళీలు ఏరివేసి వేరుగా కోసి, నూర్పిడి చేసి, ఎండ బెట్టుకొని తమ విత్తనమును తామే తయారు చేసుకొని వాడుకోవచ్చు.
- కోత దశలో గింజ రాలటం తగ్గించాలంటే కర్ర పచ్చి మీద 80% గింజలు పక్వానికి వచ్చినప్పుడు కోత కోయాలి.

డా॥ సిహెచ్. దామోదర్ రాజు, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 9440225385

మొక్కజొన్న

- డిసెంబర్ మాసంలో విత్తుకున్న మొక్కజొన్న పైరు కోతకు సిద్ధంగా ఉంటుంది. పంట పరిపక్వ దశకు చేరుకున్నప్పుడు కోత చేపట్టాలి. కండెల పై పొర ఎండిపోవుట, కొన్ని రకాలలో గింజ అడుగు భాగంలో నల్లటి చారలు ఏర్పడుట వంటి లక్షణాలను బట్టి పరిపక్వదశను గుర్తించవచ్చు. గింజలలో 25-30 శాతం తేమ ఉన్నప్పుడు కోత చేపట్టాలి. కండెలను 2-3 రోజులు ఎండలో ఆరబెట్టి సుమారు 15 శాతం తేమ ఉన్నప్పుడు నూర్పిడి యంత్రాల సహాయంతో నూర్పిడి చేసి గింజలను ఎండబెట్టాలి.
- గోదాములలో నిల్వ చేయదలచుకున్నచో సుమారు 10 శాతం తేమ ఉన్న గింజలను నిల్వ చేయాలి. హైబ్రిడ్ వంగడాల నుండి

వచ్చిన గింజలు విత్తనం కొరకు పనికిరావు. కాబట్టి వాటికి వేపాకు పొడిని (5 గ్రా. ఒక కిలో గింజలకు) కలిపి నిల్వ చేసుకోవచ్చు. మార్కెట్ ధర బాగుంటే వెంటనే అమ్ముకోవచ్చు.

- వరి మాగాణుల్లో నేల దున్నకుండా మొక్కజొన్నను జనవరి మాసంలో విత్తుకుని ఉంటే పైరు కండె దశలో ఉంటుంది కాబట్టి నీటి ఎద్దడి లేకుండా చూడాలి. పక్షుల బారి నుండి రక్షణ కొరకు వెలుపలి 2-3 వరుసలలో కండె ప్రక్కనున్న ఒకటి లేదా రెండు ఆకులతో పీచు కనబడకుండా కండెలను చుట్టవలెను. మెరిసే రిబ్బన్లను ఉత్తర దక్షిణ దిశలలో పైరు పైన ఒకమీటరు ఎత్తులో కట్టవలెను.
- కండెదశలో కత్తెర పురుగు ఆశించినట్లైతే ఎదిగిన లార్వాలను ఏరించి కిరోసిన్‌లో వేసి చంపివేయాలి. పురుగు మందులు పిచికారి చేయడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చును.
- తీపి మరియు బేబికార్న్ మొక్కజొన్న రకాలపై పీచు దశలో ఎలాంటి మందులు పిచికారి చేయరాదు.
- పంటకోత పూర్తి అయినచో ఎండాకాలం లోతు దుక్కులను ప్రారంభించాలి.

చిరుధాన్యాలు

సజ్జ: వేసవిలో విత్తిన సజ్జ కోత దశలో ఉంటుంది. కావున కంకులను కోసి పలుచగా ఆరబెట్టాలి. బాగా ఆరిన కంకులను కర్రలతో కొట్టిగాని, ట్రాక్టరు నడపడం ద్వారా గాని, నూర్పిడి యంత్రంతో గాని నూర్పిడి చేసి గింజలను ఎండబెట్టి నిల్వచేసుకోవాలి.

రాగి: వేసవిలో సాగు చేసిన రాగి గింజ గట్టి పడేదశ, పంటకోత దశలో ఉంటుంది. గింజలు ముదురు గోధుమ రంగులోకి మారి గట్టిబడిన తరువాత వెన్ను దగ్గర ఆకులు పండినట్లుగా ఉంటాయి. పిలక కంకుల కంటే ప్రధాన కాండపు కంకి మొదలు కోతకు వస్తుంది. కాబట్టి 2-3 దశల్లో కంకులను కోయాలి. కంకులను రెండు విధాలుగా కోయవచ్చు. కేవలం వెన్నులనే కోయాలి లేదా వెన్నులతో పాటు చొప్పను కోసి 2-3 రోజులు ఆరిన తరువాత వెన్నులను విడదీయవచ్చు. బాగా ఆరిన వెన్నులను కర్రతో కొట్టిగాని, ట్రాక్టర్ నడపడం ద్వారా గాని, నూర్పిడి యంత్రంతో గాని నూర్పిడి చేయాలి. వరి కోసే యంత్రముతో జల్లెడ మార్చి రాగి పంటను కోసుకోవచ్చు. బాగా ఆరిన గింజలను శుభ్రపరిచి భద్రపరుచుకోవాలి.

కొర్ర: కోతదశలో ఉన్న పంట ఆకులు పసుపురంగుకు మారుతాయి. పంటను కోసి పశువులతోగాని, ట్రాక్టరుతోగాని, నూర్పిడి యంత్రంలోగాని నూర్పిడి చేయాలి. గింజలను బాగా ఎండబెట్టి నిల్వచేసుకోవాలి.

జొన్న: పంటకోత అనంతరం కంకులను నూర్పిడి చేసుకొని, ఎండబెట్టుకొని గింజను 10-12 శాతం తేమ వద్ద నిల్వచేసుకోవాలి. చొప్పను కట్టలుగా కట్టుకొని నిల్వ చేసుకోవాలి. పొలంలో పంట అవశేషాలను నిర్మూలించుకోవాలి.

డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874

వేరుశనగ

- ప్రస్తుతం యాసంగిలో సాగు చేసిన వేరుశనగ కోత దశలో ఉంది. కాయల్లోని లోపలి భాగం ముదురు గోధుమ వర్ణం లోకి మారినప్పుడు కోతకు వచ్చినట్లు గుర్తించాలి. మొక్కల్లోని 75 శాతం కాయలు పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాత కోయాలి.
- వానాకాలం వేరుశనగ విత్తనం కోసం సాగు చేసిన రైతులు కోసిన తరువాత కట్టలు కట్టి నీడలో ఆరబెట్టి తేమశాతం 8-9% వరకు వచ్చేలా చూసుకోవాలి.

- కాయలు ఎండిన తరువాత గోనెసంచిలో నింపి చెక్కబల్లపై ఉంచి నిల్వ చేసుకోవచ్చు. నిల్వ చేసిన విత్తనంపై 2 నుంచి 3 వారాలకొకసారి 5% మలాథియాన్ పొడిని చల్లుకొని విత్తనాన్ని ఆశించు పురుగుల నుంచి సంరక్షించుకోవాలి.
- ఎండాకాలంలో సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం పూత మరియు ఊడలు దిగే దశలో ఉంది. కాబట్టి రైతులు ఎటువంటి అంతరకృషి చేయరాదు. ఎకరానికి 200 కిలోల జిప్సంను పూత దశలో వేసుకోవాలి.

ఆముదం

- యాసంగిలో సాగు చేసిన ఆముదం ప్రస్తుతం కోత దశలో ఉంది. అన్ని కాయలు పక్వానికి వచ్చిన తర్వాత గెలలు కోసి ఎండబెట్టిన తరువాత నూర్పిడి చేయాలి.
- సాంప్రదాయ పద్ధతిలో వెడల్పాటి కర్రతో కొట్టి లేదా నూర్పిడి యంత్రాలతో గింజను వేరు చేసుకోవాలి.
- ఆలస్యంగా సాగు చేసిన ఆముదం రెండవ మరియు మూడవ గెల దశలో ఉంది.
- ఈ దశలో అధిక ఉష్ణోగ్రతల వల్ల తామర పురుగులు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.5 గ్రా. థయోమిథాక్సామ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నియంత్రించవచ్చు.

నువ్వులు

- జనవరిలో విత్తిన నువ్వు పంట ప్రస్తుతం కాయ అభివృద్ధి మరియు గింజ ఏర్పడే దశలో ఉంది. ఈ దశలో పలుచటి నీటి తడి ఇవ్వడం వలన పిందెలు బాగా నిలుస్తాయి.
- ఫిబ్రవరిలో విత్తిన నువ్వు పంట ప్రస్తుతం 30-45 రోజుల దశలో ఉంది. ఈ సమయంలో ఒక తేలిక పాటి నీటి తడితో పాటు ఎకరానికి 20-25 కిలోల యూరియాను పైపాటుగా వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయి.
- కాయతొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకపు పొడి 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ప్రొద్దుతిరుగుడు

- వేసవి పంటగా జనవరిలో విత్తిన ప్రొద్దుతిరుగుడు ప్రస్తుతం గింజ కట్టే దశలో మరియు కోత దశలో ఉంది. పువ్వు వెనుక భాగం నిమ్మ పచ్చరంగుకి మారిన తరువాత, పువ్వులను కోసి 2-3 రోజుల పాటు ఆరనివ్వాలి.
- ఆలస్యంగా ఫిబ్రవరిలో విత్తిన పంటలో రెండవ దఫా యూరియా 16 కిలోలు ఎకరానికి చొప్పున వేసుకోవాలి.
- మొగ్గ తొడుగు దశ, పువ్వు వికసించే దశ మరియు గింజ కట్టే దశల్లో నీటి తడులు ఇవ్వాలి. సాళ్ళ పద్ధతిలో సాలు మార్చి సాలుకు నీరు ఇవ్వడం ద్వారా నీటి యొక్క వినియోగం పెరుగుతుంది. అదే విధంగా నీటి తడులు తగు సమయంలో ఇవ్వడం వలన స్క్లిరోషియం వడలు తెగులు వ్యాప్తిని తగ్గించవచ్చు.
- ఈ దశలో పక్షుల బెడద ఎక్కువగా ఉంటుంది. వీటి నుండి రక్షణకు మెరుపు రిబ్బనులను పైరు పైన అడుగు ఎత్తున, సూర్యరశ్మి రిబ్బనుపై పడేలా కట్టుకోవాలి. శబ్దం చేయడం ద్వారా లేదా దిష్టి బొమ్మలను ఉపయోగించి పక్షుల నుండి పంటను రక్షించుకోవచ్చు.

కుసుమ

- ఏకపంటగా లేదా స్వల్పకాలిక అపరాల తర్వాత కుసుమను విత్తుకునే ప్రాంతాలలో వర్షం పడినప్పుడు వేసవి లోతు దుక్కులు చేసుకోవాలి.

డా॥ యన్. వాణిశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.8186945838

అపరాలు

వేసవిలో విత్తిన పెసర మరియు మినుము మొగ్గ దశలో ఉన్నవి. వేసవిలో క్రమేపి ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గడం మరియు పగలు/రాత్రి ఉష్ణోగ్రతల వ్యత్యాసం పెరగడం వలన తొలిదశ నుండి పూత దశ వరకు రసం పీల్చే పురుగులైన తామర పురుగు, పేనుబంక మరియు తెల్లదోమ ఎక్కువగా ఆశిస్తాయి. వాటిని సకాలంలో గుర్తించి నివారించినచో వేసవిలో మంచి దిగుబడులు సాధించవచ్చు. పొలంలోను గట్ల మీద కలుపు లేకుండా చూసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను గమనించి వెంటనే పీకి నాశనం చేయవలెను. పొలంలో అక్కడక్కడ పసుపురంగు (తెల్లదోమలకు) మరియు నీలం రంగు (తామర పురుగులకు) జిగురు అట్టలను ఎకరాకు 20 ఉంచినట్లైతే వాటి ఉనికిని మరియు ఉధృతిని అంచనా వేసుకోవచ్చు. రసం పీల్చే పురుగుల నివారణకు 15-20 రోజుల వయసులో వేప గింజల కషాయం 5% లేక వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.

తామర పురుగులు: ఈ పురుగులు పైరు తొలిదశ నుండి పూత దశ వరకు ఆశిస్తాయి. ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేగాక ఆకుముడత అనే వైరస్‌ను వ్యాపింపచేస్తాయి. నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి తామర పురుగుల ఉధృతిని బట్టి వారం నుండి పది రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి. పైరు పూత దశలో ఉన్నప్పుడు తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లైతే తామర పురుగులతోపాటు మారుకా మచ్చల పురుగును కూడా నివారించవచ్చు

తెల్లదోమ: ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేగాక పల్లాకు తెగులును కూడా వ్యాపింపచేస్తాయి. దీని ద్వారా పల్లాకు తెగులు వ్యాప్తి చెందుతుంది. పల్లాకు తెగులు సోకిన మొక్కలను తొలిదశలోనే గుర్తించి వెంటనే తీసి కాల్చి వేయాలి. నివారణకు అంతర్వాహిక కీటకనాశినులైన ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పేనుబంక: పెద్ద-చిన్న పురుగులు ఆకుల నుండి రసంపీల్చి నష్టం కలిగిస్తాయి. నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పేనుబంక ఉధృతిని బట్టి వారం నుండి పది రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

మారుకా మచ్చల పురుగు: పూమొగ్గ దశలో వేప సంబంధిత మందులు పిచికారి చేసినట్లైతే ఈ పురుగు గ్రుడ్లు పెట్టకుండా చేయుట ద్వారా దీని ఉధృతిని తగ్గించుకొనవచ్చు. మరలా పూత తొలిదశలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే ఈ పురుగు నివారింపబడుతుంది. పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నట్లైతే ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అవసరమైతే పురుగు ఉధృతిని బట్టి 7 నుండి 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

పైరు బెట్టకు వచ్చి ఎదుగుదల తక్కువగా ఉన్నప్పుడు ఎకరాకు 1 కిలో పొటాషియం నైట్రేట్ పైపాటుగా పిచికారి చేసుకోవాలి. బెట్ట పరిస్థితుల్లో మరియు కీలక దశల్లో 2% యూరియా ద్రావణం (20 గ్రా. లీటరు నీటికి) మరియు 5 గ్రా. మల్టీ-కె లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో ఉపయోగకరంగా ఉంటుంది.

డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041

చెఱకు

- చెఱకును ఆలస్యంగా నాటుకునే సమయంలో ముచ్చెలను 10 శాతం సున్నపు నీటిలో 60 నిమిషాలు ముంచి నాటినట్లైతే నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.
- మోడెం తోటలలో ఖాళీలు ఉన్నప్పుడు 6 వారాల వయస్సు గల పాలిథీన్ సంచుల్లో పెంచిన అదే రకపు మొలకలతో ఖాళీలను నింపుకోవాలి. తోట నాటిన 40-50 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి 2-3 సార్లు గొర్రుతో లేదా దంతెతో అంతరకృషి చేయాలి లేదా కూలీలతో కలుపు తీయించాలి లేదా ఎకరానికి 1500 మి.లీ. 2,4-డి ఇథైల్ ఎస్టర్ 38% ఇ.సి పిచికారి చేసుకోవాలి. తోట నాటిన 60 రోజుల వ్యవధిలో వెడల్పాటి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరానికి 1300 గ్రా. 2,4-డి సోడియం సాల్ట్ 80% డబ్ల్యుపి పొడి లేదా ఎకరానికి 12 గ్రా. మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ 20% డబ్ల్యుపి మందును చెఱకు ఆకులపై పడకుండా వరుసల మధ్య మాత్రమే పిచికారి చేసుకొని నివారించుకోవచ్చు. తుంగ జాతి కలుపు అధికంగా ఉన్న సందర్భాలలో ఎకరానికి 36 గ్రా. హేలోసల్ఫ్యూరాన్ మిథైల్ మందును పిచికారి చేసుకోవాలి.
- నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు బిందు సేద్యం ద్వారా నీటిని పొదుపుగా వాడుకోవడం, ఎరువులను ఫర్టిగేషన్ ద్వారా అందించడము లాభదాయకంగా ఉంటుంది.
- మొక్క తోటలో చెఱకు నాటిన మూడవ రోజున చెఱకు చెత్తను నేలపై పలుచగా (1.25 ట/ఎ) వేసి మట్టితో కప్పితే మంచి సేంద్రియ ఎరువుగా వినియోగపడుతుంది. ఒక టన్ను చెఱకు చెత్త చివకడానికి ఒక కిలో శిలీంధ్రపు సముదాయం (చివకడానికి దోహదపడే శిలీంధ్రం) కుళ్ళబెట్టే శిలీంధ్రాల పొడిని (ఆస్పర్‌జిల్లస్ ఫ్లావిస్, పెన్సీలియం క్రైసోజీనమ్, కాక్లియోబోలాస్ స్పైసిఫెర్, రైజోఫాస్ ఒరైజ్ మరియు ట్రైకోడెర్మా విరిడి) పేడ నీళ్ళలో కలిపి చల్లాలి. దీనితో సహా 10 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 8 కిలోల యూరియా కూడా చల్లితే భూమిలో తేమ నిలబడడమే కాకుండా చెత్త బాగా చివికి మంచి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- ఈ మాసంలో పిలకదశలో ఉన్న చెఱకులో కాటుక తెగులు కూడా పంటను ఆశిస్తుంది. తెగులు సోకిన మొక్కల్లో మొవ్వ పొడవైన నల్లని కొరడాలా మారుతుంది. చెఱకు దిగుబడి, రస నాణ్యత తగ్గుతుంది. ఈ తెగులు విత్తనపు ముచ్చెల ద్వారా వ్యాపిస్తుంది. తెగులు సోకిన దుబ్బులను తీసి తగులబెట్టాలి. తెగులు నివారణకు 1 మి.లీ. అజోక్సీస్ట్రోబిన్ 18.2% డబ్ల్యుడబ్ల్యు + డైఫెన్‌కొనజోల్ 11.4% డబ్ల్యుడబ్ల్యు మందు ద్రావణం పిచికారి చేయడం వలన ఈ తెగులు ఒక మొక్క నుండి ఇంకొక మొక్కకు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. అంతేకాకుండా వాతావరణంలో తేమ శాతం తక్కువగా ఉండి, ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు, పంట నీటి ఎద్దడికి గురి అయినప్పుడు పీక పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. బాల్య దశలో పీక పురుగుగా, కాండం ఏర్పడిన తర్వాత కాండం తొలుచు పురుగుగా చెఱకు పైరును నష్టపరుస్తుంది. పీక పురుగు తాకిడి వర్షాధారపు చెఱకుపై ఎక్కువగా కనిపిస్తుంది. పురుగు ఆశించిన తోటలలో 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్ 20% ఇ.సి లేదా 0.75 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ 18.5% యస్.సి లేదా ఫిప్రోనిల్ 5% మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 జి గుళికలను ఎకరాకు 7.5 కిలోల చొప్పున నేలలో వేసుకోవాలి.

డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్
వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్,
ఫోన్ నెం. 9849535756

వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాల (జూన్ నుండి సెప్టెంబర్) కాలంలో 962.6 మి.మీ వర్షపాతం (+30 శాతం), పోస్ట్ మాన్సూన్ సీజన్‌లో (అక్టోబర్ నుండి డిసెంబర్) 86.5 మి.మీ వర్షపాతం (-24 శాతం), చలి కాలంలో (జనవరి నుండి ఫిబ్రవరి) 0.2 మి.మీ వర్షపాతం (-98 శాతం) మరియు వేసవి కాలంలో (మార్చి) 6.6 మి.మీ. వర్షపాతం (-45 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (02.04.2025) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి-120 శాతం (5695245), జొన్న-243 శాతం (339505), మొక్కజొన్న-147 శాతం (863538), కంది-285 శాతం (9117), శనగ-66 శాతం (221208), పెసర-54 శాతం (12449), మినుములు-103 శాతం (49686), ఉలవలు-59 శాతం (694), వేరుశనగ-95 శాతం (249727), ప్రొద్దుతిరుగుడు -93 శాతం (21062) మరియు కుసుమ-59 శాతం (7033) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం యాసంగి పంటకాలంలో ఇప్పటి వరకు 120 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 126 శాతం, పప్పుదినుసులు 71 శాతం, నూనె గింజల పంటలు 87 శాతం సాగుచేయటం జరిగింది.

భారత వాతావరణ విభాగం న్యూఢిల్లీ వారి ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం రాష్ట్రంలో ఏప్రిల్ మాసంలో కనిష్ట మరియు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం నుండి సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే సూచనలున్నాయి మరియు వర్షపాతం సాధారణం నుండి సాధారణం కంటే తక్కువ నమోదయ్యే సూచనలున్నాయి.

వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు:

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని పంట దశ మరియు నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి తేమ సున్నిత దశలలో పంటకు నీటి తడులు ఇవ్వాలి.
- వరి పంటలో పొట్ట మరియు పూత దశల్లో (10 శాతం వెన్ను నుండి పూత బయటకు వచ్చినప్పుడు) 0.5% పొటాషియం నైట్రేట్ పిచికారి చేయడం వలన వరి పంటలో అధిక ఉష్ణోగ్రతల వలన కలిగే దిగుబడి నష్టాన్ని తగ్గించవచ్చు .
- పండ్లతోట 6 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నట్లయితే, 150-240 లీటర్ల నీరు ఒక రోజుకి ఒక చెట్టుకి అవసరం. అవకాశం ఉన్నచోట సేంద్రీయ మల్చింగ్‌తో పాటు బిందు సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి.
- మల్చింగ్ చేయడం వలన నేలలో తేమ ఎక్కువ కాలం నిలువ ఉండి మొక్కకు అందుబాటులో ఉంటుంది. వరి గడ్డి లేదా స్థానికంగా లభించే సేంద్రీయ లేదా పాలిథిన్ షీట్లను మొక్కల మొదళ్ళ చుట్టూ కప్పాలి.
- మామిడి తోటలో ఏప్రిల్-మే మాసంలో 1% పొటాషియం నైట్రేట్ (13-0-45) మందును 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- ఒకటి లేదా రెండు సంవత్సరాల వయస్సు గల తోటలు లేదా క్రొత్తగా నాటిన పండ్ల తోటల చుట్టూ వేసవిలో వడగాల్పుల ప్రభావం తగ్గించడానికి సరుగుడు లేదా వెదురు మొక్కలను నాటుకోవాలి.
- బిందు సేద్యం చేసే పంటలలో ప్రతిరోజూ అరగంట (ఉదయం మరియు సాయంత్రం) రెండుసార్లు నీటిని ఇవ్వాలి.
- 50% షేడ్ నెట్‌ని ఉపయోగించడం ద్వారా పంటలపై అధిక ఉష్ణోగ్రత మరియు వడగాల్పుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.
- కోళ్ళు పొడి మరియు వేడి వాతావరణాన్ని తట్టుకొనుటకు షెడ్లల్లో ఫ్యాన్లను మరియు ఫాగర్స్ ను అమర్చి షెడ్లను వరిగడ్డితో కప్పి స్ప్రింక్లర్లను అమర్చాలి.
- కోళ్ళు ఎక్కువ మోతాదులో తినుటకు అనుగుణంగా మెత్తటి దాణాను పెట్టి త్రాగుటకు చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి.
- పొడి మరియు అధిక ఉష్ణోగ్రతల వలన పాలలో వెన్న శాతం తగ్గకుండా ఉండుటకు పాలిచ్చు ఆవులు మరియు గేదెలకు పూత దశలో ఉన్న పశుగ్రాసాలను మేతగా వేయవలెను.
- పండ్లతోటలలో వేసవి కాలంలో గుంతలు తీసి ఎండకు ఎండనివ్వాలి. దీని వల్ల నేలలో ఉన్న పురుగులు, వాటి గుడ్లు, తెగుళ్ళను కలిగించే శిలీంద్రాలు నశిస్తాయి. ఆ తర్వాత పండ్ల మొక్కలు నాటుకోవటం మంచిది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9492359789

వరిలో కంకినల్లి మరియు సుడిదోమ యాజమాన్యం

డా॥ ఆర్. శ్రవన్ కుమార్, బి. మాధవి, డా॥ వై. హరి,
డి. అశ్విని, జి. నీలిమ, డా॥ బి. సతీష్ చంద్ర,
డా॥ సిహెచ్. రాములు, డా॥ వి. వెంకన్న,
డా॥ కె. రాజేంద్రప్రసాద్, డా॥ యు. నాగభూషణం,
డా॥ సిహెచ్. అనూష మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్

తెలంగాణ రాష్ట్రంలో వరి చాలా ముఖ్యమైన ఆహార పంట. గత కొద్ది సంవత్సరాల నుండి వానాకాలంలో మరియు యాసంగిలో అధిక విస్తీర్ణంలో వరిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగిలో వరి పంట వివిధ దశలలో ఉన్నది. పంట తర్వాత దశలో కంకినల్లి మరియు సుడిదోమ ఆశించి నష్టంచేస్తాయి. వీటి వలన కలిగే నష్టము మరియు చేపట్టాల్సిన యాజమాన్య చర్యల గురించి క్రింద వివరించటం జరిగింది.

కంకినల్లి: ఈ పురుగులు నల్లిజాతికి చెంది, కంటికి కనిపించనంత చిన్నగా సూక్ష్మంగా ఉంటాయి. వాతావరణ ఉష్ణోగ్రతలను బట్టి 7-21 రోజులు ఈ నల్లి యొక్క జీవిత చక్రం పూర్తవుతుంది. గ్రుడ్లు తల్లి పురుగుల సైజులో మూడవ వంతు, పిల్ల పురుగులు తల్లిపురుగుల సైజులో సగం పరిమాణంలో ఉంటాయి. పగటి ఉష్ణోగ్రతలు 28-30^0 సెల్సియస్ ఉన్నప్పుడు, అధిక తేమ మరియు బెట్ట వాతావరణ పరిస్థితులు ఈ నల్లి వృద్ధి చెందటానికి అనుకూలంగా ఉంటాయి.

ఈ కంకినల్లి ఆకులు, కాండం, గింజలను ఆశించి నష్టం చేస్తాయి. ఇవి ఆకుల మధ్య ఈనెపై లేదా ఆకుమట్ట లేదా కాండం మీద ఆశించి పిల్ల మరియు తల్లి నల్లి పురుగులు రసాన్ని పీల్చుతాయి. అందువలన ఆకుల మధ్య ఈనెపై లేదా ఆకుమట్ట మీద, కాండం మీద గోధుమ నుండి నల్లటి మచ్చలు ఏర్పడతాయి. ఈ నల్లులు రసాన్ని పీల్చటం వలన వెన్నులు వంకర తిరగటం, వెన్నులు పాక్షికంగా బయటికి రావటం మరియు గింజల మీద గోధుమ లేదా నల్లటి మచ్చలు ఏర్పడతాయి. ముఖ్యంగా వీటి వలన గింజల బరువు మరియు సైజు తగ్గుతుంది. గింజలు సరిగ్గా ఏర్పడవు. గింజల మీద మచ్చలు ఏర్పడటం వలన వాటి నాణ్యత తగ్గి, గిట్టుబాటు ధర లభించదు. గింజల మొలకెత్తే శాతం తగ్గుతుంది. ఈ నల్లులు చేసిన సూక్ష్మరంధ్రాల ద్వారా ఇతర వ్యాధిని కలుగజేసే శిలీంధ్రాలు ప్రవేశించి ఎక్కువ నష్టం చేస్తాయి.

యాజమాన్యం:

- నాణ్యమైన కంకినల్లి ఆశించని విత్తనాన్ని సాగుకి ఉపయోగించాలి.
- విచక్షణారహితంగా పురుగు మందులను పిచికారి చేయకూడదు.
- స్పైరోమెసిఫెన్ అనే మందును 1 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ మందును చిరుపొట్ట దశలో వెన్నులు బయటికి వెలువడక ముందే పిచికారి చేసినట్లైతే కంకినల్లిని సమర్థవంతంగా అరికట్టవచ్చును.

సుడిదోమ: రెండు రకాల దోమలు (గోధుమ రంగు దోమ, తెల్లవీపు దోమ) వరిని ఆశించి నష్టం చేస్తాయి. యాసంగిలో మార్చి 2వ వారం నుండి ఏప్రిల్ వరకు పంటను ఆశిస్తాయి. దోమను తట్టుకోని రకాలను సాగుచేసినప్పుడు పొలంలో నీరు ఎక్కువగా నిల్వ ఉన్నప్పుడు, నత్రజనిని ఎక్కువగా వాడినప్పుడు, కాలిబాటలు తీయని పొలాల్లో, పంట తొలిదశలో ఆకులను ఆశించే పురుగుల నివారణకి క్లోరిపైరిఫాస్, ప్రొఫెనోఫాస్, లామ్డా సైహలోత్రిన్ మరియు బీటా సిఫ్లుత్రిన్ వంటి సింథటిక్ పైరథ్రాయిడ్ మందులు వాడినప్పుడు సుడిదోమ ఉధృతి పెరుగుతుంది.

పిల్ల మరియు పెద్ద దోమలు నీటి మట్టానికి పైన, దుబ్బుల మొదళ్ళ దగ్గర ఉండి రసాన్ని పీల్చుతాయి. దీనివలన పంట లేత పసుపు రంగుకి మారుతుంది. పంట సుడులు సుడులుగా వలయాకారంలో ఎండిపోతుంది. దోమ ఉధృతి ఎక్కువైతే పొలం ఎండిపోయి పడిపోవటం, తాలుగింజలు ఏర్పడటం, నూర్చినప్పుడు నూకశాతం పెరుగుట జరుగుతుంది.

యాజమాన్యం:

- ప్రతి 2 మీటర్లకి 20 సెం.మీ. చొప్పున పొలంలో వెడల్పాటి కాలిబాటలు ఉత్తరదక్షిణ దిశల్లో తీయాలి.
- నత్రజని సంబంధ ఎరువులను మోతాదును మించి వాడకూడదు.
- తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా బ్యుప్రోఫెజిన్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే డైనోటెఫ్యురాన్ 0.4 గ్రా. లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రా. లేదా ట్రైఫ్లుమెజోపైరిమ్ 0.485 మి.లీ. లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళపై పడేటట్లు పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9885257714

మార్చి 2025 మాసంలో పి.జె.టి.ఎ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు

క.సం.	తేది	అంశం
1.	01.03.2025	యాసంగి పంటలలో సూక్ష్మపోషక లోపాలు – సవరణ
2.	15.03.2025	చెఱకు చెత్త – మేలైన యాజమాన్యం
3.	15.03.2025	నూతన చెఱకు రకం – 2013ఆర్81
4.	17.03.2025	నువ్వుల పంటలో విత్తనోత్పత్తి – సూచనలు
5.	20.03.2025	మోడెం చెఱకు అధిక దిగుబడికి సూచనలు
6.	22.03.2025	మామిడి పిందె/కాయ దశలో పాటించాల్సిన యాజమాన్యం
7.	26.03.2025	అయిల్ ఫామ్ తోటల్లో అంతర పంటలతో లాభాలు – రైతు విజయగాథ
8.	27.03.2025	ఉద్యాన పంటల్లో విలువ జోడింపుతో అధిక ఆదాయం

యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన షార్ట్స్

క.సం.	తేది	అంశం
1.	05.03.2025	వేప నూనెతో ఎన్నో లాభాలు
2.	13.03.2025	పగిలిపోయే బలం యంత్రం ఉపయోగాలు (బర్స్టింగ్ స్ట్రెంత్ టెస్టింగ్)
3.	13.03.2025	తన్యత శక్తి యంత్రం (టెన్సల్ స్ట్రెంత్ ఎప్పరెట్యూస్)
4.	24.03.2025	రిఫ్రిజిరేషన్ టెస్ట్ రిగ్
5.	24.03.2025	షెల్ మరియు ట్యూబ్ ఎక్స్ఛేంజర్
6.	24.03.2025	వాక్యూమ్ సీలింగ్ మెషిన్

వరిలో డ్రోన్‌తో రసాయనిక గుళిక మందులు వెదజల్లటంలో మెళకువలు

కె. భార్గవి, కె. సుప్రియ, డా॥ టి. కిరణ్ బాబు,
డా॥ యన్. రామ్ గోపాల వర్మ,
డా॥ యస్. ఉపేందర్, డా॥ యన్. లింగయ్య
మరియు ఇప్ప వినయ్
వరి పరిశోధన సంస్థ, ఏఆర్ఐ, రాజేంద్రనగర్,
హైదరాబాద్

మారుతున్న కాలానికి తోడు, ఆధునికత వైపు అడుగులు వేసేలా వ్యవసాయంలో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతు ముంగిటకు తెస్తూ, అధిక దిగుబడికై కృషి చేయటంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. అందులో భాగంగా సాంప్రదాయ వరి సాగు విధానానికి నూతనత్వాన్ని జోడించి, వ్యవసాయాన్ని సులభతరం చేయటంలో భాగంగా డ్రోన్‌తో గుళిక మందులు వేయటానికి సంబంధించిన నిర్దిష్ట ప్రమాణాలు రూపొందించటంలో పరిశోధనలు చేపట్టడం జరిగింది. తద్వారా డ్రోన్ల ద్వారా ఈ క్రింద పేర్కొన్న విధంగా వివిధ పురుగుల యాజమాన్యంలో గుళిక మందులు విడిగా వాడాలి.

వరి పైరులో వివిధ పురుగుల యాజమాన్యంలో ధృవీకరించిన, వాడదగిన గుళిక మందులు:

క్ర.సం.	సిఫారసు చేయబడిన గుళిక మందు	మోతాదు (కిలో/ ఎకరాకు)	చీడపీడలు
1.	కార్బోఫ్యూరాన్ 3 సిజి	10	కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగు, ఆకుచుట్టు పురుగు, సుడిదోమ, ఉల్లికోడు, పచ్చదోమ
2.	కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి	8	కాండం తొలుచు పురుగు, వరి ఈగ, ఆకుముడత పురుగు
3.	క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి	4	కాండం తొలుచు పురుగు మరియు ఆకుముడత పురుగు
4.	క్లోరాంట్రానిలిప్రోల్ 0.50 + థయోమిథాక్సామ్	2.4	ఆకుముడత పురుగు, కాండం తొలుచు పురుగు, పచ్చదోమ మరియు సుడిదోమ
5.	ఫిప్రోనిల్ 0.3 జి.ఆర్	8	కాండం తొలుచు పురుగు, సుడిదోమ, పచ్చదోమ, ఉల్లికోడు మరియు వరి ఈగ
6.	ఫిప్రోనిల్ 0.6 జి.ఆర్	4	కాండం తొలుచు పురుగు మరియు ఆకుముడత పురుగు
7.	ఫ్లూబెండమైడ్ 0.7 జి.ఆర్	5	కాండం తొలుచు పురుగు
8.	ఫ్లూపైరమిన్ 2 జి.ఆర్	3	కాండం తొలుచు పురుగు మరియు సుడిదోమ
9.	హెక్సాకొనజోల్ 0.5 జి.ఆర్	4	పాముపొడ తెగులు మరియు పొట్టకుళ్ళు తెగులు

సాంప్రదాయ పద్ధతిలో రైతులు నిర్దేశించిన గుళిక మందు మోతాదును పంట పొలంలో అంతా సమానంగా పడేలా, అదనంగా 20-25 కిలోల పొడి ఇసుకను ఎకరాకు కలిపి వెదజల్లటం జరుగుతుంది. ఈ పద్ధతిలో గుళిక మందు సమానత్వం అనునది వెదజల్లే వ్యక్తి నైపుణ్యం, మందు మోతాదు మరియు సాగు విధానంను బట్టి మారుతుంది. అదనంగా ముడి పదార్థం జోడించినప్పటికీ, మందు పొలం అంతా సమానంగా పడకపోవటం వల్ల పంటలో చీడపీడలను పూర్తి స్థాయిలో అరికట్టలేకపోవటం జరుగుతుంది. ఈ పద్ధతిలో మందు వెదజల్లుటకు అధిక సమయం అనగా ఒక వ్యక్తి సుమారు 8 గంటల్లో కేవలం 4 ఎకరాలను మాత్రమే పూర్తి చేయగలదు. అదీ వ్యక్తి సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది, అదనంగా ఇద్దరు వ్యక్తులు అవసరం అవుతుంది. అంతేకాక ఈ పద్ధతి ఎంతో శ్రమతో కూడుకున్నది. రైతులు పురుగు మందులు ఉపయోగించుటలో, వ్యక్తిగత పర్యవేక్షణ, పరిరక్షణకై భద్రతా ప్రమాణాలను పాటించడంలో వెనుకడుగు వేయటం, వ్యవసాయ కూలీల కొరత, అధిక సమయం, ముడిపదార్థం (పొడి ఇసుక), అధిక భారం వంటి సమస్యలను తగ్గించి, చీడపీడల యాజమాన్యంలో పిచికారి మందులకు నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించటంలో దేశంలో పిజెటిఎయు దేశంలోనే అగ్రగామిగా నిలిచి, మరొక అడుగు ముందుకేసి గుళిక మందులకు నిర్థిష్ట ప్రమాణాలను రూపొందించడంలో పరిశోధన చేపట్టింది. అనగా వరిలో సుమారుగా తొమ్మిది రకాల గుళిక మందులను ప్రధాన చీడపీడలైన, కాండం తొలుచు పురుగు, ఆకుముడత, సుడిదోమ, పచ్చదోమ, పాముపొడ మరియు పొట్టకుళ్ళు తెగులు యాజమాన్యంకై వినియోగించటం జరుగుతుంది. ఈ మందులను రాబోయే రోజులలో డ్రోన్‌తో నిర్థిష్ట ప్రమాణాలను అనుసరించి, అనగా డ్రోన్ ఎగురవేయు ఎత్తు, వేగం మరియు వాల్వు పరిమాణంను పురుగు మందు, దాని మోతాదును బట్టి, 90-95% ఖచ్చితత్వంతో ఎకరానికి 4-5 నిమిషాల వ్యవధిలోనే వెదజల్లవచ్చు. ప్రస్తుతం ఉన్న డ్రోన్ బ్యాటరీ సామర్థ్యం (16000 - 25000 ఎంఎహెచ్‌ను) 3 ఎకరాలకు వినియోగించడం, సాంప్రదాయ పద్ధతితో పోల్చినప్పుడు (2 గంటలు ఒక ఎకరానికి), డ్రోన్‌తో ఒక గంటలో 12-15 ఎకరాలలో గుళికలు వేయవచ్చు.

కీలక అంశాలు:

- ఈ పద్ధతిలో ఎటువంటి ముడి పదార్థం / పొడి ఇసుక అవసరం లేదు.
- ముఖ్యంగా రైతులు, డ్రోను పైలెట్లకు నిర్థిష్ట ప్రమాణాల విషయంలో అవగాహన ఉండాలి. అనగా గుళిక మందు. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మరియు ఫ్లూపైరిమిన్ గుళిక మందులు డ్రోన్ వినియోగంలో వేగంగా గాలిలోని తేమను గ్రహించి, డ్రోన్‌కు అంతరాయం కలిగించడం & సమానంగా వెదజల్లక పోవటం జరుగుతుంది. భవిష్యత్తులో పురుగు మందు తయారీదారులు మరియు డ్రోన్ తయారీ నిర్వహణ సంస్థలు ఈ అంతరాయాన్ని మెరుగుపరిచి, వ్యవసాయాన్ని సులభతరం మరియు లాభసాటి చేస్తాయని ఆశిస్తున్నాము.

వరిలో సిఫార్సు చేయబడిన వివిధ రకాల గుళిక మందులు

వరిలో డ్రోన్‌తో గుళికలు వేసే విధానం



ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.8978046432

చిరుధాన్యాలు - ఆరోగ్య ప్రయోజనాలు

డా॥ జి. ప్రియా సుగంధి, డా॥ శివ కృష్ణ కోట, డా॥ ఐ. తిరుపతి, డా॥ ఉల్లంగుల స్రవంతి మరియు ఏ. నాగరాజు
కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, మంచిర్యాల

ధాన్యాలు అనేవి పెద్ద పరిమాణంలో ఉండే బియ్యం, గోధుమలు, బార్లీ వంటివి. చిరుధాన్యాలు అనేవి చిన్న పరిమాణంలో ఉండి తినడానికి అసౌకర్యంగా ఉండడంతో ఇవి తృణీకరించబడినవి అందుకే చిరుధాన్యాలను తృణ ధాన్యాలు అని కూడా అంటారు. ఈ చిరుధాన్యాలు గడ్డి జాతికి చెందిన పంట. వీటిలో కొన్ని రకాలలో ఆరోగ్యకరమైన మేలు చేసే గుణం అధికంగా ఉండటం వలన వీటిని సిరిధాన్యాలు అని కూడా అంటారు. ఇటీవల కాలంలో అనేకమంది చిరుధాన్యాలపై ఎన్నో విషయాలు చెబుతున్నప్పటికీ సాధారణ ప్రజానీకానికి ఏఏ చిరుధాన్యం ఎలాంటి పోషకాలను అందిస్తుందో మరియు ఆరోగ్య పరంగా ఎలాంటి ఉపయోగాలు ఉంటాయో గుర్తుపెట్టుకోవడం చాలా కష్టతరమైన విషయం. అందుకే వివిధ శాస్త్రీయ, సాంకేతిక, పరిశోధనల ఆధారంగా ఏ చిరుధాన్యం ఎలాంటి ముఖ్యమైన ప్రయోజనం కలిగి ఉంటుందో సులభంగా గుర్తు పెట్టుకోవడానికి మరియు ఎన్నో వైవిధ్యమైన చిరుధాన్యాలు ఉన్నప్పటికీ ఇప్పుడు మనుగడలో ఉన్న కొన్ని చిరుధాన్యాల గురించి ఈ సంపుటిలో పూర్తిగా వివరించడం జరిగింది.

1. ప్రధాన చిరుధాన్యాలు లేదా మేజర్ మిల్లెట్స్
2. చిన్న చిరుధాన్యాలు లేదా మైనర్ మిల్లెట్స్
3. మిధ్యా చిరుధాన్యాలు లేదా సూడో మిల్లెట్స్

ప్రధాన చిరుధాన్యాలు: జొన్నలు, సజ్జలు, రాగుల పరిమాణం మిగిలిన చిరుధాన్యాల విత్తన పరిమాణం కన్నా పెద్దగా ఉండడంతో వీటిని ప్రధాన చిరుధాన్యాలలో చేర్చడం జరిగింది.

చిన్న చిరుధాన్యాలు: కొర్రలు, అండు కొర్రలు, సామలు, ఊదలు, వరిగలు, అరికెల పరిమాణం ప్రధాన చిరుధాన్యాల విత్తన పరిమాణం కన్నా కొంచెము చిన్నగా ఉండడంతో చిన్న చిరుధాన్యాలలో చేర్చడం జరిగింది.

మిధ్యా చిరుధాన్యాలు: అమరాంథస్ అంటే తోటకూర గింజలు లేదా రాజ్ గిర, బక్ వీట్ వంటివి ఈ వర్గంలోకి వస్తాయి.

ప్రధాన చిరుధాన్యాలలో జొన్నలు ముఖ్యంగా బరువు తగ్గడానికి మరియు సూక్ష్మ ఖనిజాల లోపాలను నివారించడానికి ఉపయోగపడతాయి. అన్ని ధాన్యాలతో పోలిస్తే చిరుధాన్యాలలో జీర్ణవ్యవస్థకు మేలు చేసే పీచు పదార్థం ఎక్కువగా ఉండడంతో మధుమేహ వ్యాధి మరియు రక్తపోటు వంటి వ్యాధులను నివారించవచ్చును. అన్ని చిరుధాన్యాలను తినడం వల్ల కలిగే శక్తి సమానమైనప్పటికీ చిన్న చిరుధాన్యాలలో ప్రత్యేకమైన, సహజమైన, ఆరోగ్య ప్రయోజనాలు ఉండడంతో ఇన్ఫెక్షన్ల నుండి కణజాలాన్ని రక్షించే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండడం వలన చిన్న చిరుధాన్యాలను 'అద్భుతమైన ఆహారం' (సూపర్ ఫుడ్స్) గా పరిగణించడం జరిగింది. వీటిలో గ్లూటిన్ అనే పదార్థం లేకపోవడం వలన జీర్ణకోశ వ్యాధులను నివారించవచ్చు.

చిరుధాన్యాలలో పోషక విలువలు:

క్ర.సం.	చిరుధాన్యాల రకం	శక్తి కిలో క్యాలరీలు	పిండి పదార్థాలు గ్రా.	మాంసకృత్తులు గ్రా.	క్రొవ్వు గ్రా.	పీచుపదార్థం గ్రా.	క్యాల్షియం మి.గ్రా.	ఇనుము మి.గ్రా.
	ప్రధాన చిరుధాన్యాలు							
1.	జొన్నలు	334	67.68	9.97	1.73	10.22	25.00	2.60
2.	సజ్జలు	348	61.78	10.96	5.43	11.49	42.00	2.80
3.	రాగులు	321	66.82	7.16	1.92	11.18	344.00	3.90
	చిన్న చిరుధాన్యాలు							
1.	కొర్రలు	351	72.60	11.20	4.00	6.70	31.00	1.10
2.	అండుకొర్రలు	345	71.00	11.50	4.23	12.50	28.00	7.72
3.	వరిగెలు	332	66.19	8.92	2.55	6.39	14.00	3.80
4.	సామలు	346	65.55	10.13	3.89	7.72	17.00	9.30
5.	అరికెలు	309	65.90	8.30	1.40	5.20	27.00	0.60
6.	ఊదలు	307	65.50	6.20	2.20	12.60	20.00	15.00
	సూడో/మిధ్యా చిరుధాన్యాలు							
1.	తోటకూరగింజలు	356	59.98	14.59	5.74	7.02	116.00	5.20
2.	బక్వీట్	343	56.00	13.07	2.52	11.94	28.00	2.26
	ధాన్యాలు							
1.	బియ్యం	356	78.24	7.94	0.52	2.91	10.00	0.70
2.	గోధుమలు/ గోధుమపిండి	322	64.72	10.59	1.47	11.23	30.90	1.20
3.	బార్లీ	332	28.20	11.00	1.80	3.80	11.00	1.33

చిరుధాన్యాలు యొక్క ఆరోగ్య ప్రయోజనాలు:

1. జొన్నలు లేదా సోర్గం లేదా గ్రేట్ మిల్లెట్: పచ్చ జొన్నలలో తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉండడం వలన తీసుకున్న ఆహారం మెల్లగా అరిగి రక్తంలో చక్కర స్థాయిలను తగ్గించి మధుమేహాన్ని నివారిస్తుంది. పచ్చజొన్నలలో ఉండే ఫ్లావనాయిడ్స్ రక్తంలోని ఇన్సులిన్‌ను ప్రభావవంతంగా పనిచేసి చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా చేస్తుంది. తెల్ల జొన్నలు కన్నా పచ్చ జొన్నలలో కాల్షియం, మెగ్నీషియం అధికంగా ఉంటాయి. తక్షణమే శక్తినిస్తాయి, నీరసాన్ని మరియు వాతాన్ని తగ్గిస్తాయి.

2. సజ్జలు లేదా బాజ్ర లేదా పర్ల్ మిల్లెట్: రక్త నాళాలలో కొవ్వును పేరుకోకుండా లిగ్నిన్ అనే ఫైటో కెమికల్ ద్వారా గుండె లయను నిబద్ధం చేస్తుంది. పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వలన మలబద్ధకమును నివారిస్తుంది, జీర్ణకోశ సంబంధిత వ్యాధులను తొలగిస్తుంది. ఒత్తిడి నుండి విడుదలనిస్తుంది. రక్తనాళాల్లో కొవ్వును తొలగిస్తుంది కనుక గుండె సంబంధిత రోగాలను నివారిస్తుంది. ఒత్తిడి నుండి విడుదలనిస్తుంది. సజ్జలు పాలిచ్చే తల్లులలో తల్లిపాల ఉత్పత్తిని పెంచుతుంది. రక్తహీనతను మధుమేహాన్ని నియంత్రిస్తుంది. మంచి కొవ్వును పెంచుతుంది. గాల్‌బ్లాడర్ రాళ్లను తొలగిస్తుంది. అధిక బరువును నియంత్రిస్తుంది. అల్సర్‌ను, ఎసిడిటీను తొలగిస్తుంది. రక్తప్రసరణను అదుపులో ఉంచి రక్తపోటును క్రమబద్ధీకరిస్తుంది.

3. రాగులు లేదా ఫింగర్ మిల్లెట్ లేదా ఇటాలియన్ మిల్లెట్: కాల్షియం అధికంగా ఉండడం వలన ఎముకలకు, దంతాలకు పట్టుత్వంను ఇస్తుంది. అమైనో ఆమ్లాలు ఉండడం వలన మాంసకృతులు ఎక్కువగా లభిస్తాయి. ఇనుము అధికంగా ఉండడం వలన రక్తహీనతను సమర్ధవంతంగా తొలగిస్తుంది. తద్వారా జుట్టు రాలుట తగ్గుతుంది. ఉబకాయాన్ని తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. మధుమేహ వ్యాధిని నివారిస్తుంది. మొలకెత్తిన రాగి మాల్ట్ సులభంగా జీర్ణం అవుతుంది, గనుక వృద్ధులు సులభంగా తినవచ్చు. విటమిన్లు మరియు మినరల్స్ లోపాన్ని నివారిస్తుంది.

4. కొర్రలు లేదా ఫాక్స్ టైల్ మిల్లెట్: పీచు పదార్థం ఎక్కువగా ఉండడం వలన మంచి బ్యాక్టీరియా వృద్ధి చెంది హాని కలిగించే బ్యాక్టీరియాను తొలగిస్తుంది. ఉదర సంబంధిత వ్యాధులను, మధుమేహ వ్యాధులను నివారిస్తుంది. రక్తహీనతను, మూర్ఛ వ్యాధిని నివారిస్తుంది. క్యాన్సర్ కణాలను నివారించి అన్ని రకాల క్యాన్సర్లను తగ్గిస్తుంది. బి 12, అధిక మాంసకృతులు ఎక్కువగా ఉండడం వలన ఆర్థరైటిస్, గౌట్, మూర్ఛ, గుండె సంబంధిత వ్యాధుల నుండి విముక్తినిస్తాయి.

5. అండుకొర్రలు లేదా బ్రౌన్ టాప్ మిల్లెట్ లేదా అమెరికన్ మిల్లెట్: పచ్చని రంగు కలిగి ఉంటుంది. నరాల బలహీనతను తొలగిస్తుంది. జీర్ణ వ్యవస్థ సంబంధిత వ్యాధుల నుండి రక్షిస్తుంది. యాంటీ క్యాన్సర్ లక్షణాన్ని కలిగి ఉంటుంది. అధిక మాంస కృత్తులను కలిగి ఉంటుంది. ఆటిజం, మతిమరుపును తొలగిస్తుంది. ఊపిరితిత్తులకు ఆరోగ్యాన్నిస్తుంది. కంటి సమస్యలను తొలగిస్తుంది.

6. వరిగెలు లేదా ప్రోసోమిల్లెట్ లేదా హాగ్‌మిల్లెట్ లేదా చైనీస్ మిల్లెట్: కాల్షియం, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. యాంటీ ఏజింగ్‌గా పనిచేసి వయసును మెరుగుపరుస్తుంది. నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. గుండెలో మంచి కొవ్వును పెంచి ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మవ్యాధులను తొలగిస్తుంది. పిత్తాశయంలో రాళ్ళను తొలగిస్తుంది. మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. పోషకాహార లోపాలు తగ్గుతాయి. ఎముకల పట్టుత్వానికి సహకరిస్తుంది. వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులను నివారిస్తుంది. మధుమేహాన్ని తగ్గిస్తుంది.

7. సామలు లేదా లిటిల్ మిల్లెట్ లేదా ఆఫ్రికన్ మిల్లెట్: వీటిని తినడం వలన ఆరోగ్యకరమైన పునరుత్పత్తి వ్యవస్థ బలపడుతుంది. తద్వారా హార్మోన్ల అసమతుల్యతను పోగొట్టి పిసిఓడి, పిసిఓఎస్, థైరాయిడ్ హార్మోనుల అసమతుల్యత ద్వారా వచ్చే ఋతుచక్ర సమస్యలు, జుట్టు రాలుట, తక్కువ శుక్రకణాల సంఖ్యను అరికట్టుతుంది. అంతేకాకుండా సంతానలేమి సమస్యలను నివారిస్తుంది. కడుపుబ్బరం, పుల్ల తేనుపులు, సుఖ వ్యాధులు, అజీర్ణంను అరికట్టుతుంది. చనుబాలు కోసం బాలింతలకు ఉపయోగబడుతుంది.

8. అరికెలు లేదా కొడోమిల్లెట్: రక్తమును శుద్ధికరిస్తుంది. వ్యాధి నిరోధకతను పెంచుతుంది. గుండె వ్యాధులను, బరువును తగ్గిస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆటిజం, ఎలర్జీ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులను నివారిస్తుంది. ఎముకలకు పటుత్వం చేకూరుస్తుంది. తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉన్న ఈ అరికెలను తిన్నప్పుడు ఇన్సులిన్ పెరగడం వలన మధుమేహ వ్యాధిని తగ్గిస్తుంది.

9. ఊదలు లేదా బార్న్ యార్డ్ మిల్లెట్ లేదా జపనీస్ మిల్లెట్: కాలేయ వ్యాధులను తొలగిస్తుంది. లివర్ వాపులు, వైరల్ ఇన్ఫెక్షన్స్ వంటి హెపటైటిస్, పచ్చకామర్ల వ్యాధిని, కాలేయ క్యాన్సర్ వ్యాధులను అరికడుతుంది. అస్సైటిస్ (జలోదరం) అనే నీటితో నింపబడే పొట్టను తగ్గిస్తుంది. మూత్రకోశ వ్యాధులను సమర్ధవంతంగా తొలగిస్తుంది. కిడ్నీలలో, గాల్ బ్లాడర్, పిత్తాశయంలో ఉండే రాళ్ళను తొలగిస్తుంది. తరచుగా వచ్చే మూత్రాన్ని అదుపులో ఉంచుతుంది. రక్తంలో సమతుల్యాన్ని ఉంచుతుంది. మధుమేహ వ్యాధి టైప్2 (రెండవ రకం) వ్యాధిని తగ్గిస్తుంది. ఆకలిని పెంచుతుంది. శరీర ఉష్ణోగ్రతను సమస్థితిలో ఉంచుతుంది. పెద్దప్రేగు, చిన్నప్రేగు, గర్భాశయ క్యాన్సర్‌ల నుండి తప్పిస్తుంది. బాలింతలలో చనుబాలు ఉత్పత్తిని పెంచుతుంది.

చిరుధాన్యాలను వండటంలో సూచనలు: చిరుధాన్యాలను వండే ముందు మూడు నుంచి ఐదు గంటల పాటు నానబెడితే అందులో ఉండే గాస్ట్రోజెన్స్, ఫైటేట్స్ వంటి యాంటీ న్యూట్రియెంట్స్ తొలగిపోయి సులభంగా జీర్ణం అవుతుంది. మనకు లభ్యమయ్యే చిరుధాన్యాలను రెండు రోజులకు ఒక రకం చొప్పున రోజుకు కనీసం ఒక్కసారైనా అంబలి, రొట్టె, ఘటక వంటి రూపంలో తింటూ ఉంటే అనేక వ్యాధులను అరికట్టవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8143553014

వేరుశనగకు విలువ జోడించటం ద్వారా రెట్టింపు ఆదాయం

ఎ. పోశాద్రి, డా॥ జి. శివచరణ్, డా॥ డి. మోహన్ దాస్, డా॥ కె. రాజశేఖర్, డా॥ యం. సునీల్ కుమార్
మరియు డా॥ వై. ప్రవీణ్ కుమార్
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్

ప్రపంచ నూనెగింజల ఉత్పత్తిలో భారతదేశం వాటా కేవలం 5-6 శాతమే. మన దేశ నూనెగింజలు దిగుబడి సరాసరి ఒక హెక్టారుకు 12-15 క్వింటాళ్లు. ప్రపంచ సగటు దిగుబడి హెక్టారుకు 20 క్వింటాళ్లు. 2023-24 సంవత్సరంలో సుమారు 41.36 మిలియన్ మెట్రిక్ టన్నుల నూనె గింజలను సుమారు 30.24 మిలియన్ హెక్టార్లలో సాగు చేయడం ద్వారా ఉత్పత్తి చేయడం జరిగినది. తద్వారా 9 నూనె గింజలతో పాటు, పామ్ ఆయిల్, కొబ్బరి నూనె, రైస్ బ్రాన్ ఆయిల్ మొదలైనవి కలుపుకొని సుమారు 12.41 మిలియన్ మెట్రిక్ టన్నుల వంట నూనెలను దేశీయంగా ఉత్పత్తి చేస్తున్నాము. భారతదేశంలో ఏటా 9.56 మిలియన్ టన్నుల వేరుశనగ ఉత్పత్తి జరుగుతుంది. సోయాబీన్ నూనెగింజల ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉంది. రెండు మూడు స్థానాలలో వేరుశనగ మరియు ఆవాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 0.65 మిలియన్ మెట్రిక్ టన్నుల నూనె గింజల ఉత్పత్తి జరుగుతున్నది. వీటిలో వేరుశనగ, సోయాబీన్, నువ్వులు మరియు పొద్దుతిరుగుడు ప్రధానమైనవి. మన తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబం (నలుగురు ఉన్న కుటుంబ సభ్యులు) నెలకు సుమారు 3.0 కిలో నుండి 4 కిలోల నూనెను వినియోగిస్తున్నారు. తద్వారా సంవత్సరానికి మన రాష్ట్ర వంటగది స్థాయిలో వినియోగిస్తున్న మొత్తం నూనె సుమారు 0.65 మిలియన్ మెట్రిక్ టన్నులు. అంతేకాకుండా ఆహార పరిశ్రమలు, హోటల్స్, క్యాటరింగ్ ఇతర సూక్ష్మహార పరిశ్రమల వినియోగం అదనంగా ఉంది. పెరుగుతున్న జనాభా, తగ్గుతున్న వ్యవసాయ భూమి, ప్రజల ఆహార అలవాట్లు మొదలైనవి వంటనూనెల వినియోగం పెరగడానికి కారణాలు. తెలంగాణ రాష్ట్రంలోని నూనె గింజల ఉత్పత్తి ఆధారంగా వేరుశనగ మరియు వాటి విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రాసెసింగ్ పైన పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడం ద్వారా అన్ని వర్గాల వారికి ప్రయోజనం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కేంద్ర ప్రాయోజిత ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ (పిఎమ్-ఎఫ్ఎమ్ఇ) స్కీం మరియు ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఓడిఓపి) పథకాల ద్వారా మన రాష్ట్రంలోని 3 (జోగులాంబ గద్వాల్, నారాయణపేట మరియు వనపర్తి) జిల్లాలోని రైతులు, యువతీ యువకులు మరియు సూక్ష్మ మరియు చిన్న ప్రాసెసింగ్ మిల్లులు నడుపుతున్న యజమానులు ఒక జిల్లా ఒక ఉత్పత్తిలో భాగంగా కొత్త ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆ జిల్లాలో కేటాయించబడిన వేరుశనగ మరియు వాటి విలువ ఆధారిత ఉత్పత్తులకు సంబంధించిన ప్రాసెసింగ్ పరిశ్రమలు నెలకొల్పినట్లు అయితే సుమారు 10 లక్షల క్రెడిట్ లింక్ కల్పించి 3.5 లక్షల సబ్సిడీ సదుపాయం లభిస్తుంది.

మనలో చాలామందికి ఒక అపోహ ఉంది. రిటైల్ మార్కెట్లో కిలో పల్లీలు 150 రూపాయల నుండి 200 రూపాయల వరకు ఉంది. వేరుశనగలో నూనె శాతం సుమారు 45-50% ఉంటుంది. అంటే రెండున్నర కిలోల పల్లీల నుండి నూనె తీస్తే ఒక కిలో నూనె లభిస్తుంది. మరోవైపు కిలో పల్లీ నూనె ధర మార్కెట్లో 180 రూపాయల నుండి 200 రూపాయల వరకు ఉంది. పల్లీల ధర మరియు పల్లీ నూనె ధరలు పరిశీలించినట్లయితే ఇంత తక్కువ ధరకు నూనె ఎలా లభిస్తుంది. నూనెకు పెట్రోకెమికల్స్‌తో కల్తీ చేస్తారని అందరూ అనుకుంటారు. మార్కెట్లో లభించే వేరుశనగ నూనె ఎలాంటి కల్తీ చేయకుండానే కిలో పల్లీ నూనె ధర మార్కెట్లో 180 రూపాయల నుండి 200 రూపాయల వరకు అమ్మవచ్చు, ఎందుకంటే పరిశ్రమలలో పల్లీ నూనె బి & సి గ్రేడ్ పొట్టు తీసిన పల్లీల నుండి నూనె తయారు చేస్తారు. పొట్టు తీసిన పల్లీలు (బి & సి) గ్రేడ్‌కు కిలో రిటైల్ మార్కెట్ ధర 70 నుండి 90 రూపాయల వరకు ఉంటుంది. బి & సి గ్రేడ్ పల్లీలు నూనె తీయడానికి వాడతారు. తద్వారా

రైతు క్షేత్రస్థాయిలో వేరుశనగ పొట్టు తీసి గ్రేడింగ్ చేయడం ద్వారా రెట్టింపు ఆదాయం

వివరాలు	వేరుశనగ కాయలు పొట్టు తీసిన తర్వాత రికవరీ			
	వేరుశనగ కాయలు (కిలోలు) గ్రేడ్ పల్లీలు	రికవరీ చేసిన మొత్తం పల్లీలు	రికవరీ చేసిన మొత్తం (ఎ) గ్రేడ్ (కిలోలు)	రికవరీ చేసిన మొత్తం (బి & సి) పల్లీలు (కిలోలు)
మొత్తం వేరుశనగ కాయలు (కిలోలు)	100	75	40	35
కనీస మద్దతు ధర లేదా రైతు క్షేత్రం నుండి కిలో వేరుశనక్కాయల ధర రూపాయలు				67.83
పొట్టు తీసిన పల్లీలు (ఎ) గ్రేడ్‌కు కిలో రిటైల్ మార్కెట్ ధర రూపాయలు ఎ గ్రేడ్‌ను టేబుల్ పర్పస్ కోసం రిటైల్ మార్కెట్ ద్వారా తినడానికి మరియు ఇతర తినుబండారాలు స్నాక్స్ తయారు చేయడానికి వాడతారు				180
పొట్టు తీసిన పల్లీలు (బి&సి) గ్రేడ్ కు కిలో రిటైల్ మార్కెట్ ధర బి&సి గ్రేడ్ పల్లీలు నూనె తీయడానికి వాడతారు రూపాయలు				90
పొట్టు తీసిన పల్లీలు (ఎ) గ్రేడ్ మరియు బి&సి గ్రేడ్ పల్లీల ద్వారా లభించే స్థూల ఆదాయం రూపాయలు			7200	3150
క్వింటాల్ వేరు శనగ కాయల ద్వారా లభించే మొత్తం స్థూల ఆదాయం రూపాయలు				10350 (7200+3150)
కనీస మద్దతు ధర (2024-25) క్వింటాల్ వేరుశనగ కాయలకు రూపాయలు				6783
క్వింటాల్ వేరుశనగ కాయల పొట్టు తీసిన తర్వాత (ఎ) గ్రేడ్ మరియు బి&సి గ్రేడ్ పల్లీల ద్వారా లభించే ఆదాయం రూపాయలు				3,392
బి&సి గ్రేడ్ పల్లీలు నూనె తీయడానికి వాడతారు				
బి&సి గ్రేడ్ పల్లీల ద్వారా నూనె తీయడం ద్వారా లభించే నూనె శాతం				40%
బి&సి గ్రేడ్ పల్లీల ద్వారా నూనె తీయడం వలన పొందే మొత్తం నూనె (కిలోలు)				14
కిలో వేరుశనగ నూనె ధర				200
బి&సి గ్రేడ్ పల్లీల ద్వారా నూనె తీయడం వలన పొందే మొత్తం స్థూల ఆదాయం రూపాయలు				2800
బి&సి గ్రేడ్ పల్లీల ద్వారా నూనె తీసిన తర్వాత మిగిలే పల్లీల గానుగా చెక్క (కిలోలు)				19.0
కిలో పల్లీల గానుగ చెక్క ధర				50
గానుగా చెక్క ధర పొందే మొత్తం స్థూల ఆదాయం రూపాయలు				963
బి&సి గ్రేడ్ పల్లీల ద్వారా లభించే మొత్తం స్థూల ఆదాయం రూపాయలు				3763
క్వింటాల్ వేరుశనగ కాయలు పొట్టు తీసి (ఎ) గ్రేడ్ మరియు బి&సి గ్రేడ్ పల్లీలు అమ్మడం ద్వారా లభించే మొత్తం స్థూల ఆదాయం రూపాయలు				10350
క్వింటాల్ వేరుశనగ కాయలు పొట్టు తీసి (ఎ) గ్రేడ్ పల్లీలు అమ్మడం మరియు బి&సి గ్రేడ్ పల్లీల ద్వారా నూనె తీయడం వలన పొందే ద్వారా మొత్తం స్థూల ఆదాయం రూపాయలు				10963 (7200+3763)

వేరుశనగ రకము, నాణ్యత, గ్రేడింగ్ ద్వారా రికవరీ, రిటైల్ మార్కెట్ ధర మరియు ప్రాసెసింగ్ పద్ధతులను అనుసరించి పైన తెలిపిన ధరలకు హెచ్చుతగ్గులు ఉంటాయి.

మార్కెట్‌లో 180 నుండి 200 రూపాయల మనకు మార్కెట్లో పల్లీ నూనె లభిస్తుంది.

ప్రసిద్ధ వేరుశనగ వాణిజ్య రకాలు : కదిరి-6, కదిరి-9, అనంత, కదిరి హరిత ఆంధ్ర, ఐ సి జి వి-91114, ధరణి, టి ఏ జి-24, కదిరి-7, కదిరి-8, కదిరి-2, కదిరి-3, బిజి-1, బిజి-2, కుబేర్ , జిఎయుజి-1, జిఎయుజి-10, పిజి-1, టి-28, టి-64, చంద్ర, చిత్ర, కౌశల్, ప్రకాష్, అంబర్

వేరుశనగ పొట్టు తీసే యంత్రం: గంటకు 500 కిలోల వేరుశనగ పొట్టుతీసే యంత్రాలు మార్కెట్లో లభిస్తాయి. మార్కెట్లో చాలా రకాల కంపెనీలు వాటి సామర్థ్యము, నిర్మాణం మొదలైన అంశాలపైన ఆధారపడి వాటి ధరలు ఉంటాయి.

పెరుగుతున్న వంటనూనెల ధరలు, దేశీయ నూనెగింజల ఉత్పత్తి తగినంత లేకపోవడం వలన మార్కెట్లో వంటనూనెల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దిద్దుబాటు చర్యలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నూనెగింజల మరియు ఆయిల్ ఫామ్ సాగు వైపు ప్రోత్సహించడం జరుగుతున్నది. మన రాష్ట్రంలో కూడా రైతులు పంట మార్పిడి చేపట్టి వేరుశనగ, సోయాబీన్, నువ్వులు మరియు పొద్దుతిరుగుడు వంటి నూనె గింజల సాగు పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే వేరుశనగ వంగడాలు, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి మరియు సరఫరా, క్షేత్రస్థాయిలో చీడపీడల మరియు తెగుళ్ళ నియంత్రణ, పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట నిల్వ, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ నిర్వహణ ద్వారా విత్తనం నుండి వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి విలువ ఆధారిత పదార్థాలు తయారుచేసి ప్యాకేజింగ్ మెటీరియల్లో వినియోగదారుడికి సులభంగా వాడుకునే విధంగా ఉండి వంట గదికి మరియు వినియోగదారుడు ఆహారం తీసుకునే డైనింగ్ టేబుల్‌కు చేరే అంతవరకు తగిన యజమాన్య పద్ధతులు పాటించి సరసమైన ధరలో అమ్మి నట్లయితే ఫుడ్ ప్రాసెసింగ్‌రంగం ఎంతో ఆశాజనకంగా ఉంటుంది.

యంత్రం	పరిమాణం (సంఖ్య)	మొత్తం (రూ. లక్షల్లో)
వేరుశనగ పొట్టు తీసే యంత్రం (15 హెచ్.పి) గంటకు 500 కిలోల వరకు పొట్టు తీస్తుంది.	1	5.0
పైన తెలిపిన ధరలకు హెచ్చుతగ్గులు ఉంటాయి.		

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9492828965

ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి బుధవారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. ఏప్రిల్, 2025 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు

తేది	అంశం	సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్
03.04.2025	పచ్చిరొట్ట ఎరువుల సాగు - ప్రాముఖ్యత	**శ్రీ టి. లక్ష్మణ్,** కో-ఆర్డినేటర్, ఏరువాక కేంద్రం, తాండూర్ 9704246094
10.04.2025	నేల ద్వారా వ్యాపించే తెగుళ్ళు నివారణ - వేసవిలో చేపట్టవలసిన చర్యలు	**డా॥ టి. రాజేశ్వర్ రెడ్డి,** శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) వ్యవసాయ పరిశోధన కేంద్రం, తాండూర్, 9390898305
17.04.2025	యాసంగి పంటలలో కోత మరియు నిల్వలో పాటించవలసిన చర్యలు	**డా॥ ఎన్. జెమిమా,** శాస్త్రవేత్త (ఎంటమాలజీ) ఎ.ఐ.ఎన్.పి. అన్ పెస్టిసైడ్ రెసిడ్యూస్, రాజేంద్రనగర్, 9642514947
24.04.2025	పంట అవశేషాలు వినియోగంలో మెళకువలు	**డా॥ కె. చంద్ర శేఖర్,** ఎస్.యం.ఎస్. (క్రాప్ ప్రొడక్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్, 9848430317

ప్రకృతి వ్యవసాయము - ఆరోగ్యకరమైన ఎంపిక

ఎన్. చరిత, ఎ. సాయి కిషోర్, ఎల్. శ్రావిక, బి. దీపక్ రెడ్డి, డి. స్రవంతి, డా॥ కె. నాగాంజలి మరియు డా॥ జె. హేమంత కుమార్
వ్యవసాయ కళాశాల, అశ్వరావుపేట

పూర్వకాలం రైతు పంటలను పండించుటకు విత్తనాలను స్వయంగా లేదా తోటి రైతుల నుండి సేకరించేవాడు. పశువుల ఎరువు, పాటి మట్టి, చెరువు మట్టి, గొర్రెల పెంట, పంది పెంట ఎరువులుగా ఉపయోగించేవాడు. పురుగులు లేవు, పురుగుల మందులు లేవు. కూలీగా ధాన్యం ఇచ్చేవాడు. మిగిలిన పంట రేటు వచ్చినప్పుడు అమ్ముకొనేవాడు. పెట్టుబడి తక్కువ, అప్పులు లేవు, కావున పంట పండకపోతే చాకిరి మాత్రం నష్టపోయేవాడు.

జనాభా పెరుగుదలకు అనుగుణంగా పంటల దిగుబడులు పెంచాల్సి వచ్చింది. అదే హరిత విప్లవంలో భాగంగా అధిక దిగుబడులనిచ్చే వంగడాలు వచ్చాయి. రసాయనిక ఎరువులు మరియు పురుగుమందులు వాడకంలోకి వచ్చాయి. పెట్టుబడులు పెరిగి, కూలీరేట్లు కూడ పెరిగాయి.

రైతు అప్పులపాలయ్యాడు. గిట్టుబాటు ధర లేదు తద్వారా అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడ్డాడు.

రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచక్షణా రహితంగా వాడటం వలన పర్యావరణం కలుషితం అయింది. నేల సమతుల్యత దెబ్బతిన్నది. నేలలో సేంద్రియ పదార్థం తగ్గిపోయింది. అనంతకోటి సూక్ష్మజీవులు అంతరించాయి. వానపాములు కూడ కనిపించకుండా పోయాయి. భూమి నిస్సారమైంది. అధిక మొత్తంలో ఎరువులను ఉపయోగించినా దిగుబడులు పెరగడం లేదు.

మన పంటలలో ఎరువులు, పురుగుమందుల అవశేషాల వలన ఏ దేశమూ కొనుగోలుకు ముందుకు రావటం లేదు. ఈ క్రమంలో ఉపయోగించిన పురుగుమందులలో సగం పైగా మన శరీరంలోకి చేరుతున్నాయి. చంటిపాపలకిచ్చే తల్లిపాలలో కూడా విషం ఉన్నది. వాస్తవం ఇది. ఫలితంగా మానవాళి అనేక వింత ప్రాణాంతక రోగాలకు గురిఅవుతున్నది. ఈ పరిస్థితుల్లో భారతదేశంతో పాటు అనేక దేశాలు రసాయనిక ఎరువులు, పురుగుమందులు ఉపయోగించని వ్యవసాయం "సేంద్రీయ వ్యవసాయం" వైపు మొగ్గు చూపుతున్నాయి.

స్థానిక వనరులతో, తక్కువ పెట్టుబడితో, అధిక దిగుబడులు పొందుతూ, పర్యావరణాన్ని పరిరక్షించుతూ, ఆరోగ్యకరమైన పంటలు పండించడమే ప్రకృతి వ్యవసాయం

ఆరోగ్యకరమైన నేల అధిక దిగుబడులనిస్తుంది. ఏ నేల అధిక మొత్తంలో నీటిని పీల్చుకుంటుందో, పీల్చుకున్న నీటిని పట్టి ఉంచుతుందో, పట్టి ఉంచిన నీటిని మొక్కలకందిస్తుందో, ఆ నేల ఆరోగ్యకరమైన నేల. దీనికోసం నేలలో సేంద్రియ పదార్థము 0.5 శాతము కంటే ఎక్కువగా ఉండాలి. కోటాను కోట్ల సూక్ష్మజీవులను వృద్ధిపరచాలి. తద్వారా వానపాముల (ఎరల) సంఖ్యను ఇతోధికంగా పెంచాలి. దీనితో నేల సారవంతమౌతుంది. గుల్ల బారుతుంది. నీటిని పీల్చుకునే గుణం పెరుగుతుంది. తద్వారా ధాతు మార్పిడి జరుగుతుంది. పంటకు అవసరమైన పోషకాలు అధికమొత్తంలో లభ్యమౌతాయి. పంటలకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు వస్తాయి.

మొక్కలు ఆరోగ్యముగా పెరుగుటకు, ప్రత్యుత్పత్తికి, ధాతువులు లేదా సమ్మేళన రూపంలో ఆహారం తీసుకుంటాయి. వాటిని "పోషకాలు" అంటారు.

ఆధునిక వ్యవసాయనికి తగు పాళ్ళలో ఉండే ఎరువులకు బదులు కేవలం భాస్వరము, పొటాష్, నత్రజనిని మాత్రమే అధిక మొత్తాల్లో ఇస్తూ, ఏయేటికాయేడు భూమిని నిస్సారం చేస్తున్నాము. పోషక లోపాలతో మొక్కలు రోగనిరోధక శక్తిని కోల్పోయాయి, చీడ, పీడలకు గురయ్యాయి. దిగుబడులు గణనీయంగా తగ్గాయి. భూమి గట్టిపడిపోయింది. వర్షపునీరు భూమిలోనికి ఇంకటంలేదు. పైర్లు తరుచు బెట్టకు గురవుతున్నాయి. దీనికి పరిష్కారం రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పూర్తిగా తగ్గించి, సమగ్ర సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఆచరించటం.

సూక్ష్మజీవులను అభివృద్ధి పరుచుట :

భూమిలో సూక్ష్మజీవులను అభివృద్ధి పరుచుటకు దేశీయ ఆవుపేడ, మూత్రము, బెల్లము, పప్పుధాన్యాల పిండి మొదలగు

పదార్ధములతో తయారుచేసిన జీవామృతము, అమృతజలము, పంచగవ్యము ప్రకృతి వ్యవసాయములో ప్రధాన భూమికను వహిస్తాయి. ఏ జంతువు మల, మూత్రాలలో లేనంత సంఖ్యలో ఆవు పేడ, మూత్రములో సూక్ష్మజీవుల సంఖ్య ఉండటము గ్రహించ దగ్గ విషయము. ఒక గ్రాము ఆవుపేడలో, ఒక మి.లీ. ఆవు మూత్రములో సుమారు 400 కోట్ల సూక్ష్మజీవులు, ఎక్కువగా వ్యవసాయమునకు ఉపయోగపడు సూక్ష్మజీవులు ఉన్నాయి. పేడ 5 దినముల వరకు తాజాగా ఉంటుంది. తర్వాత సూక్ష్మజీవుల సంఖ్య తగ్గుతుంది. మూత్రము ఎంతకాలము నిల్వ ఉంటే సూక్ష్మజీవుల సంఖ్య అంత పెరుగుతుంది. పేడ, మూత్రములకు బెల్లం కలిపినప్పుడు ప్రతి 20 నిముషములకు సూక్ష్మజీవుల సంఖ్య రెట్టింపు అవుతుంది.

జీవామృతము

కావలసిన పదార్ధములు: ఆవుపేడ 10 కిలోలు, ఆవు మూత్రము 10 లీటర్లు, బెల్లము 1 కిలో (నల్లబెల్లము శ్రేష్టమైనది), పప్పుధాన్యాల పిండి 1 కిలో, పిడికెడు గట్టుమట్టి, 200 లీటర్ల నీరు.

తయారుచేయు పద్ధతి: పేడ, మూత్రము, బెల్లం, పిండిని 200 లీటర్ల నీటిలో కలపాలి. పిడికెడు గట్టుమట్టి దీనిలో వేయాలి. ఒక కర్రతో ఉదయం, సాయంత్రం రెండు పర్యాయములు సవ్యదిశలో తిప్పాలి. నీడ కల్పించాలి. రెండు దినములు ఊరబోయాలి. ఈ జీవామృతము నీటి ద్వారా గానీ, భూమిలో పదును ఉన్నప్పుడు చల్లుట ద్వారా భూమికి అందించాలి. వారము రోజులలోపున ఉపయోగించాలి. జీవామృతము, అమృతజలము, పంచగవ్యము ఈ మూడు మిశ్రమాలలో కోటాను కోట్ల సూక్ష్మజీవుల సముదాయము. భూమిలో తేమ ఉన్నప్పుడు భూమిపై చల్లవచ్చును. నీటి ద్వారా అందించవచ్చును.

ఘన జీవామృతము:

కావలసినవి: ఆవుపేడ 100 కిలోలు, బెల్లం 1 కిలో, పప్పుధాన్యాల పిండి 1 కిలో, ఆవుమూత్రం తగినంత.

తయారుచేయుట: ప్లాస్టిక్ కాగితం పరిచి 100 కిలోల పేడ వేయాలి. 1 కేజి బెల్లం మూత్రంలో నానబెట్టాలి. బెల్లం, పిండి పేడలో వేసి బాగా కలపాలి. రెండు రోజులు గోనెసంచి కప్పి నీడలో ఉంచాలి. తర్వాత ఎండలో 2 రోజులు దాకా తేమ లేకుండా ఉండు వరకు ఎండబెట్టాలి. దీనిని పొడిచేసి 6 నెలల వరకు ఉపయోగించవచ్చును.

భూమిలో విత్తనంతో 1 క్వింటా ఘన జీవామృతంను ఉపయోగించవచ్చును. తర్వాత పై పాటుగా ప్రతిసారి అర క్వింటా ఘన జీవామృతంను ఉపయోగించవచ్చును.

పెంటదిబ్బ ఎరువుతో ఘన జీవామృతము: తిరగబోసిన దిబ్బ ఎరువును జల్లెడపట్టి నీడలో ఉంచాలి. దీనికి పదునుచేయుటకు కావలసినంత జీవామృతమును కలపాలి. రెండు రోజుల పాటు గోనె సంచి కప్పి ఉంచాలి. తర్వాత 3 రోజులు ఎండలో ఆరబెట్టాలి. బస్తాలలో నిల్వ ఉంచి 6 నెలల వరకు ఉపయోగించ వచ్చును. విత్తనముతో భూమిలో 2 క్వింటాళ్ళవరకు, పై పాటుగా ప్రతిసారి 1 క్వింటా చొప్పున ఉపయోగించవచ్చును.

అమృత జలము:

కావలసిన పదార్ధములు: దేశీయ ఆవుపేడ 10 కిలోలు, ఆవు నెయ్యి 250 గ్రా., తేనె 500 గ్రా., లేక బెల్లం 500 గ్రా., నీరు అర లీటరు

తయారుచేయు పద్ధతి: 10 కిలోల పేడలో కొద్ది కొద్దిగా నెయ్యి కలుపుతూ నెయ్యి వాసన వచ్చు వరకు సుమారు గంటసేపు కలియబెట్టాలి. దానిలో తేనెను కొద్ది కొద్దిగా కలుపుతూ మరొక గంటసేపు మిశ్రమాన్ని కలియబెట్టాలి. తేనెకు బదులు అర కిలో బెల్లం. అర లీటరు నీటిలో జావలా చేసి నెయ్యి కలపిన పేడకు కొద్దికొద్దిగా కలుపుతూ గంటసేపు కలియబెట్టాలి. దీనిని చిక్కని కళాపిలా చేసి 200 లీటర్ల డ్రమ్ములో పోయాలి. ఈ డ్రమ్ములో 10 లీటర్ల చొప్పున నీటిని కలుపుతూ ద్రవాన్ని కర్రతో బాగా కలియబెట్టాలి. ఈ ప్రక్రియ నాలుగు గంటలు వరకు కొనసాగాలి. ఇది అమృత జలము. ఇది ఒక ఎకరానికి, భూమిపై మరియు నీటి ద్వారా అందించవచ్చు. దీని ఫలితము పది దినములలోనే కనిపిస్తుంది. మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. అధిక దిగుబడులు వస్తాయి.

అమృతపాని:

కావాలసిన పదార్ధములు: ఆవుపేడ 40 కిలోలు, ఆవుమూత్రం 10 లీటర్లు, బెల్లం 2 కిలోలు, పప్పుధాన్యాల పిండి 2 కిలోలు, నువ్వుల నూనె 400 మి.లీ.. జీవన ఎరువు లేక నూనె పిండి 10 కిలోలు, మట్టి 1 కిలో, నీరు 200 లీటర్లు,

తయారు చేయు పద్ధతి: పై పదార్ధములన్నింటిని 200 లీటర్ల డ్రమ్ములో వేసి 5 రోజులు నీడలో ఉంచాలి. ఉదయం, సాయంత్రం కలపాలి. ఈ ద్రావణం 200 కిలోల డి.ఎ.పి.కి. సమానం. నీటితోపాటు ఈ ద్రావణాన్ని కలిపి 2 ఎకరాలకు 2–3 సార్లు వాడవచ్చు.

పంచగవ్యము

కావలసిన పదార్ధములు: ఆవుపేడ 5 కిలోలు, మూత్రము 3 లీటర్లు, పెరుగు 2 లీటర్ల పాలు 2 లీటర్లు, నెయ్యి – అర కిలో, లేత కొబ్బరి నీరు 3 లీటర్లు, కల్లు 3 లీటర్లు, మగ్గిన అరటి పండ్లు 12 నుంచి 15, నల్లబెల్లం 3 కిలోలు, నీరు 3 లీటర్లు.

తయారుచేయు పద్ధతి: పేడలో నెయ్యి వేసి బాగా కలియపెట్టి. 4 రోజులపాటు ఈ మిశ్రమాన్ని ఉదయము, సాయంత్రము బాగా కలపాలి. 4 రోజుల తర్వాత మిగిలిన పదార్థములు అన్ని కలపాలి. అరటిపండ్లను పిసికి కలపాలి. ఉదయం, సాయంత్రం కలపాలి.

మూతకు గుడ్డ కట్టి 15 రోజులు నిలువ ఉంచిన పంచగవ్యము తయారవుతుంది. 3 లీటర్ల ద్రావనాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకి పిచికారి చేయాలి. ఈ ద్రావణం ఆరు నెలలు నిలువ ఉంటుంది.

జీవామృతము, అమృత జలము, పంచగవ్యము భూమికి అందించినప్పుడు సూక్ష్మజీవులు భూమిలోనికి ప్రవేశించి మొక్కలు తీసుకోలేని పోషకములను మొక్కలకు అందిస్తాయి. మొక్కలపై 15 నుండి 20 రోజుల వ్యవధిలో మూడు, నాలుగు పర్యాయములలు పిచికారి చేయుట వలన మొక్కలు ఆరోగ్యముగా పెరుగుటయేకాక వ్యాధి నిరోధక శక్తిని సంతరించుకొని బ్యాక్టీరియా, ఫంగస్ వైరస్ తెగుళ్ళ నుండి, రసము పీల్చు పురుగుల నుండి మొక్కలను కాపాడుతాయి.

పురుగుల నివారణ

నీమాస్త్రము:

కావలసినవి: ఆవు పేడ 1 కిలో, ఆవు మూత్రము 5 లీటర్లు, వేపాకు 5 కిలోలు.

తయారుచేయు విధానము: 5 కిలోల వేపాకును మెత్తగా రుబ్బి 5 లీటర్ల మూత్రము, 5 లీటర్ల నీరు, 1 కిలో పేడతో కలిపి ఒక రోజు ఊరబెట్టాలి. ఉదయం, సాయంత్రం కలపాలి. ఈ ద్రావణమును వడపోసి 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకి పిచికారి చేయాలి. రసము పీల్చు పురుగులను, చిన్న చిన్న క్రిములను నివారించవచ్చును. పురుగులు గుడ్లు పెట్టవు, ఆహారం తీసుకోకుండా క్షీణిస్తాయి. గుడ్లు కూడ చనిపోతాయి.

బ్రహ్మాస్త్రము:

కావలసినవి: గానుగ ఆకులు 2 కిలోలు, సీతాఫల ఆకులు 2 కిలోలు, వేపాకు 3 కిలోలు, వావిలాకు 2 కిలోలు, అత్తకోడలు (లాంటినా) ఆకులు 2 కిలోలు, ఆవు మూత్రం 20 లీటర్లు.

ఆకులన్నింటిని విడివిడిగా మెత్తగా రుబ్బి 20 లీటర్ల ఆవు మూత్రంలో నాలుగు పొంగులు వచ్చు వరకు బాగా ఉడకబెట్టాలి. 3 దినములు చల్లార్చి వడపోయాలి. ఇది బ్రహ్మాస్త్రము. అన్ని రకముల పురుగులను నివారిస్తుంది. లీటరు నీటికి 20 నుండి 30 మిల్లీ లీటర్లు అనగా 10 లీటర్లు నీటికి 200 మి.లీ. నుండి 300 మి.లీ. వరకు ఉపయోగించి పిచికారి చేయాలి. ఇది 6 నెలల వరకు నిలువ ఉంటుంది. పచ్చపురుగు, లద్దెపురుగు, గొంగలిపురుగు మొదలగునవి నివారిస్తుంది.

అగ్ని అస్త్రము:

కావలసినవి: పొగాకు ఒక కిలో, ఎల్లిపాయలు అర కిలో, పచ్చిమిరపకాయలు అరకిలో, వేపాకు 5 కిలోలు, ఆవు మూత్రము 20 లీటర్లు.

పొగాకు, ఎల్లిపాయ, పచ్చిమిర్చి, వేపాకు విడివిడిగా మెత్తగా రుబ్బి 20 లీటర్ల మూత్రములో వేసి మూత పెట్టి 4 పొంగులు వచ్చువరకు బాగా ఉడికించాలి. 3 రోజులు చల్లార్చిన తర్వాత వడపోయాలి. ఇది అగ్ని అస్త్రము. కాండము తొలుచు పురుగులను, కాయ తొలుచు అన్ని రకముల పురుగులను సమర్ధవంతముగ నివారిస్తుంది. 10 లీటర్ల నీటికి 200 మి.లీ. అగ్ని అస్త్రమును కలిపి పిచికారి చేయాలి. 6 నెలలు నిలువ ఉంటుంది. పురుగులను సమర్ధవంతముగ నివారిస్తుంది. బ్రహ్మాస్త్రము, అగ్ని అస్త్రమును మార్చి మార్చి పిచికారి చేయాలి. అవసరమనుకుంటే రెండింటిని కలిపి పిచికారి చేయవచ్చు.

దశపత్ర కషాయము:

1) వేప 2) గానుగ 3) సీతాఫలము 4) ఆముదము 5) ఉమ్మెత్త 6) కాకర 7) మందార 8) కసింద 9) బంతి 10) మునగ 11) పసుపు 12) గన్నేరు 13) తుమ్మ 14) వావిలాకు.

కావలసినవి: పై వానిలో 10 రకముల ఆకులు 2 కిలోల చొప్పున, 200 లీటర్ల డ్రమ్ము, పేడ 20 కిలోలు, మూత్రము 10 లీ. పొగాకు 1 కిలో, పచ్చిమిర్చి 1 కిలో, వెల్లుల్లి అర కేజి పసుపు 200 గ్రా., శొంఠి 200గ్రా., నీరు 200 లీటర్లు.

తయారుచేయు విధానము: పై వాటిలో పదిరకాల ఆకులు, పేడ, మూత్రము, పొగాకు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, శొంఠి, పసుపు, మొదలగు వానిని దంచి డ్రమ్ములో వేసి నిండా నీరు పోయాలి. కర్రతో ఉదయం, సాయంత్రం 40 రోజుల పాటు కలయపెడితే దశపత్ర కషాయము తయారవుతుంది. అన్ని రకముల పురుగులను, తెగుళ్ళను నివారిస్తుంది. ఎకరాకు 3 లీటర్ల నుండి 5 లీటర్ల వరకు 100 లీటర్లలో కలిపి పిచికారి చేయాలి. ఈ మందు ఒక సంవత్సరము వరకు నిలువ ఉంటుంది.

పచ్చిమిర్చి – వెల్లుల్లి ద్రావణము:

కావలసినవి: పచ్చిమిర్చి 3 కిలోలు, వెల్లుల్లి అరకిలో, కిరోసిన్ పావు లీటరు మరియు సబ్బుపొడి 100 గ్రా.

తయారుచేయు విధానము: పచ్చిమిర్చి తొడెములను తీసి మెత్తగా నూరి 10 లీ. నీటిలో రాత్రి మొత్తము నానపెట్టాలి. వెల్లుల్లిపాయలు పొట్టుతీసి మెత్తగా నూరి 250 మి.లీ. కిరోసిన్లో రాత్రంతా నానపెట్టాలి. మరునాడు ఈ రెండు ద్రావణములను వడపోసి కలియబెట్టాలి. 100 గ్రా. సబ్బుపొడిని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకి పిచికారి చేయాలి. శనగపచ్చ పురుగు, లద్దె పురుగు, గొంగళి పురుగు అన్ని దశలలోనూ నివారిస్తుంది.

వెల్లుల్లిపాయ-పచ్చిమిర్చి-అల్లం కషాయం

కావలసినవి: వెల్లుల్లి 200 గ్రా. పచ్చిమిర్చి 100 గ్రా. అల్లం 100గ్రా.

తయారుచేయు పద్ధతి: అల్లం, మిర్చి, వెల్లుల్లి వేరు వేరుగా మెత్తగా నూరాలి. ఈ మిశ్రమాన్ని 5 లీ. నీటిలో బాగా కలిపి వడపోయాలి. ఈ ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారి చేయాలి. ఇది రసములు పీల్చు పురుగులు, అన్ని రకముల ఇతర పురుగులు, కొంత వరకు తెగుళ్ళను నివారిస్తుంది.

పొగాకు కషాయం: 1 కిలో పొగాకును 10 లీటర్ల నీటిలో అరగంటసేపు బాగా ఉడకబెట్టాలి. ఈ ద్రావణాన్ని వడపోసి 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఇది అన్ని రకముల రసము పీల్చు పురుగులను, పెద్దపురుగులను నివారిస్తుంది. పంట కాలంలో రెండు పర్యాయములకంటే ఎక్కువ సార్లు ఉపయోగించరాదు.

లొట్టపీచు (రబ్బరాకు) ఆకు కషాయము: 2 కిలోల రబ్బరు ఆకు మెత్తగా రుబ్బి గుడ్డలో మూటకట్టి 5 లీటర్ల నీటిలో ఒక రోజు ఊరనివ్వాలి. మూటను బాగా పిండి, వడపోసి 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకి పిచికారి చేయాలి. ఈ కషాయము అన్ని రకముల పురుగులను నివారిస్తుంది.

సీతాఫల కాయల పొడి కషాయము: పక్వ దశకు వచ్చిన సీతాఫలపు కాయలను బాగా ఎండబెట్టి పొడి చేసుకోవాలి. 5 కిలోల పిండిని 100 లీటర్ల నీటిలో రెండు రోజులు ఊరబోసి ఒక ఎకరాకి పిచికారి చేయాలి.

ఆకుల కషాయము:

1) వావిలాకు 2) సీతాఫల ఆకులు 3) గానుగ ఆకు 4) వేపాకు 5) అత్త- కోడలాకు 6) కుక్కతులసి. పై ఆకులలో ఏ ఆకుతోనైననూ కషాయము చేసి పురుగులను నివారించవచ్చు. పై వానిలో ఏదైనా ఆకును 5 కిలోలు తీసుకుని 10 లీటర్ల నీటిలో అర గంటసేపు ఉడకబెట్టి, చల్లార్చి వడపోసి, 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకి పిచికారి చేయాలి. 10 లీటర్ల నీరు బదులు గో మూత్రము ఉపయోగించి కషాయము చేసిన ఎక్కువ ఫలితము ఇస్తుంది.

వేప పిండి కషాయము: 5 కిలోల వేపకాయల పిండిని 10 లీటర్ల నీటిలో రెండు రోజులు ఊరబోసి పిండిన కషాయమును 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఇది అన్ని రకాల పురుగులను నివారిస్తుంది.

గానుగ గింజల పిండి: గానుగ గింజల పిండి 5 కిలోలను 10 లీటర్ల నీటిలో కలిపి రెండు రోజులు ఊరబోసి, వడపోసి 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మారేడు ఆకుల కషాయము: 5 కిలోల మారేడు ఆకులను 10 లీటర్ల నీటిలో ఉడకబెట్టాలి. చల్లార్చి, వడపోసి 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకి పిచికారి చేయాలి.

తెగుళ్ళ నివారణ: ఆవు మూత్రము కాని, జీవామృతము కాని, పంచగవ్యము కాని 1 లీటరు ద్రావణాన్ని 10 లీటర్ల నీటికి కలిపి 15-20 రోజుల వ్యవధిలో పంటలపై పిచికారి చేస్తే ఏ తెగులు రాదు. పంట ఆరోగ్యకరముగా పెరుగుతుంది.

పులిసిన మజ్జిగ: 1 లీటరు పాలతో 6 లీటర్ల మజ్జిగను తయారు చేసి నాలుగు రోజులు పులియబెట్టాలి. మజ్జిగ ఎన్నిరోజులు పులిస్తే అంత శ్రేష్టము. 100 లీటర్ల నీటిలో ఈ మజ్జిగను కలిపి ఒక ఎకరాకి పిచికారి చేయాలి. ఇది అన్ని రకముల తెగుళ్ళ నివారణలో ఉపయోగపడుతుంది. ముందు జాగ్రత్తగా 20 రోజులకొకసారి పిచికారి చేసినా తెగుళ్ళు రావు.

శొంఠిపాల కషాయము : 200 గ్రా. శొంఠిని పొడిచేసి 2 లీ. నీటిలో వేసి తగిన పాత్రలో పోసి మూతపెట్టి 1 లీ. ద్రవము ఆగువరకు వేడిచేయాలి. చల్లార్చి, ఒక ఎకరాకి పిచికారి చేయాలి.

ఆవుపేడ-మూత్రము-ఇంగువ కషాయము: 5 కిలోల పేడ, 5 లీ. మూత్రము ఒక పాత్రలో ఉంచి, 5 రోజులు ఊరనివ్వాలి. మధ్యలో కలపాలి. ఉపయోగించేముందు వడపోసి 250-500 గ్రా. ఇంగువ కలిపి మిశ్రమాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరము పైరు పై పిచికారి చేయాలి. అన్నిరకముల తెగుళ్ళను సమర్ధవంతముగా నివారిస్తుంది.

బంక కారుట-నివారణ-ఆవుపేడ: నిమ్మ, నారింజ, బత్తాయి, జామ, మామిడిలో బంకకారు తెగులు నివారించడానికి ఆవు పేడను చిక్కగా కలిపి బంక కారే ప్రదేశాన్ని శుభ్రము చేసి పూయాలి. మూడు నెలలకొకసారి ఆవుపేడ చిక్కగా కలిపి పూయాలి.

బూడిద తెగులు నివారణ:

కావలసిన పదార్ధములు: కాగితపుపూల ఆకు, ఒక కేజి, బొప్పాయి ఆకు ఒక కేజి, కలబంద ఆకు ఒక కేజి, నీరు 10 లీటర్లు.

10 లీటర్ల నీటిలో కాగితపు పూల ఆకు, బొప్పాయి ఆకులు, కలబంద ఆకులు వేసి అర గంట సేపు ఉడకబెట్టాలి. చల్లార్చి, వడపోసి 200 గ్రా. పసుపును కలపాలి. 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరము పైరుపై పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.7893044560

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2025-26లో - వ్యవసాయరంగ కేటాయింపులు

డా॥ ఆర్. సునీత దేవి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
రాజేంద్రనగర్, హైదరాబాద్

గౌ॥ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2025-26 ను 20-03-2025న రూ. 3,04,965 కోట్లతో రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ బడ్జెట్ సంక్షేమ పథకాలు మరియు సమగ్ర అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించింది. ఈ బడ్జెట్ (2025-26)లో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ సుమారు రూ. 24,439 కోట్లు కేటాయించడం జరిగింది.

రైతు భరోసా: గత ఏడాది రైతు భరోసాకు 15,075 కోట్లు కేటాయించగా ఈసారి రూ. 2,925 కోట్లు పెంచి మొత్తంగా రూ. 18,000 కోట్లు కేటాయించడం జరిగింది. రైతు భరోసా కింద ఏటా ఎకరాకు రూ. 15 వేలను పెట్టుబడి సాయంగా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. కాని నిధుల కొరత దృష్ట్యా ఎకరాకు రూ. 12 వేలను మాత్రమే ఇస్తామని ఇటీవల ప్రకటించింది. మొదటి విడత జాబితాలోని వారికి ఒక సీజన్ క్రింద రూ. 6 వేల చొప్పున విడుదల చేసింది. మిగిలిన వారికి ఈ నెలాఖరుకల్లా ఇస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో కొత్త బడ్జెట్‌లో రైతు భరోసాకి నిధులను పెంచడంతో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ. 15 వేల చొప్పున అందే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.

సన్నవడ్ల సాగుకు ప్రోత్సాహం: రాష్ట్రంలో సన్నవడ్ల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ప్రకటించింది. దీనికి రైతుల నుండి మంచి స్పందన లభించింది. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో సన్నవడ్ల సాగు 25 లక్షల ఎకరాల నుండి 40 లక్షల ఎకరాలకు పెరిగింది. హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వం రూ. 1,206.44 కోట్లు బోనస్‌గా చెల్లించింది. కాగా సన్నవడ్ల సాగును మరింత పెంచేందుకు వీలుగా బోనస్ ప్రోత్సాహక నిధులను రూ. 1,800 కోట్లకు పెంచింది.

భూమిలేని వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించింది. దీని క్రింద ఒక్కొక్కరికి రూ. 6 వేలు చొప్పున జమ చేసింది. గతంలో ఈ పథకానికి రూ. 906 కోట్లు కేటాయించగా లబ్దిదారుల సంఖ్య తక్కువగా ఉండడంతో తాజా బడ్జెట్‌లో రూ. 600 కోట్లు కేటాయించింది.

రైతు భీమా: 18 నుండి 60 ఏళ్ళ లోపు వయసున్న రైతులు మరణిస్తే రూ. 5 లక్షల పరిహారం అందించే రైతు భీమా పథకానికి ప్రభుత్వం రూ. 1,589 కోట్లను కేటాయించింది.

పంటల భీమా: రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించి విధివిధానాలను ఖరారు చేస్తూ తాజా బడ్జెట్‌లో రూ. 1,300 కోట్లు కేటాయించింది.

పశుసంవర్ధక శాఖ: తెలంగాణ పశుసంవర్ధక పాడి, మత్స్య శాఖలకు కొత్త బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. 2024-25 బడ్జెట్‌లో రూ. 1,980 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాది వాటిని రూ. 1,674 కోట్లకు తగ్గించింది.

ఉద్యాన పంటలకు చేయూత: రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకుగాను ఈ విభాగానికి రూ. 2,419 కోట్లను కేటాయించింది. ఇందులో రూ. 258 కోట్లు ఆయిల్‌పామ్ సాగుకు నిర్దేశించంది. ఉద్యాన పంటల సాగులో బిందుసేద్యం కోసం సౌర విద్యుత్తును ఉపయోగించే రైతులకు రూ.14 కోట్ల ప్రోత్సాహక సబ్సిడీని ఇవ్వనుంది.

వ్యవసాయానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ. 4 వేల కోట్లు, విత్తనాల సబ్సిడీకి రూ. 10 కోట్లు, నూతన విత్తన విధానం అమలుకు రూ. 10 కోట్లు కేటాయించింది.

రాష్ట్రంలో అత్యధిక కుటుంబాలకు వివిధ పథకాలు చేరువయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పన చేసిందని, గౌ॥ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అన్నారు.

సహజ పద్ధతిలో మామిడి పండ్లను పండిద్దాం - ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

డా॥ యూ. స్రవంతి, డా॥ శివకృష్ణ కోట,
డా॥ జి. ప్రియా సుగంధి, డా॥ ఐ. తిరుపతి
మరియు ఏ. నాగరాజు
కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా

మామిడి పండ్లను చూడగానే ఎవరికైనా నోరూరుతుంది. పండ్లలో రారాజు మామిడి. దీని రుచి ఎంతో మధురంగా ఉంటుంది. మంచి రంగుతో నిగనిగలాడుతుంటే వాటిని కొనేందుకు, తినేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో రంగు చూసి కొంటే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్లే అవుతుంది.

మామిడిపండు చాలా ఆరోగ్యకరమైనది. ఇందులో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, అనేక ఇతర సూక్ష్మపోషకాలు ఉంటాయి. అయితే ప్రస్తుతం ఈ ఫలం విషతుల్యంగా మారుతోంది. కాయలు పక్వానికి రాకముందే తెంపుతూ.. కృత్రిమంగా మాగ బెడుతున్నారు. నిషేధిత కాల్షియం కార్బైడ్, ఇతర ప్రమాదకర రసాయనాలను ఇప్పటికీ వినియోగిస్తున్నారు వ్యాపారులు. మరి ఈ కెమికల్స్‌తో పండించిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయి.

మామిడిని మాగబెట్టే క్రమంలో మంచి రంగు కోసం వ్యాపారులు కాల్షియం కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాలు వినియోగిస్తున్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో మాగబెట్టిన పండ్లనే కొనుగోలు చేయాలి, లేకుంటే తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి.

మామిడి పండ్లను మాగ పెట్టడానికి - పాత పద్ధతులు:

- పక్వతకు వచ్చిన మామిడి కాయలను బియ్యంలో ముంచి ఉంచడం.
- కాయలను న్యూస్ పేపర్‌లో చుట్టి ఉంచడం.
- కొన్ని పండిన మామిడి పండ్లను మామిడి కాయలతో కలిపి ఉంచడం.

కాల్షియం కార్బైడ్ సురక్షితం కాదు : చాలా కాలముగా మామిడి, అరటి మరియు సపోటా పండ్లను కృత్రిమంగా కాల్షియం కార్బైడ్‌తో మాగబెట్టటం వ్యాపారపరంగా జరుగుతుంది. వ్యాపారులు సాధారణంగా పండ్లను దూర ప్రాంతాలకు సరఫరా చేయడం కొరకు కాల్షియం కార్బన్ ఉపయోగించి పండ్లను మాగ పెట్టే పద్ధతిని పాటిస్తుంటారు. కానీ ఈ పద్ధతిలో పండించినటువంటి మామిడి పండ్లు నాణ్యత సరిగా ఉండక కేవలం రంగు మాత్రమే బాగుంటుంది. అదే విధంగా రుచి కూడా తియ్యగా ఉండకుండా, పుల్లగా ఉంటుంది. ఈ పద్ధతిలో పండించిన మామిడి పండ్లు కేవలం రంగు బాగుండటం వలన మార్కెట్లో ఎక్కువ ధరకు అమ్ముడు పోతుంటాయి. ప్రస్తుతం మామిడి కాయలను కాల్షియం కార్బైడ్‌తో మాగ బెట్ట వద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు (జీవో ఆర్‌టి. నెంబరు. 288: 19-03-2012). ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్ట్రేషన్ (పి.ఎఫ్.ఎ), 1954 యాక్ట్ (చట్టం) మరియు ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్ట్రేషన్ రూల్స్, 1955 రూల్ నెం. 44 (ఎఎ) ప్రకారం కాల్షియం కార్బైడ్‌తో పండ్లను మాగబెట్టటం నిషేధించటమైనది. దీనిని అతిక్రమించిన వారికి 3 సం॥ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడుతుంది. కేవలం సహజంగా ఇథలిన్ వాయువుతో పండించే మామిడి పండ్లు ఆరోగ్యానికి మంచివి. అంతేకాకుండా తియ్యగా, మంచి వాసనతో ఉంటాయి.

కాల్షియం కార్బైడ్ వినియోగంపై నిషేధం విధించిన నేపథ్యంలో ప్రస్తుతం మార్కెట్లో మామిడి కాయలను కృత్రిమంగా మాగపెట్టేందుకు 'చైనా పొడి'ని వాడుతున్నారు. కొన్ని సందర్భాల్లో కాల్షియం కార్బైడు పొడి చేసి వాడుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే చైనా నుంచి దిగుమతి అయిన ఈ పొడిని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పరిశోధన, ప్రయోగ

సంస్థలేవీ ధ్రువీకరించలేదు. అధికారికంగా ఈ పొడి వాడకానికి ఎలాంటి అనుమతులు లేవు.

మామిడి వంటి పండ్ల పక్వం కోసం సాధారణంగా ఉపయోగించే కాల్షియం కార్బైడ్ ఎసిటిలీన్ వాయువును విడుదల చేస్తుంది. ఇందులో ఆర్సెనిక్, ఫాస్పరస్ వంటి హానికరమైన సమ్మేళనాలు ఉంటాయి. ఈ పదార్థాలు శరీరంలోకి వెళితే మైకం, తరచుగా దాహం, చికాకు, బలహీనత వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. అంతేకాదు మింగడంలో ఇబ్బంది, వాంతులు, నోటి పూతలు వంటివి కూడా ఎదురవుతాయి. ఇతర దీర్ఘకాలికి సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉంటుంది.

క్యాన్సర్: కొన్ని అధ్యయనాల ప్రకారం కాల్షియం కార్బైడ్ క్యాన్సర్ కణాల పెరుగుదలను ప్రేరేపిస్తుందని, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని సూచిస్తున్నాయి.

గుండె జబ్బులు: ఇండియన్ జర్నల్ ఆఫ్ ఆక్యుపేషనల్ మెడిసిన్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం. కాల్షియం కార్బైడ్ ఉపయోగించి మాగబెట్టిన పండ్లను తిన్న వారు తరచుగా గుండె జబ్బులకు గురవుతారని, ముఖ్యంగా గుండెపోటు, గుండె వైఫల్యం వంటివి సంభవిస్తాయని కనుగొన్నారు. ఈ పరిశోధనలో భారతీయ వైద్యుడు, పరిశోధకుడు డా॥ కె.వి. రావు పాల్గొన్నారు. కాల్షియం కార్బైడ్‌లో ఉండే ఎసిటిలిన్ వాయువు గుండెపోటుకు కారణమయ్యే రక్తం గడ్డకట్టడానికి దారితీస్తుందని ఆయన పేర్కొన్నారు.

కాల్షియం కార్బైడ్ విషపూరితమైనది. ఇది కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, మైకం, కొన్ని సందర్భాల్లో శ్వాసకోశ సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉంటుంది.

న్యూరోలాజికల్ సమస్యలు: కాల్షియం కార్బైడ్ ద్వారా పండిన మామిడి పండ్లు తింటే దీర్ఘకాలిక హైపోక్సియాను ప్రేరేపిస్తుంది. ఇది నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ కారణంగా తలనొప్పి, కాళ్లు చేతులలో తిమ్మిరి, బలహీనత, రక్తపోటు, మూర్ఛ, తల తిరగడం, అతి నిద్ర, జ్ఞాపకశక్తి కోల్పోవడం, సెరిబ్రల్ ఎడెమా, తక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయని అంటున్నారు. అందుకే మామిడి పండ్లు తినడానికి ఓ గంట ముందే వాటిని నీటిలో ఉంచడం ద్వారా వాటి మీద ఉన్న అవశేషాలు, రసాయనాల ప్రభావం ఎంతో కొంత తగ్గుతుందని అంటున్నారు.

కార్బైడ్ మరియు ఇథిలీన్ వాయువు ద్వారా మాగబెట్టడం మధ్య ప్రయోజనాలు మరియు వ్యత్యాసాలు

కార్బైడ్‌తో మాగబెట్టినపుడు:

- చట్టప్రకారం ఈ పద్ధతి నిషేధించబడినది మరియు శిక్షార్హం
- ఆరోగ్యానికి అపాయకరం, క్యాన్సర్ కారకము, అన్ని అవయవములను దెబ్బతీస్తుంది.
- ఈ పద్ధతిలో పండించిన పండ్ల రుచి పుల్లగా ఉండి తక్కువ ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.
- తక్కువ కాలం నిల్వ ఉంటాయి. 2-3 రోజులలోనే పండు తొక్కపై మచ్చలు కన్పిస్తాయి.
- గిరాకి రోజురోజుకి తగ్గుతుంది.
- మాగబెట్టడానికి ఖర్చు ఎక్కువ
- రవాణా నష్టం ఎక్కువ
- పండు బరువు 10-13% కంటే ఎక్కువ బరువు కోల్పోతుంది.

ఇథిలీన్ వాయువుతో మాగబెట్టినపుడు:

- చట్టప్రకారం ఈ పద్ధతి ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా అంతర్జాతీయంగా అనుమతి పొందింది.
- ఈ పద్ధతిలో పండించిన పండ్లు ఆరోగ్యానికి పూర్తిగా సహజమైనది, సురక్షితము.
- రుచి తియ్యగా ఉండి పూర్తి ఆహ్లాదం కలిగిస్తుంది.
- నిలువ కాలం : ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది.
- మాగబెట్టడానికి ఖర్చు తక్కువ

- రవాణా నష్టం తక్కువ
- పండు బరువు 7-10% కంటే తక్కువ

రైపెనింగ్ చాంబర్‌ను - అతి తక్కువ ఖర్చుతో ఏర్పాటు: రైతులు తక్కువ స్థలంలోనే ఇంటి వద్ద లేదా తోట వద్దే సొంతంగా రైపెనింగ్ చాంబర్‌ను నిర్మించుకోవచ్చు లేదా అందుబాటులో ఉన్న గదిని వాడుకోవచ్చు.

గాలి, వెలుతురు చొరబడకుండా కిటికీలు మూసి సీల్ చేయాలి. ఇప్పుడు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఇథిలీన్ సిలిండర్లు దొరుకుతున్నాయి. ఒక్కో సిలిండర్ ధర రూ.350 వరకు ఉంటుంది. ఒక్కో సిలిండర్‌ను ఉపయోగించి 3 నుంచి 4 టన్నుల మామిడి కాయలను మాగపెట్టొచ్చు. తొలుత గదిని గాలి, వెలుతురు చొరకుండా సీల్ చేసుకోవాలి. రైపెనింగ్ చాంబర్‌లో మామిడికాయలను ఉంచాలి. గది విస్తీర్ణంలో మూడో వంతుకు మించకుండా పక్వానికి సిద్ధంగా ఉన్న కాయలను క్రేట్లలో అమర్చుకోవాలి. 100 నుంచి 150 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) ఇథిలీన్ వాయువును ప్రవేశపెట్టాలి.

12 నుంచి 24 గంటల పాటు చాంబర్ తలుపులను మూసి ఉంచాలి. తర్వాత గదిని రెండు మూడు గంటల పాటు తెరిచి ఉంచితే కార్బన్ డై ఆక్సైడ్ బయటకు పోయి కాయలు నల్లబడకుండా ఉంటాయి, తరువాత మరోమారు ఇథిలీన్ వాయువును పంపి మళ్లీ 12 గంటల పాటు గదిని మూసి, ఉంచాలి. నాలుగు నుంచి ఐదు రోజుల్లో పండ్లు పక్వానికి వచ్చి మంచి రంగు, రుచితో ఉంటాయి. గదిని మూసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సన్నని పైపు ద్వారా ఇథిలీన్ వాయువును పంపాలి. రెగ్యులేటర్ సాయంతో అవసరమైన మొత్తంలో ఇథిలిన్ వాయువును పంపవచ్చు. మొదటి దశలో 150 పీపీఎం, రెండో దశలో 100 పీపీఎం వరకు వాయువును పంపాలి. కాల్షియం కార్బైడ్ వినియోగంతో కాయ చర్మం రంగు మారినా లోపల గుజ్జు మాత్రం పక్వానికి రాదు. కానీ ఇథిలీన్ వాయువు ద్వారా మాగపెట్టే పండ్లు లోపల గుజ్జు కూడా పూర్తిగా పక్వానికి వస్తుంది. అవసరమైతే వీటిని కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచి నింపాదిగా మార్కెటింగ్ చేసుకోవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9490844782

పి.జె.టి.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.

తేది	అంశం
02.04.2025	సమీకృత వ్యవసాయం (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్)
	వృత్తి శిక్షణ మరియు ఉపాధి హామీ కోసం నైపుణ్యాభివృద్ధి
09.04.2025	పంట కోత తరువాత వచ్చే నష్టాలను నివారించుట
	పిల్లల పోషణ మరియు ప్రారంభ బాల్య అభివృద్ధి
16.04.2025	వివిధ పంటలలో మల్చింగ్ యొక్క ప్రాముఖ్యత-మల్చింగ్ వాడకం వాటి రకాలు
	గ్రామ వికాసానికి ప్రభుత్వ పథకాలు
23.04.2025	వేసవిలో కూరగాయల సాగు
30.04.2025	వేసవి కాలాన్ని ఎలా జయించాలి?
	ఉసిరి యొక్క ఉపయోగాలు మరియు ప్రయోజనాలు
	ప్రసూతి ఆరోగ్యం మరియు ప్రసావానంతర సంరక్షణ యొక్క ప్రాముఖ్యత

వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ ఆర్. సునీత దేవి



అడ్డం:

1. చెఱకులో ఏ తెగులు లక్షణాలను "ఇనుపధాతు" లోప లక్షణాలుగా పొరబడే అవకాశముంది? (7)
2. అత్యంత విషపూరితమైన పురుగుమందు అని తెలియజేయడానికి డబ్బా మీద త్రికోణాకారంలో ఏ రంగు ఉంటుంది? (3)
3. ఒక క్వింటాల్ బెల్లంలో ఎన్ని గ్రాముల కంటే ఎక్కువ సల్ఫర్ డయాక్సైడ్ ఆరోగ్యానికి హాని కలుగజేస్తుంది? (2)
4. పొలంలో ప్రధాన పంటల చుట్టూగాని, గట్ల వెంబడి గాని కొద్ది వరుసలలో వేసే పైరును ఏమంటారు? (4)
6. మూడు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులో ఎన్ని కిలోల గంధకం లభిస్తుంది? (5) (కుడి నుండి ఎడమకి)
8. తీగజాతి కూరగాయలలో దేనికి సంబంధిత పురుగు / తెగులు మందులు వాడరాదు? (3)
9. భాస్వరం కరిగించడంతోపాటు నేలలో ఉండే సేంద్రియ పదార్థాలను విచ్ఛిన్నం చేసి పోషకాలను మొక్కల వేర్లకు అందించే జీవన ఎరువు ఏది? (4)
10. వయ్యారిభామ కలుపు మొక్క నియంత్రణకు పొలంలో ఏ పురుగు విడుదల చేయాలి? (9)
12. ప్రస్తుతం మనం వాడుకుంటూనే భావితరాలకు మంచి దిగుబడి సాధించేందుకు దేనిని ఆరోగ్యంగా అందించాలి? (3)

నిలువు:

1. పురుగుమందు కొన్నప్పుడు రైతాంగం డబ్బాపై గమనించాల్సిన ఓ ముఖ్యమైన అంశం ఏది? (5)
2. సస్యరక్షణలో భాగంగా ప్రధాన పొలంలో దేనిని అక్కడక్కడ వేయాలి? (4)
5. మిరపలో ఆశించే ఏ పురుగు వలన కాయలు బుడ్డలుగా మారుతాయి? (2)
7. ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమం ఏరోజు ప్రసారమవుతుంది? (4)
9. వివిధ పంటల్లో కాండం తొలుచు పురుగులను గ్రుడ్డు దశలో నివారించే పరాన్నజీవి ఏది? (4)
11. విత్తనోత్పత్తి చేసే / జరిగే పొలాలలో ఇవి అసలు ఉండకూడదు? (3)

సమాధానాలు 39వ పేజీలో

ఏప్రిల్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట

మామిడి: ఈ మాసంలో కురిసే అకాల వర్షాల వల్ల ఆకులమీద, కాయలమీద మచ్చ తెగుళ్ళు రాకుండా మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. గాలిలో తేమ తక్కువగా ఉండటం, ఎండల ఉధృతి పెరగడం వల్ల ఎదిగే కాయలు రాలే అవకాశం ఎక్కువ. 1 శాతం యూరియా (10 గ్రా. 1 లీటరు నీటికి లేదా ప్లానోఫిక్స్ 1 మి.లీ. 4.5 లీ. నీటికి చొప్పున కలిపి పిచికారి చేయడం ద్వారా కాయ రాలడంను నివారించవచ్చు. ఈ నెలలో పొలుసు పురుగులు, తామర పురుగులు, పిండినల్లి కాయలను ఆశిస్తాయి. వీటి నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

జామ: చలికాలంలో వచ్చే పంట (మృగ్ బహార్) కోసం, నీటి తడులు ఆపి ఈ మాసంలో ఆకులు రాలేటట్లు చూసుకోవాలి. లేత ఆకు, పిందెలపై ఈ మాసంలో గోధుమరంగు మచ్చలు ఏర్పడి, ఉధృతి పెరిగే కొద్దీ మచ్చ పెరిగి ఆకు అంతా విస్తరిస్తుంది. నివారణకు మచ్చ కన్పించిన వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధితో 2-3 సార్లు పిచికారి చేయాలి.

అరటి: ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది కాబట్టి ప్రతి 3-4 రోజులకు తప్పనిసరిగా తడి ఇవ్వాలి. తొండంతో సహా గెల మొత్తాన్ని ఆకు చుట్టి గెలను ఎండ నుండి కాపాడుకోవాలి. గెల మీద లీటరు నీటికి 5 గ్రా. పొటాషియం నైట్రేటు మరియు సల్ఫేట్ ఆఫ్ పొటాషియంలను మార్చి మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధితో 4 సార్లు పిచికారి చేయాలి.

బత్తాయి, నిమ్మ: ఈ మాసంలో నల్లి, పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు ప్రొపార్గైట్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

ద్రాక్ష: ఏప్రిల్ మొదటి పక్షం లోపు ఒకటి లేదా రెండు కణుపుల దగ్గర వేసవి కత్తిరింపులు చేయాలి. చిగురించిన తరువాత వచ్చే లేత చిగుర్లను పెంకు పురుగుల నుండి రక్షించుటకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

బొప్పాయి: పెద్ద మొక్కలకు ప్రతి రోజు 20-25 లీ. నీరు అందునట్లు డ్రిప్పర్లు అమర్చుకోవాలి. వైరస్ తెగుళ్ళ నివారణకు డైమిథోయేట్ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. అంతేకాక వైరస్ తెగుళ్ళు ఆశించిన మొక్కలపై సూక్ష్మధాతు పోషక మిశ్రమం 5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసినట్లైతే ఆకులు విప్పారి దిగుబడులు పెరుగును.

సపోట: ఈ మాసంలో కాయ తొలుచు పురుగులు కాండం ద్వారా గింజను చేరుకొని గింజను తింటాయి. దీని వలన కాండం పాడవకపోయినా, కొనుగోలుదారులలో అయిష్టత ఏర్పడుతుంది. నివారణకు గోకి పరిమాణంలోని పిందెలపై క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

సీతాఫలం: ఈ మాసంలో నీరు పెడితే బాగా పెరిగి ముందుగా కాపునిస్తుంది.

కూరగాయలు:

టమాట: పూత దశలో ఎకరాకు 400 మి.గ్రా. 2,4-డి మందును 200 లీటర్ల నీటికి కలిపి లేదా 1 మి.లీ. ప్లానోఫిక్స్ 4.0 లీ. నీటిలో కలిపి పిచికారి చేస్తే పూత, పిందె నిలిచి మంచి దిగుబడి వస్తుంది. వేసవి టమాట పంటకు ఎండ తీవ్రతను తగ్గించుటకు ప్రతి 2-3 వరుసల టమాటకి రెండు వరుసల మొక్కజొన్న పంటను ఉత్తర దక్షిణ దిశలో విత్తుకోవాలి.

వంగ: ఈ మాసంలో కాయలు కోయడానికి 1-2 రోజుల ముందు నీటితడులు ఇవ్వాలి. లేకపోతే వంకాయలు ఎక్కువ చేదుగా ఉంటాయి. మొవ్వు మరియు కాయ తొలుచు పురుగు ఆశించిన కొమ్మల చివర్లు త్రుంచి నాశనం చేసి క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు కాయలు కోసిన తరువాత పిచికారి చేయాలి.

బెండ:కాయతొలుచు పురుగుల నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పూత దశలో లీటరు నీటికి 10 గ్రా. యూరియా కలిపి పిచికారి చేయడం ద్వారా 20-25 శాతం నత్రజని ఆదాతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చు.

మిరప: మిరప కాయలను అకాల వర్షాలకు గురికాకుండా, రంగు కోల్పోకుండా ఉండేందుకు ఆధునిక డ్రయ్యర్లలో ఎండబెట్టి నాణ్యమైన మిరపకాయలను పొందవచ్చు. అవకాశం ఉన్న రైతులు మిరపకాయలను శీతల గిడ్డంగులలో నిల్వ చేసుకొని అధిక ధర సమయంలో అమ్ముకోవడం ద్వారా ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చు.

పందిరి కూరగాయలు: గుమ్మడి పెంకు పురుగుల పిల్ల పురుగులు ఆకులను, పూలను కొరికి తింటాయి. తీవ్ర దశలో ఆకులను, పూలను పూర్తిగా తిని నష్టాన్ని కలుగజేస్తాయి. వీటి నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

గోరుచిక్కుడు: ఆకులమీద నల్లని మచ్చలు ఏర్పడి, ఉధృతి ఎక్కువైనప్పుడు మచ్చలన్నీ కలిసిపోయి ఆకులు మాడి రాలిపోతాయి. నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

తోటకూర : ఈ మాసంలో తెల్లమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. ఆకుల అడుగు భాగంలో తెల్లటి బుడిపెలు వంటివి ఏర్పడి ఆకు పైభాగాన లేత పసుపు రంగు మచ్చలు ఏర్పడి, పండు బారి ఎండిపోతాయి. నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ మందును కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిచేలా పిచికారి చేయాలి.

కరివేపాకు: పొలుసు పురుగులు కాండంపై చేరి రసాన్ని పీలుస్తాయి. మొక్క పెరుగుదల తగ్గిపోతుంది. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పిచికారి చేసిన తరువాత 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకు కోయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు 1 గ్రా. కార్బెండాజిమ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9441168156



వేసవి కూరగాయల సాగులో చేపట్టవలసిన ప్రత్యేక యాజమాన్య పద్ధతులు

గుడిపెల్లి వేణుగోపాల్, డా॥ లంకటి మహేష్ మరియు డా॥ ఎన్. వెంకటేశ్వర్ రావు

కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట

వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రత, వాతావరణంలో ఉండే తక్కువ తేమ కూరగాయల సాగుకు ప్రతిబంధకమవుతుంది. వీటిని అధిగమించి రైతులు కూరగాయలు వేసవిలో సాగుచేసి అధిక లాభాలు పొందాలంటే, వేసవికి అనువైన కూరగాయలను, వాటిలో అధిక వేడిని తట్టుకొని దిగుబడినిచ్చే ప్రత్యేక రకాలనుగాని హైబ్రిడ్లనుగాని ఎన్నుకోవాలి. వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వడగాల్పుల వలన మొక్క పెరుగుదల తక్కువగా ఉండి, పూత, పిందె తగ్గి, దిగుబడులు తగ్గుతాయి.

అందువలన రైతులు కొన్ని ప్రత్యేక యాజమాన్య పద్ధతులు చేపట్టి, ఉన్న కొద్ది నీటివనరులను సక్రమంగా వినియోగించుకొని కూరగాయల సాగుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే రైతులు అధిక లాభాలు పొందటమేగాక వినియోగదారులకు సరసమైన ధరలకు నాణ్యమైన కూరగాయలను అందించగలుగుతారు.

రైతులు చేపట్టవలసిన చర్యలు:

విత్తన ఎంపిక: ప్రత్యేకంగా వేసవి సాగుకి సూచించిన రకాలను గాని, హైబ్రిడ్స్‌నిగాని ఎంపిక చేసుకోవాలి. అవి నీటి ఎద్దటిని, అధిక వేడిమిని తట్టుకొని నమ్మకంగా దిగుబడులు ఇచ్చును.

విత్తనశుద్ధి:

- వేసవిలో నారు నీడలో పెంచాలి. తప్పనిసరిగా రసంపీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ (5 గ్రా/ కిలో విత్తనానికి) తో విత్తనశుద్ధి చేయాలి.

నారు పెంపకంలో మెళకువలు:

- వేసవికాలంలో విత్తన మోతాదు ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే వేసవిలో మొక్క పెరుగుదల తక్కువగా ఉంటుంది. కాబట్టి మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండేటట్లు చూడాలి.

ఉదా: టమాట వర్షాకాలంలో 60×45 సెం.మీ. దూరంలో నాటుకుంటే వేసవిలో 45×30 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. బీరలో అయితే 2.0×0.5 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. అదే బెండలో వర్షాకాలం పంటకు ఎకరాకు 4 కిలోల విత్తనము వాడితే, వేసవి పంటకు 6 కిలోల విత్తనం వాడాలి. కావున విత్తన ఖర్చు కూడా పెరుగుతుంది కనుక ఆ విత్తన్నాన్ని ప్రోట్రేలలో నాటుకోవడం ఉత్తమం. సాంప్రదాయ పద్ధతిలో అయితే ఎక్కువ విత్తనం పడుతుంది అలాగే వృధా అయ్యే అవకాశం కూడా ఎక్కువే. సాంప్రదాయ పద్ధతిలోని నారుమళ్ళపై నైలాన్ వల ఏర్పాటు చేసుకుంటే కూడా రసంపీల్చే పురుగులు, వైరస్ తెగుళ్ళ సమస్యను అధిగమించవచ్చు. మళ్ళలో మొత్తం విత్తనాన్ని ఒకేసారి విత్తకుండా విడుతలుగా విత్తుకోవటం మంచిది. దీనివలన ఒకే సమయంలో పండించిన కూరగాయ పంట దెబ్బతిన్నా లేదా పంటదిగుబడి ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువ ధర పలికితే ఇంకో సమయంలో విత్తిన పంట నుండి మంచి లాభం పొందే అవకాశం ఉండును.

షేడ్‌నెట్ల ద్వారా మరియు మొక్కల ద్వారా వేసవి తాపాన్ని ఆపటం:

- పొలంలో మొక్కలకు నీడనిచ్చే విధముగా ఆముదం, మొక్కజొన్నలాంటి పంటలను ఉత్తర దక్షిణ దిశలలో నాటుకోవాలి. వీలైన రైతులు 35 శాతంగాని 50 శాతంగాని షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేసుకుంటే ఎండ తీవ్రతను తగ్గించి మంచి దిగుబడులను సాధించవచ్చు.
- వేసవిలో కొత్తగా నాటిన మామిడి, జామ, కొబ్బరిలాంటి పండ్లతోటల్లో మొదటి 3-4 సంవత్సరాలు అంతరపంటగా బెండ, సొర, బీర, గుమ్మడి, ఫ్రెంచి చిక్కుడు, గోరుచిక్కుడు, వంటి కూరగాయ పంటలను సాగుచేసి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చును.

మల్చింగ్ పద్ధతి:

- నేలలోని తేమని సంరక్షించుకొనే చర్యలు చేపట్టాలి. వీలైనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు, వాటితోపాటు జీవన ఎరువులు వాడితే మంచి ఫలితం ఉంటుంది. సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడటంవల్ల నేల గుల్లబారటం, తేమను ఎక్కువ రోజులు పట్టి ఉంచి మొక్కకు అందుబాటులో ఉండేటట్లు చేస్తుంది. పాదుల్లో, రెండువరుసల మధ్య వరిగడ్డి, వరి ఉనక, వేరుశనగ పొట్టు, ఎండుటాకులు లేదా పచ్చిరొట్టె ఎరువులను నేలపై పరిచి తేనేలలో తేమ సంరక్షించబడి మొక్కకు ఎక్కువ రోజులు అందుబాటులో ఉండటమేగాక కలుపు పెరుగుదల అరికట్టబడుతుంది.
- ఉన్న కొద్దిపాటి నీరు బిందు (డ్రిప్) లేదా తుంపర్ల పద్ధతిలో ఇవ్వటం వలన కొద్ది పాటి నీటితో ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయల పంటలను పండించవచ్చు. అలాగే ప్లాస్టిక్ మల్చింగ్‌ను కూడా వాడవచ్చును.

నీటి యాజమాన్యం:

- ఒక ఎకరాకు సరిపడా నీటితో డ్రిప్ పద్ధతి ద్వారా 2 ఎకరాలలో తుంపర్ల పద్ధతిలో 1 1/2 ఎకరాలలో సాగు చేయవచ్చు. అంతేగాక నీరు సక్రమంగా ఇవ్వటం వలన తుంపర్ల ద్వారా ఎండవేడి తగ్గి మంచి దిగుబడులను పొందవచ్చు. సాధారణ పద్ధతి నీరు ఇచ్చె పంటలలో ఎండతీవ్రత తగ్గించటానికి అప్పుడప్పుడు సాయంత్రం వేళల్లో నీటిని పిచికారి చేయాలి.
- టమాటలో, పుచ్చలోను నీటి యాజమాన్యం సరైన సమయంలో లేకపోతే కాయ పగుళ్ళు వస్తాయి. నీటి యాజమాన్యం సక్రమంగా ఉండేటట్లు చూడాలి. ఆ తరువాత కాయ పగుళ్ళ నివారణ కోసం బొరాక్స్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

పూత, పిందె యాజమాన్యం:

- తీగజాతి కూరగాయలలో అధిక ఉష్ణోగ్రతకు మగపూలు ఎక్కువగా పూస్తాయి. దీని నివారణకు పూతదశలో సైకోసిల్ 2.5 గ్రా. లేదా 0.5 గ్రా. మాలిక్ హైడ్రజైడ్ 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా గింజ విత్తిన 15 రోజులకు 2-4 ఆకుల దశల్లోనే 1-2 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి లేదా ఇతరిల్ 2.5 మి.లీ. 10 లీటర్ల నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేస్తే తరువాతి దశలో ఆడపూల సంఖ్య పెరిగి అధిక దిగుబడులు వస్తాయి.

అదే ఆకుకూరలలో అయితే..

- ఆకు కూరల పంటలలో ఆకు దిగుబడి పెంచటానికి 2 శాతం యూరియా (10 గ్రా./లీ.) + 50 పి.పి.యం. జిబ్బెరిల్లిక్ ఆమ్లం (50 మి.గ్రా. జి. ఎ-3 /లీ. నీటికి) కలిపి పిచికారి చేయాలి.
- వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకోవటానికి వీలుగా 2% యూరియా (యూరియా 20 గ్రా. /లీ.) నీటిలో ద్రావణాన్ని పంటపై పిచికారి చేయాలి.

మరికొన్ని మెళకువలు

- పోటాష్‌ను సరియైన మోతాదులో వాడితే నీటి ఎద్దడిని, చీడపీడలను తట్టుకొనే గుణం మొక్కలలో ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ప్రతి కిలో యురియాకు అరకిలో పోటాష్‌ని తప్పనిసరిగా వాడాలి.
- యూరియా ఎండవేడికి త్వరగా ఆవిరి కాకుండా మొక్కకు ఎక్కువ రోజులు అందుబాటులో ఉండే విధంగా 9 కిలోల యురియాకు ఒకకిలో వేపపిండిని కలిపివేయాలి అలాగే ప్రతి 25 కిలోల యూరియాకు కిలో వేపనూనె కలిపి అరగంటసేపు ఆరబెట్టి పంటలకు వేయాలి.
- పూత, పిందె రాలకుండా పిందె బాగా పట్టడానికి టమాట, వంగలాంటి పంటలకు ఒక మి.లీ. ప్లానోఫిక్స్ (ఎన్.ఎ.ఎ.) 4.5 లీటర్ల నీటిలో కలిపి పూతదశలో వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.
- మిరపలో పూతదశలో ట్రైకాంటినాల్ 2.0 మి.గ్రా. లేదా 2.5 మి.లీ. ప్లానోఫిక్స్ 10 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేస్తే పిందె నిలిచి కాత బాగా ఉంటుంది.
- కాయగూరలను, ఆకుకూరలను, చల్లటి పూటకోసి, తడి గోనె సంచికప్పి మార్కెట్‌కి పంపాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9705170776



వేసవికాలంలో ఆయిల్‌పామ్ తోటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు

డా॥ ఆది శంకర్, యం. రాజేష్ కుమార్, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, ఆర్. రఘువరన్ సింగ్, డా॥ ఓ. శైల,
డా॥ బి. రాజశేఖర్, కె. రామకృష్ణ, ఇ. జోత్స్న మరియు వి. పుష్పలత
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, నాగర్‌కర్నూల్

తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు అనేది రోజురోజుకు పెరుగుతుంది. ఉద్యానశాఖ కల్పిస్తున్న ప్రోత్సాహకాలతో ఆయిల్‌పామ్ సాగు పై రైతులు మక్కువ పెంచుకుంటున్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఉద్యాన & పట్టుపరిశ్రమ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ప్రస్తుతం తెలంగాణలో 2.00 లక్షల ఎకరాలలో సాగు నీటి వసతి కింద రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారు. ఇందులో దాదాపు 55,000 ఎకరాలలో తోటలు కాత దశలో ఉన్నాయి. సుమారు 1.5 లక్షల ఎకరాలలో లేత తోటలు ఉన్నాయి. మంచి యాజమాన్య పద్ధతులు పాటించిన రైతులు పది సంవత్సరాలు పైబడిన ఆయిల్‌పామ్ పంట నుండి సాలిన ఎకరాకు సరాసరిన 10-12 టన్నుల గెలల దిగుబడి సాధిస్తున్నారు.

వేసవి కాలంలో అనగా మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో అధిక ఉష్ణోగ్రతలు దృష్టిలో ఉంచుకొని కొత్తగా వేసిన ఆయిల్‌పామ్ మరియు ఎదిగిన ఆయిల్‌పామ్ పంట పెరుగుదలను కాపాడుకుంటూ, మంచి దిగుబడి సాధించేందుకు గాను దిగువ సూచించిన యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలి.

అబ్లేషన్: నాటిన 14 నుండి 36 నెలల వరకు ఎలాంటి పొత్తులు (మగ ఆడ పూల గుత్తులు) ఉంచకుండా తొలగించాలి. దీనినే అబ్లేషన్ అంటారు.

మల్చింగ్: వేసవిలో ఆయిల్‌పామ్ చెట్ల చుట్టూ పాదులలో ఎండుగడ్డి లేదా పంట అవశేషాలు మల్చింగ్ లేదా జనుము నాటుకోవాలి. అవి పూత దశలో ఉన్నప్పుడు జనుమును ముక్కలుగా చేసి పాదులలో వేసుకోవాలి. ఆయిల్‌పామ్ ఉప ఉత్పత్తులు అయిన డి-మక్, ఖాళీ గెలలు, గెలల పించులను మరియు చెట్టు నుండి తీసిన వ్యర్థ భాగాలను పాదులలో వేయుటవలన పాదులలో తేమ ఆరకుండా ఉండడమే కాకుండా అవి కుళ్ళి తిరిగి చెట్టుకి ఎరువుగా ఉపయోగపడును. కొంతవరకు కలుపు కూడా నివారించబడుతుంది.

అంతరపంటలు: ఆయిల్‌పామ్ వేసవికాలంలో అంతర పంటగా, కీర, కర్బూజ మరియు కూరగాయలలో గోరుచిక్కుడు, బెండకాయ సాగు చేయవచ్చు. జనుము మరియు జీలుగ చల్లుకొని పశువులకు మేతగా వాడచ్చు లేదా భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది.

సాగు నీటి యాజమాన్యం: మొక్కలు, చెట్లు నీటి ఎద్దడికిలోనై వడదెబ్బకి గురికాకుండా చూసుకోవాలి. నీటి కొరత, ఆకుల ఉత్పత్తి తగ్గిపోవుటకు పెరుగుదల సన్నగిల్లుటకు, తదుపరి కాలంలో మగ గెలలు ఎక్కువగా రావటానికి తద్వారా దిగుబడి తగ్గిపోవటానికి కారణం అవుతుంది. కావున కాలాన్ని బట్టి పాదులను సైజు పెంచుతూ తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. నీరు 0-3 సంవత్సరాలు గల మొక్క వేసవిలో ప్రతి రోజు ప్రతి మొక్కకు సుమారు 200-350 లీటర్ల నీరుని బట్టి అందించాలి. వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండి వడగాలులు ఉంటే 300-350 లీటర్ల నీరు 3 సంవత్సరాల పైబడిన మొక్కలకు ప్రతి రోజు 5-6.5 గంటలు డ్రిప్ నడపాలి. ఒక ఆయిల్‌పామ్ చెట్టుకి నాలుగు వైపులా డ్రిపర్స్ (8 ఎల్‌పిహెచ్) అమర్చుకోవాలి. పెద్ద చెట్లకు మైక్రోజెట్ స్ప్రింక్లర్స్ అమర్చుకోవాలి. కమోలిన్ 10% మొక్కలపై పిచికారి చేయడం వలన బాష్పీభవనం తగ్గించుకోవచ్చు.

బిందు సేద్య పద్ధతిలో ఎరువులను అందించడం: బిందుసేద్య పద్ధతిలో ఎరువులను అందించడాన్ని ఫెర్టిగేషన్ అంటారు. ఫెర్టిగేషన్ విధానంలో మొదటి సంవత్సరంలో ఆయిల్‌పామ్ తోటకు ప్రతి నెల ఎకరానికి 1.67 కిలోల యూరియా, 1.0 కిలోల డి.ఎ.పి మరియు 1.67 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున ఫెర్టిగేషన్ ద్వారా అందించాలి.

రెండవ సంవత్సరం: తోటలకు నెలకొకసారి మొక్కలకు ఫెర్టిగేషన్ విధానం ద్వారా అందించాలి. అనగా ప్రతి నెల ఎకరానికి 2.5 కిలోల యూరియా, 1.5 కిలోల డి.ఎ.పి మరియు 2.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున అందించాలి.

మూడవ సంవత్సరం: ప్రతి నెల ఎకరానికి 5 కిలోల యూరియా, 3.0 కిలోల డి.ఎ.పి మరియు 5.0 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున ఫెర్టిగేషన్ ద్వారా అందించాలి. మూడవ సంవత్సరంలో సిఫారసు చేసిన ఎరువులను అదే మోతాదులో నాల్గవ సంవత్సరంలో మరియు ఆపై సంవత్సరంలో నుండి కూడా కొనసాగించాలి.

	మొదటి సంవత్సరం	రెండవ సంవత్సరం	మూడవ సంవత్సరం
మెగ్నీషియం	125 గ్రా. / మొక్కకి	250 గ్రా./మొక్కకి	500 గ్రా./మొక్కకి
బోరాన్	50 గ్రా./మొక్కకి	100 గ్రా./మొక్కకి	150 గ్రా./మొక్కకి

హెచ్చరిక: మెగ్నీషియం & బోరాన్‌లను పై ఇచ్చిన ఎరువులతో కలుపుకోకుండా విడిగా ఒక వారం తర్వాత డ్రిప్ ద్వారా అందించాలి.

రైతులు వేసవిలో తోటల్లో ఆకుల క్రింది భాగాన్ని జాగ్రత్తగా గమనించుకోవాలి. రుగోజ్ వైట్‌ఫ్లైను జాగ్రత్తగా గమనించిన వెంటనే అజాడిరక్టిన్ 10,000 పిపిఎమ్ 3 మి.లీ. లీటరు నీటిలో కలిపి 10-15 రోజులకు ఒకసారి సబ్బు ద్రావంతో కలిపి పిచికారి చేసుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9912604549**

టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

క్రమ సంఖ్య	తేది	అంశము	సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్
II. టి-శాట్ (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 4.00-5.00			
1.	7.4.2025	వివిధ పంటల్లో కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు	**శ్రీమతి ఎన్. స్వప్న,** ఎస్.యం.ఎస్. (క్రాప్ ప్రొడక్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, రుద్రూర్, 9948852565
2.	21.4.2025	యాసంగి పంటల్లో నిల్వ సమయంలో పాటించవలసిన యాజమాన్యం	**డా॥ కె. రవి కుమార్,** ఎస్.యం.ఎస్. (క్రాప్ ప్రొడక్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, వైరా, 9603096769
3	28.4.2025	రైతు సంఘాల అవశ్యకత మరియు ఏర్పాటు	**శ్రీ బి. రాజ మధుశేఖర్,** శాస్త్రవేత్త (అగ్రికల్చర్ ఎక్సటేన్షన్) ఏరువాక కేంద్రం, భువనగిరి, 9866103797
III. టి-శాట్ - (శనివారం): సాయంత్రం 4.00-5.00			
1.	19.4.2025	సమస్యాత్మక నేలలు - యాజమాన్యం	**డా॥ కె. రాజమణి,** శాస్త్రవేత్త (ఎస్.ఎస్.) ఎ.ఐ.సి.ఆర్.పి. అన్ మైక్రోన్యూట్రీన్స్, రాజేంద్రనగర్, 7095407584
2	26.4.2025	వేసవి కూరగాయల సాగు-సూచనలు	**డా॥ యం. వెంకటేశ్వర రెడ్డి,** అసోసియేట్ ప్రొఫెసర్ (హార్టికల్చర్) వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, 9491151524

సీతాఫలం ఆధారిత అగ్రోఫారెస్ట్రీ పద్ధతి

డా॥ ఎ.వి. రామాంజనేయులు, డా॥ టి. చైతన్య, డా॥ ఎ. కృష్ణ, డా॥ డి. రజిని, డా॥ ఆర్.వి.టి. బాలాజీ నాయక్, సి.హెచ్. రాహుల్, డా॥ సి.హెచ్. రామకృష్ణ మరియు డా॥ ఆర్.ఎం.వి. ప్రసాద్
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

సీతాఫలం అనేది డెక్కన్ ప్రాంతంలోని వర్షాభావ ఉష్ణమండలపు ప్రాంతాలలో పండే ముఖ్యమైన ఉద్యానవన పంట. భారతదేశంలో దీనిని 51,584 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తూ 4.6 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధిస్తున్నారు. అదేవిధంగా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, కర్నాటక, రాజస్థాన్, ఝార్ఖండ్ మరియు తమిళనాడు వంటి రాష్ట్రాలలో దీన్ని సాగు చేస్తున్నారు. అయితే మహారాష్ట్ర 1.39 లక్షల టన్నులతో ఉత్పత్తిలో తొలి స్థానంలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 9480 టన్నుల ఉత్పత్తితో 933 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతుంది. అయితే తెలంగాణ రాష్ట్రంలో, రంగారెడ్డి జిల్లా అత్యధికంగా 139 హెక్టార్ల విస్తీర్ణం మరియు 1722 టన్నుల ఉత్పత్తిని కలిగి ఉన్నది.

సీతాఫలం చెట్టుకు పుష్పించే దశలో వేడి వాతావరణం మరియు పండు తయారయ్యేటప్పుడు అధిక తేమ అవసరం. ఇది సహజంగా బెట్టను తట్టుకుంటుంది మరియు కొంతవరకు చలిని కూడా తట్టుకుంటుంది. ఇది కాల్షియం ఎక్కువగా ఉండే నేలల్లో కూడా బాగా పెరగగలదు.

సీతాఫలం పండ్లు సాధారణంగా రుచిగాను మరియు మంచి పోషక విలువలు కలిగి ఉంటాయి. అలాగే ఈ పండ్లలో 16.5% చక్కెర, 70.5% నీరు, 23.5% కార్బోహైడ్రేట్లు, 1.6% ప్రోటీన్లు, 0.4% కొవ్వు, 0.9% ఖనిజ పదార్థం, 1.0% ఐరన్, 0.2% కాల్షియం, 0.04% ఫాస్ఫరస్ మరియు 104 కిలో కేలరీలు /100 గ్రా. శక్తి ఉంటాయి. సీతాఫలం పండ్లలో పిహెచ్ 5.5 మరియు 0.5% టానిన్స్ ఉంటాయి. పండ్లలో తినదగిన గుజ్జు బరువు 28.37% మధ్య ఉండగా, గింజలు 23-40% ఉంటాయి. ఆకులు, ఎండిన పండ్లు, పైతోలు మరియు వేర్లు, వైద్య మరియు వ్యవసాయరంగాల్లో అనేక ఉపయోగాలు కలిగి ఉంటాయి. సీతాఫలం పండ్ల సాగులో పిండినల్లి తప్ప మిగతా పురుగుల మరియు వ్యాధుల బెడద తక్కువగా ఉంటుంది.

క్రింది కారణాల వలన తెలంగాణ రాష్ట్రంలో సీతాఫలం పండ్ల తోటల్లో అగ్రోఫారెస్ట్రీ విధానంలో అంతరపంటలు వేయుటకు మరియు అధిక లాభం సాధించుటకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

నాటే దూరం: సీతాఫలం పండ్లతోటల్లో వరుసల మధ్య ఎక్కువ దూరం అనగా 3-6 మీ. ఉండటం వలన మొదటి 3-4 సంవత్సరాలలో అగ్రి-హార్టికల్చర్ పద్ధతిలో స్థిరమైన లాభం కొరకు, వివిధ పంటలు (పప్పు జాతి, నూనెగింజలు, పసుపు, అల్లం మొదలైనవి) పండించవచ్చు. అయితే, 4-5 సంవత్సరాల అనంతరం గడ్డిజాతి పంటలు (హార్టీ-పాస్టోరల్ పద్ధతిలో) పెంచితే మంచి లాభదాయకంగా ఉంటుంది. ఇది పశువులు కలిగిన రైతులకు మరియు పరిమిత నీటి వనరులున్న ప్రాంతాలకు మంచి వరం. దీనివలన సంవత్సరం పొడవునా పచ్చిమేత లభిస్తుంది. పశుగ్రాసాల సాగు వలన నేల కోత నివారణ, మట్టి సంరక్షణ మరియు జీవవైవిధ్యం పెంపొందుతాయి.

శిఖర నిర్మాణం: సీతాఫలం చెట్లకు సాధారణంగా శిఖర భాగం తక్కువగా ఉంటుంది. శిఖర నిర్మాణం సక్రమంగా చేయటం ద్వారా సూర్యరశ్మి తగినంత భూమికి చేరటం వలన చెట్ల క్రింద ఇతర పంటలు బాగా పెరిగే అవకాశం ఉంటుంది.

వేరు వ్యవస్థ: సీతాఫలం చెట్లకు సాధారణంగా తల్లివేరు వ్యవస్థ ఉండి, ఇది చెట్టుకు స్థిరత్వాన్ని అందిస్తుంది మరియు లోపల మట్టి పొరల నుండి పోషకాలు మరియు నీరు తీసుకుంటుంది. దీని వల్ల అంతరపంటలతో పోషకాలు మరియు నీటి కొరకు పోటీ తగ్గుతుంది.

సంవత్సరం పొడవునా పంట ఉత్పత్తి: పుష్పించే దశ నుండి కోత వరకు సాధారణంగా 4-6 నెలల వ్యవధి ఉంటుంది, ఇది అంతర పంటలు పెరగడానికి అనువైనది, తద్వారా ఉత్పాదకత పెరుగుతుంది.

సీతాఫలం పండ్ల తోటల్లో పశుగ్రాస పంటలైన గినీగడ్డి, హెడ్జ్‌లూసర్న్, స్టైలో, లూసర్న్, బొబ్బెర, పెసర, పిల్లిపెసర మొదలైన వాటిని అంతరపంటలుగా లాభదాయకంగా సాగు చేయవచ్చు. ఈ హార్టీ-పాస్టోరల్ పద్ధతిలో సీతాఫలం చెట్ల నుండి పండ్ల ఉత్పత్తి ఎకరాకు 15-16 క్వింటాళ్ళు, 8-10 టన్నుల పచ్చి గడ్డి లేదా 2 టన్నుల ఎండు గడ్డి, మొత్తం పద్ధతి నుండి నికర లాభం రూ. 25,000-32000 ఉండగా ఖర్చు మరియు ఆదాయవ్యయ నిష్పత్తి 2.00 గా ఉండవచ్చు. ఆ పద్ధతిలో 60-70 గొర్రెలు లేదా మేకలు లేదా 3-4 ఆవులు/గేదెలు పెంచవచ్చు. అదనంగా, పాలు/మేకలు/గొర్రెలను అమ్మడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చు. అలాగే ఈ పద్ధతిలో లభించిన ఎరువును పంటలకు వేయటం వలన రసాయనిక ఎరువుల మోతాదు మరియు ఖర్చును తగ్గించవచ్చు. అయితే ఆ పద్ధతిలో సీతాఫలం పండ్లపై ఆశించే పిండినల్లి నివారణకు ముందుగా లీటరు నీటిలో 2 గ్రా. సర్ఫ్ పొడిని కలిపి పిచికారి చేయాలి. దీనితో పిండినల్లి పొర తొలిగి పోతుంది. మరుసటి రోజు 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 0.3 మి.లీ. స్పైనోశాడ్ పిచికారి చేసి నియంత్రించాలి. అలాగే మే నెలలో ఎండిన కొమ్మలను మరియు చెట్టుపై ఎండిన పండ్లను తీసివేయాలి. పాదులలో కార్బరిల్ పొడి మందును చల్లాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9441312264

31వ పేజీలోని పదవినోదం సమాధానాలు

	1 గ	డ్డి	దు	బ్బు	తె	గు	లు		2 ఎ	రు	వు
3 ఏ	డు								ర		
	వు						4 కం	చే	పం	ట	
	తే								ట		
	ది	5 మి	ని	ద్దె	ప 6					7 బు	
		డ్జ్							8 గం	ధ	కం
										వా	
		9 ట్రై	కో	డె	ర్మా					రం	
		కో									
10 జై	గో	గ్రా	మ	బై	కొ	ల	రే	ట			11 కే
		మ									శ్రీ
									12 నే	ల	లు

ఉద్యానవన పంటలలో ఎరల (ట్రాప్స్) యొక్క ప్రాముఖ్యత

లోక మౌనిక, డా॥ వి. రమణ, డా॥ సిలారు రఘువీర్ మరియు డా॥ గుది ఇంద్రజ

ఐ.ఏ.ఆర్.ఐ. – సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్, హైదరాబాద్

మన ప్రపంచ జనాభా నానాటికి పెరుగుతున్నది. అయితే దానికి అనుగుణంగా ఆహారపంటల దిగుబడి మాత్రం పెరగడం లేదు. ఆహార కొరతను తగ్గించడానికి శాస్త్రవేత్తలు అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ వంగడాలను సాగులోకి తీసుకొచ్చారు. అయితే వాటి సాగుకు రైతులు అధిక మోతాదులో ఎరువులను వాడడం వల్ల పంటలను ఆశించే చీడ పురుగుల సంఖ్య పెరుగుతూ ఉంది. రైతులు వాటిని నియంత్రించడానికి వివిధ రకాల పురుగు మందులను అవగాహన లోపంతో విచక్షణ రహితంగా వినియోగిస్తున్నారు. దీనివల్ల కొన్ని చీడపురుగులు క్రిమి సంహారక మందులకు తట్టుకునే శక్తిని సంతరించుకుంటున్నాయి. అంతేకాకుండా ఈ పురుగు మందుల ప్రభావం, పంట ఉత్పత్తుల నాణ్యతపైన మరియు పర్యావరణం పైనా అధికంగా పడుతుంది.

పురుగు మందులను వాడకుండా చీడ పురుగులను నియంత్రించటానికి ఎరలు (ట్రాప్స్) ఎంతగానో ఉపయోగ పడతాయి. సమగ్ర సస్యరక్షణలో భాగంగా వివిధ రకాల ఎరలను వినియోగించడం ద్వారా పురుగుల వల్ల, పురుగు మందుల వల్ల కలిగే నష్టాలను తగ్గించవచ్చును. ఎరలు సాధారణంగా కీటకాల జనాభాను పర్యవేక్షించడానికి ఉపయోగిస్తారు, అయితే కొన్ని ఎరలను కీటకాలను నియంత్రించడానికి కూడా ఉపయోగించవచ్చును. ఎరల సామర్థ్యం పాక్షికంగా కీటకాల కదలికపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల తల్లి కీటకాలను పట్టుకోవడంలో ఎరలు సాధారణంగా మరింత ప్రభావవంతంగా ఉంటాయి.

కీటకాలను పట్టుకోవడానికి తరచుగా ఉపయోగించే కొన్ని రకాల ఎరలు:

1. జిగురు అట్టలు
2. దీపపు ఎరలు
3. లింగాకర్షణ బుట్టలు (ఫెరోమోన్ ట్రాప్స్)
4. ఎర పంటలు

జిగురు అట్టలు : సాధారణంగా కీటకాలు కొన్ని రకాల రంగులకు ఆకర్షితం అవుతాయి. రైతులు ఈ విషయాన్నీ గమనించి, ఆ రంగులలో జిగురు అట్టలు తయారు చేసి వినియోగించడం ద్వారా పంట పొలాల్లో కీటకాల యొక్క బెడద మరియు అవి వ్యాప్తి చేసే వైరస్ తెగులని తగ్గించవచ్చును. అందులో పసుపు, నీలం మరియు తెలుపు రంగులు ముఖ్యమైనవి.

పసుపు రంగు జిగురు అట్టలు: ముఖ్యంగా పేనుబంక, తెల్లదోమ, పచ్చదోమ మరియు ఆకు తొలుచు పురుగులను ఆకర్షించడానికి దోహదపడతాయి. వీటిని కూరగాయలు, పూలు మరియు పండ్ల తోటలలో పైన పేర్కొన్న చీడలు ఆశించినప్పుడు వాడతారు. ఎకరానికి సుమారు 15-20 జిగురు అట్టలను అమర్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

నీలం రంగు జిగురు అట్టలు: ముఖ్యంగా తామర పురుగుల బెడదను తగ్గించడానికి వినియోగిస్తారు. వీటిని ఎక్కువగా మిరప, ఉల్లి మరియు ద్రాక్ష పంటలలో వాడతారు. ఎకరానికి సుమారు 15-20 జిగురు అట్టలను అమర్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

తెలుపు రంగు జిగురు అట్టలు: ఫ్లవర్ త్రిప్స్ (బ్లాక్ త్రిప్స్) – త్రిప్స్ పార్విస్పైనస్ యాజమాన్యానికి తెలుపు జిగురు అట్టలు ప్రత్యేకంగా సిఫార్సు చేయబడి తెలుపు రంగు పశ్చిమ పూల త్రిప్స్ (తామర పురుగు), ఫ్లీ బీటిల్స్ మరియు బగ్లను ఆకర్షిస్తుంది. మిరప, క్యాప్సికం పంటలలో ఎకరానికి 15-20 జిగురు అట్టలను అమర్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

దీపపు ఎరలు: రాత్రి-ఎగిరే కీటకాలను ఆకర్షించి నాశనం చెయ్యడానికి దీపపు ఎరలు ఉపయోగపడతాయి. సాధారణ నూనె దీపాల నుండి వివిధ రకాల విద్యుత్ బల్బుల (సోలార్ దీపాలు) వరకు వివిధ కాంతి వనరులను ఉపయోగించవచ్చు. కొన్ని రకాల తల్లి పురుగులను పర్యవేక్షించడానికి ఇవి ప్రత్యేకంగా ఉపయోగపడతాయి.

ఈ మధ్యకాలంలో సోలార్ దీపపు ఎరలు (లైట్ ట్రాపులు) అందుబాటులోకి రావడం వలన విద్యుత్ ఆదా చేయడమే కాకుండా తక్కువ రిస్క్‌తో సులువుగా వీటిని ఉపయోగించచ్చు.

ఉపయోగించే విధానం: పొలానికి సమీపంలో లేదా లోపల సాయంత్రం 6:00 గంటల సమయంలో సోలార్ దీపపు ఎరను అమర్చాలి. దీనికోసం ముందుగా నాలుగు స్తంభాలను నేలపై గట్టిగా నాటాలి. ఆ తర్వాత నేల నుండి ఐదు మీటర్ల ఎత్తులో ఒక ఫ్రేమ్‌పై దీపం లేదా బల్బును అమర్చాలి. కాంతి కీటకాలను ఆకర్షిస్తున్నప్పుడు, వాటిని చంపడానికి లేదా పట్టుకోవడానికి లైట్ కింద ఒక వెడల్పాటి బేసిన్లో సబ్బు నీరు లేదా జనపనార సంచిని ఉంచాలి. కాంతి చుట్టూ ప్రదక్షిణ చేసే తల్లి పురుగులు నీటిలో పడిపోతాయి. అలా చిక్కుకున్న కీటకాలను ప్రతిరోజూ సేకరించి పారవేయాలి. ఎలక్ట్రిక్ బల్బును ఉపయోగిస్తున్నప్పుడు, విద్యుదాఘాతాన్ని నివారించడానికి బల్బ్ మరియు కరెంటు తీగ నీటిని తాకకుండా జాగ్రత్తపడాలి. ఎకరానికి రెండు దీపపు ఎరలు అమర్చుకోవాలి.

వీటిని ముఖ్యంగా పండ్ల తోటల్లో, రసం పీల్చే తల్లి పురుగులు, టమోటాలో సూది పురుగు, కత్తెర పురుగు, వేరు పురుగు, పొగాకు లద్దె పురుగు, శనగ పచ్చ పురుగు, కాయతొలుచు పురుగు, కాండం తొలిచే పురుగు, నల్లి, ఎర్ర జుత్తు గొంగళి పురుగు, ఈగలు, పచ్చ దోమ, సుడి దోమలను నివారించడానికి ఉపయోగిస్తారు.

లింగాకర్షణ బుట్టలు (ఫెరోమోన్ ట్రాప్స్): ఫెరోమోన్ అనేది కీటకాలు మరొక సహచరుడితో సంభాషించడానికి విడుదల చేసే రసాయనాలు. కీటకాలు సహచరులను ఆకర్షించడానికి, ఇతర కీటకాల గురించి హెచ్చరించడానికి లేదా ఆహారాన్ని కనుగొనడానికి ఈ రసాయన సంకేతాలను పంపుతాయి. సాంస్కృతిక మరియు జీవ పద్ధతిలో పురుగుల పర్యవేక్షణ మరియు నివారణకు లింగాకర్షణ బుట్టలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఈ లింగాకర్షణ బుట్టలు సమీకృత చీడపీడల నిర్వహణ మరియు స్థిరమైన వ్యవసాయంలో చేర్చడానికి చాలా మంచి సాధనాలు. అయితే వ్యవసాయంలో లక్ష్యంగా పెట్టుకున్న చీడపీడల పర్యవేక్షణ మరియు నియంత్రణకు ఎరతో పాటు నిర్దిష్ట లింగాకర్షక ఎరలను ఉపయోగించడం చాలా ముఖ్యం.

వివిధ రకాల లింగాకర్షణ ఎరలు:

డెల్టా ఎరలు: ఈ ఎరలు కీటకాలను ఆకర్షించడానికి పసుపు రంగు ప్లాస్టిక్ లేదా కాగితం షీట్‌తో తయారు చేయబడును. ఆ షీట్లను డెల్టా ఆకారంలో మడిచి, మధ్యలో ఎర ఉంచబడుతుంది. ఇది సమీకరించడం మరియు ఉపయోగించడం సులభం. వీటిని ముఖ్యంగా క్యాబేజి రెక్కల పురుగు మరియు టమోటాలో సూది పురుగు నివారించడానికి ఎకరానికి 6-8 వరకు అమర్చుకోవాలి.

ఫన్నెల్ (గరాటు) ఎరలు: గరాటు ఎర సాధారణంగా ఎర మరియు కంటైనర్‌ను కలిగి ఉండును. ఇక్కడ గరాటు మధ్యలో దిగువ నుండి ఎరను వ్రేలాడదీసి, క్రింద ఆకర్షితమయిన పురుగుల సేకరించడానికి పురుగు మందు చిన్న కంటైనర్‌ను ఉంచుతారు. కీటకాలు ఆ ఎరకు ఆకర్షితమయి ఆ కంటైనర్ లోపల ఉన్న పురుగు మందు ప్రభావానికి నాశనం అవుతాయి. దీనిని క్యాబేజీ కాయతొలుచు పురుగు, బెండ మరియు టమోటాను ఆశించు మొవ్వు మరియు కాయ తొలిచే పురుగు, మిరప మరియు చామంతిని ఆశించే పొగాకు గొంగళి పురుగు మరియు పసుపును ఆశించు కాండం తొలుచు పురుగులను నివారించడానికి ఎకరానికి ఆరు ఎరలను అమర్చుకోవాలి. ఈ ఎరలు ఒకసారి అమర్చితే సంవత్సరం పాటు పనిచేస్తాయి.

బాటిల్ ఎరలు: బాటిల్ ఎరలో మగ ఈగలను ఆకర్షించడానికి ఎర ఉంటుంది. ఆ ఎరను బాటిల్ యొక్క మూత మధ్యలో వ్రేలాడదీసి ఈగలు లోపలికి ప్రవేశించి చిక్కుకుపోయేలా చేయడానికి బాటిల్పై రంధ్రాలు చేయబడును. బాటిల్ యొక్క మూతను పసుపు రంగులో ఎంచుకోవడం ద్వారా కీటకాలను ఆకర్షించడానికి సహాయపడుతుంది. ఈ ఎరను ముఖ్యంగా దోసకాయ, మామిడి, గుమ్మడికాయలు, పుచ్చకాయ, జామ, సపోటా, చీని, అరటి, బొప్పాయి మరియు పొట్లకాయను ఆశించు పండు ఈగలను నివారించాడనికి ఉపయోగపడుతుంది, ఎకరాకు సుమారు 8-10 వరకు అమర్చుకోవాలి.

వాటర్ పాన్ ఎరలు: కంటైనర్లో ఫెరోమోన్ను చొప్పించి, ఎర (ట్రాప్) యొక్క ఎగువ మధ్య భాగంలో దాన్ని అమర్చి, ఎర అంచు వరకు నీటితో నింపాలి. కీటకాలు ఎరకు ఆకర్షితం అయ్యి నీటిలో వచ్చి పడుతాయి తద్వారా తల్లి పురుగుల ఉధృతిని తగ్గించొచ్చు. దీనిని టమాట, బంగాళదుంప, వంకాయ (వంకాయ) మరియు క్యాప్సికంను ఆశించు టమోటాలో సూది పురుగును నివారించడానికి ఉపయోగపడుతుంది, ఎకరాకు 8-10 వరకు వాటర్‌పాన్ అమర్చుకోవాలి.

బకెట్ ఎరలు: బకెట్ ఎరలు కొండి ఉండే మూతని కలిగి ఉంటాయి. ఆ కొండి ఎరను(ల్యూర్) అమర్చడానికి వీలుగా ఉంటుంది. ఆ బకెట్ ఎర సమూహాన్ని వైర్ హ్యాంగర్ ద్వారా చెట్టు చుట్టూ నేల ఉపరితలం నుండి ఐదు అడుగుల ఎత్తులో

వేలాడదీస్తారు. నిర్దేశించిన కీటకం ఎరకు ఆకర్షితులై, గరాటు గుండా బకెట్లోకి పడిపోతుంది. అక్కడ ఒక క్రిమిసంహారిణితో నింపిన నీరు కీటకాన్ని తప్పించుకోకుండా చేస్తుంది మరియు నష్టాన్ని తగ్గిస్తుంది. దీనిని ముఖ్యంగా జామ, కొబ్బరి, బంగాళదుంప, తమలపాకులు మరియు కూరగాయలను ఆశించు వేరు పురుగు, కొమ్ము పురుగు మరియు ముక్కు పురుగులను నివారించడానికి ఉపయోగపడుతుంది, ఎకరాకు 4-5 వరకు అమర్చుకోవచ్చును.

4. ఎరపంటలు/ రక్షక పంటలు: సమగ్ర సస్యరక్షణలో భాగంగా ఎరపంటలు/ రక్షక పంటలు పెంచడం ద్వారా పురుగుల వల్ల, పురుగు మందుల వల్ల కలిగే నష్టాలను తగ్గించవచ్చు. కొన్ని రకాల పురుగులు కొన్ని పంటలను మాత్రమే ఎక్కువగా ఆశిస్తాయి. కాబట్టి ఆ పంటలను పురుగులను ఆకర్షించడానికి ఎరగా వాడి పురుగుల బారినుంచి ప్రధాన పంటను కాపాడుకోవచ్చును. ఎర పంటను పురుగు ఉనికికి తగ్గట్టుగా ఎంపిక చేసుకోవాలి. తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి అనువుగా చీడపురుగులను ఆకర్షించేదిగా మరియు ముఖ్యపంటను అన్ని దశల్లో కాపాడే విధంగా ఎరపంట ఉండాలి. ఈ తరహాలో పురుగులను ఆకర్షించే పంటలను సాగు చేసి సకాలంలో నివారణ చర్యలు చేపట్టడం ద్వారా రైతులు వేసిన ప్రధాన పంటకు పురుగుల వల్ల నష్టం కలగకుండా కాపాడుకోవచ్చు.

ప్రధాన పంటలో నాటే వివిధ రకాల ఎర పంటలు, వాటిని నాటే విధానం మరియు వాటికీ ఆకర్షితమయ్యే కీటకాలు:

క్ర.సం.	ఎర పంట	ప్రధాన పంట
1.	తులసి మరియు బంతి	ఈ ఎర పంటను ప్రధాన పంట అయిన వెల్లుల్లిలో సరిహద్దు పంటగ నాటుకోవడం ద్వారా తామర పురుగును అదుపులో ఉంచవచ్చు. ఈ ఎర పంటను ప్రధాన పంటలు అయిన వంగ, టమోటా, బంగాళాదుంప, మిరప, క్యాబేజి, లెగ్యూమ్స్ మరియు తీగజాతి కూరగాయలలో వరుస అంతర పంటగా నాటుకోవడం ద్వారా నులి పురుగులను అదుపులో ఉంచవచ్చు.
2.	బంతి	ప్రతి 16 వరుసల టమాట లేదా మిరపకు ఒక వరుస బంతిని ఎరపంటగా నాటుకోవడం ద్వారా శనగపచ్చ పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.
3.	ఆముదం	పత్తి, మిరప పంటలలో ఆముదం సరిహద్దు పంటగా నాటుకొని తొలిదశలోనే జల్లెడాకుపై గుర్తించి నాశనం చేయడం ద్వారా పొగాకు లద్దె పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.
4.	చైనీస్ క్యాబేజీ, ఆవాలు మరియు ముల్లంగి	ప్రతి 25 వరుసల క్యాబేజీకి రెండు వరుసల ఆవాలను ఎరపంటగా నాటుకోవడం ద్వారా క్యాబేజీ గూడు పురుగు మరియు పెనుబంక ఉధృతంగా ఆశించకుండా జాగ్రత్త పడవచ్చు. క్యాబేజీలో చైనీస్ క్యాబేజీ, ఆవాలు మరియు ముల్లంగిని అంతర పంటగా నాటుకోవడం ద్వారా క్యాబేజీ కాయ తొలుచు పురుగును తగ్గించవచ్చు.
5.	కాలర్డ్స్ ఆకు కూర	క్యాబేజీలో కాలర్డ్స్ ఆకు కూరను సరిహద్దు పంటగా నాటుకోవడం ద్వారా క్యాబేజీ రెక్కల పురుగును తగ్గించవచ్చు.
6.	టమాట	క్యాబేజీలో టమోటాను అంతర పంటగా అనగా సరిహద్దుల వద్ద టమాటాను 2 వారాల ముందు నాటుకోవడం ద్వారా క్యాబేజీ రెక్కల పురుగును నియంత్రించవచ్చు.

క్ర.సం.	ఎర పంట	ప్రధాన పంట
7.	మెంతులు మరియు వాము	ఈ ఎర పంటను ప్రధాన పంటలు అయిన టమాటాలో అంతర పంటగా నాటుకోవడం ద్వారా టమాటాలో సూది పురుగును అదుపుచేయవచ్చు.
8.	ఉల్లిపాయ మరియు వెల్లుల్లి	ఈ ఎర పంటను ప్రధాన పంటలు అయిన క్యారెట్‌లో సరిహద్దు పంటగా నాటుకోవడం ద్వారా క్యారెట్‌లో వేరు ఈగను అదుపులో ఉంచవచ్చు.
9.	వంకాయ	సోంపులో వంకాయను ఎర పంటగా నాటుకోవడం ద్వారా కాండం మరియు కాయ తొలుచు పురుగును నివారించవచ్చును.
10.	కాకరకాయ	మొక్కజొన్నలో కాకరకాయను ఎర పంటగా నాటుకోవడం ద్వారా పండు ఈగను అదపులో ఉంచవచ్చు.
11.	కత్తిరించిన అరటి కాండం	కత్తిరించిన అరటి కాండంను తోటలో చెట్టు చుట్టూ ఉంచడం ద్వారా అరటి దుంప తొలుచు పురుగు తల్లి పురుగులను పట్టుకోవచ్చును తద్వారా ఉనికిని తగ్గించవచ్చు.
12.	మొక్కజొన్న/జొన్న	బెండలో, మొక్కజొన్న/జొన్నలను సరిహద్దు పంటగా నాటుకోవడం ద్వారా చిగురు మరియు పండు తొలుచు పురుగు నివారించవచ్చును.
13.	టమాట	చీని, దానిమ్మలో టమాటను ఎర పంటగా నాటుకోవడం ద్వారా పండ్ల రసం పీల్చు తల్లి పురుగులను నివారించవచ్చును.

ఈ విధంగా పంటల యాజమాన్యంలో ఎరల వాడకం ద్వారా చాల వరకు ముఖ్యమైన చీడ పీడలను నివారించడమే కాకుండా పర్యావరణాన్ని సంరక్షించి, పంటలపై అధిక పెట్టుబడిని కూడా తగ్గించవచ్చు. అంతేకాకుండా లాభదాయకమైన దిగుబడిని పొందవచ్చును.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9908869115

టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

క్రమ సంఖ్య	తేది	అంశము	సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్
		I. డిడి – యాదగిరి (రైతు నేస్తం): సాయంత్రం 6.00-7.00	
1.	07.04.2025	పసుపు కోతానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు విత్తన పసుపు నిల్వలో పాటించవలసిన సూచనలు	**డా॥ బి. వెంకట రాజ్‌కుమార్,** ఎస్.యం.ఎస్. (హార్టికల్చర్) కృషి విజ్ఞాన కేంద్రం, రుద్రూర్, 9866240346
2.	11.04.2025	వివిధ పంటలలో విలువ ఆధారిత ఉత్పత్తులు – సూచనలు	**డా॥ కె. అపర్ణ,** ప్రధాన శాస్త్రవేత్త (ఎఫ్ & ఎన్) హెడ్ యం.ఎఫ్.పి.ఐ. – క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్, రాజేంద్రనగర్, 9849019823
3.	21.04.2025	పంట కోసిన తరువాత మిగిలిన ఉప ఉత్పత్తుల వినియోగంలో మెళకువలు	**శ్రీ జె. విజయ్,** శాస్త్రవేత్త (క్రాప్ ప్రొడక్షన్) ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, 9381515588
4.	28.04.2025	వ్యవసాయంలో యాంత్రీకరణ	**డా॥ సిహెచ్. శ్రవణ్ కుమార్,** శాస్త్రవేత్త (అగ్రికల్చర్ ఇంజనీరింగ్) ఎ.ఐ.సి.ఆర్.పి. అన్ ఎఫ్.ఐ.యం., రాజేంద్రనగర్, 9701578047
5.	30.04.2025	పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత – వినియోగం	**డా॥ టి. భరత్,** శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, 9700549754

వేసవిలో మోతి బాజ్ర సాగు పాడి రైతులకు లాభదాయకం

వై. సుల్తాన్, ఆర్. రఘువరన్ సింగ్, కె. రామకృష్ణ, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, డా॥ ఓ. శైల, డా॥ ఆది శంకర్, డా॥ బి. రాజశేఖర్, ఇ. జోత్స్న, యం. రాజేష్ కుమార్, బి. హరీష్ మరియు వి. పుష్పలత

కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, నాగర్‌కర్నూల్

- భారతదేశంలో సుమారు 70% ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారు. అయితే రైతు సోదరులు ఒక్క ఆహార పంటల సాగు పైనే ఆధారపడకుండా, పాడి పశువుల పోషణ, పాల ఉత్పత్తిని చేపట్టడానికి ఆసక్తి కనబరుస్తారు. పశుపోషణలో దాదాపు 60% నుండి 70% ఖర్చు మేత పైనే ఉంటుంది. తగినంత మేత వచ్చినప్పుడు ఆశించిన పాల ఉత్పత్తి లభిస్తుంది. మంచి పశుగ్రాసాలను అధికోత్పత్తిలో పండించాలంటే వాటి ముఖ్యమైన రకాలతో పాటుగా పండించే పరిస్థితులు, యాజమాన్య పద్ధతులు తెలుసుకోవాలి. నేలకు ఆయా వాతావరణ పరిస్థితులకు అనువైన పంటలను సాగు చేసుకోవాలి.
- మోతి బాజ్ర అను సజ్జ రకం పశుగ్రాసంగా తక్కువ పెట్టుబడి తక్కువ నీటి వసతితో సాగు చేయబడుతున్నటువంటి పంట. ఇది వేసవికి చాలా అనువైనది. ఫిబ్రవరి నుండి మార్చి నెల వరకు విత్తుకోవచ్చు. మురుగు నీటి పారుదల సౌకర్యంగల అన్ని రకాల సారవంతమైన నేలలు అనుకూలంగా ఉంటాయి.
- ఈ పశుగ్రాసపు సజ్జ 5-6 పిలకలు కలిగి ఉంటుంది. దీనిలో ముడి మాంసకృత్తులు 9-10% వరకు ఉంటాయి. మిగతా ధాన్యపుజాతి, గడ్డిజాతి పశుగ్రాస పంటలతో పోల్చినప్పుడు మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. జొన్న పంటలో లాగ మోతి బాజ్రలో ఎటువంటి విషపదార్థము ఉండదు కనుక ఏ దశలోనైన కోసి మేపుటకు అనుకూలమైనది.

మోతి బాజ్రలో ఉన్న పోషక పదార్థములు

ముడి మాంసకృత్తులు	9.6%
ఎండు మాంసకృత్తులు	22%
పీచుపదార్థం	34.4%
జీర్ణమయ్యే ఎండు పదార్థం	52.6%

యాజమాన్యం:

- నేలను బాగా లోతుగా 2-3 సార్లు నాగలితో దున్ని మెత్తని దుక్కి చేసుకోవాలి. నీటి లభ్యతను బట్టి నేల వాలును బట్టి నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఎకరానికి 40 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులను వేసుకోవాలి. నత్రజని ఎరువును రెండు దఫాలుగా విత్తే సమయాన మరియు విత్తిన 30-35 రోజులకు పైపాటుగా వేసుకోవాలి.

విత్తనములు మరియు విత్తుట:

- ఎకరానికి 4-4.5 కిలోల విత్తనం సరిపోతుంది. 30 సెం.మీ. ఎడంలో చేసిన సాళ్ళలో వరుసగా 2 సెం.మీ. లోతులో విత్తుకోవాలి. విత్తిన 24 గంటల ముందు కార్బండాజిమ్ 1 గ్రా. విత్తనానికి లేదా మ్యాంకోజెబ్ 3 గ్రా. విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి.

నీటి పారుదల:

- విత్తిన వెంటనే నీటితడి ఇవ్వాలి. విత్తిన మూడవ రోజున మళ్ళీ తేలికపాటి తడి ఇవ్వాలి. తరువాత తడులు 10-15 రోజుల వ్యవధిలో లేదా అవసరాన్ని బట్టి తడి ఇవ్వాలి.

కలుపు నివారణ:

- విత్తిన 48 గంటలలోపు 400 గ్రా. అట్రజిన్ అనే కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణంలో తేమ ఉన్నప్పుడు పిచికారి చేయాలి.
- సాధారణంగా సస్యరక్షణ అవసరం ఉండదు. రోగాల నివారణకు మ్యాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

పంటకోత:

- దీనిలో జొన్నలో లాగా హెచ్.సి.ఎన్ అనే పోషక వ్యతిరేక పదార్థము ఉండదు, కనుక ఏ దశలోనైనా కోసుకొని పశువులకు మేపవచ్చు. మోతి బాజ్రను ఒకే కోతగా లేదా పలు కోతలుగా (3-4 కోతలు) కోయవచ్చును. ఒక కోత మాత్రమే తీసుకోవాలంటే 50% పూతదశలో కోసుకోవాలి. పలుకోతలుగా సాగు చేస్తే మొదటికోతను 50 రోజులకు, తదుపరి కోతలను 30 రోజుల వ్యవధిలో తీసుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.8499969542

లాభసాటి పాడి కోసం, దూడల సంరక్షణకు పాటించవలసిన పది సూత్రాలు

డా॥ జె. శశాంక్, డా॥ ఎమ్. ఫిబి రాణి, డా॥ జె. జ్యోతి మరియు డా॥ వి.వి.వి. అమృత్ కుమార్
పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, మామునూరు, వరంగల్

నేటి పెయ్య దూడలే రేపటి పాడి పశువులు, చిన్న వయస్సులో బాగా ఎదిగితే పెద్దదైనప్పుడు ఆరోగ్యంగా ఉండి, సంవత్సరానికి ఒకసారి ఈని, 10 మాసాలు పాలు ఇస్తుంది. దూడల పోషణ అశ్రద్ధ చేసినట్లైతే, బలహీనంగా పెరిగి, శరీర దారుఢ్యము కోల్పోయి చివరకు చనిపోయే ప్రమాదం ఉంటుంది.

సమర్ధవంతమైన దూడల పోషణకు ఈ కింది పది సూత్రాలు తప్పనిసరిగా పాటించాలి.

1. సాధారణంగా, పుట్టిన దూడ అరగంట లోపల లేచి నిలబడి తల్లిపాలు తాగుతుంది. దూడ బలహీనంగా ఉండి నిలబడక పోతే దాన్ని నిలబడేట్లు చేసి మూడు రోజుల వరకు తగినన్ని జున్నుపాలు తాగించాలి. జున్నుపాలలో తేలికగా జీర్ణ మయ్యే మాంసకృత్తులు, రోగనిరోధక శక్తిని పెంపొందించే విటమిన్ ఎ, డి మరియు ఆవశ్యకతమైన దాతువులు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా దూడకు వ్యాధి నిరోధక శక్తి చేకూరుతుంది.
2. మొదటి మాసంలో దూడ బరువులో 10వ వంతు పాలు ఇవ్వాలి. రెండవ మాసంలో 15వ వంతు మరియు మూడవ మాసంలో 20వ వంతు పాలు తాగించాలి. ఉదాహరణకు దూడ బరువు మొదటి మాసంలో 25 కిలో గ్రాములు ఉన్నట్లయితే 2.5 లీటర్లు, అదే రెండవ మాసంలో ఐతే 3.75 లీటర్లు, మూడవ మాసంలో అయితే 5 లీటర్ల పాలు రోజు తాగించాలి. దూడలు పైన చెప్పిన మోతాదుకి మించి మరి ఎక్కువగా పాలు తాగితే అజీర్తి చేస్తుంది. కాబట్టి వాటిని పూర్తిగా పాలకి వదిలివేయకుండా జాగ్రత్త వహించాలి.
3. పాలతో పాటు రెండవ నెల నుండి తేలికగా జీర్ణమయ్యే దాణా అలవాటు చెయ్యాలి. అలాగే తేలికగా జీర్ణమయ్యే గడ్డి పరకలు మెల్లగా అలవాటు చెయ్యాలి (అవిశ ఆకులు, సుబాబుల్ ఆకులు మొదలగునవి). దాని వలన పొట్టలోని జీర్ణక్రియ మెరుగు పరిచే సూక్ష్మజీవులు పెరిగే అవకాశం వుంటుంది. తద్వారా దూడలు తిన్న దానిని ఎక్కువగా జీర్ణం చేసుకొని ఏపుగా పెరుగుతాయి.
4. మూడవ నెల నుండి అలసంద, గోరుచిక్కుడు, హెడ్జ్ లూసెర్న్, లూసెర్న్ వంటి కాయజాతి పచ్చి మేతలు మేపాలి.
5. దూడలకు రెండవ మాసంలో 150 గ్రాములు, మూడవ మాసంలో 300 గ్రాములు, నాల్గవ మాసంలో 500 గ్రాములు, 5-6 మాసాలలో 750 గ్రాములు, 7వ మాసం నుండి 1 కిలో దాణా ఇవ్వాలి.
6. దూడల పాకలు ఎత్తైన ప్రదేశంలో గాలి బాగా ప్రసరించేల వుండాలి. నేల వీలైనంత గట్టిగా ఉండి, బురద, రొచ్చు లేకుండా ఉండాలి. అలాగే ప్రతీ రోజు పాకను శుభ్రం చేయాలి.
7. తేమ ప్రదేశంలో నత్తలు, ఏలిక పాములు దూడలకు సంక్రమించే అవకాశం ఉంటుంది. అంతేకాక బొడ్డువాపు, తెల్లపారుడు, రక్త విరోచనాలు మొదలగు వ్యాధులు వచ్చి దూడల పెరుగుదల తగ్గుతుంది. చాలా శాతం దూడలు చనిపోయే అవకాశం ఉంటుంది. అందుకోసం పాక చుట్టుపక్కల మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
8. దూడలకు గోమార్లు, పిడుదుల వల్ల జ్వరం, రక్తహీనత వస్తుంది. వాటిని నిర్మూలించడానికి బ్యూటాక్స్ మందును నీళ్లలో కలిపి పిచికారి చెయ్యాలి.
9. చలికాలంలో, వర్షాకాలంలో చుట్టూ గోనెసంచులు కట్టి, నేల వెచ్చగా, మెత్తగా ఉండేటట్లు గడ్డి వేయాలి. దానివలన నెమ్ము వ్యాధి వచ్చే అవకాశం తగ్గుతుంది.
10. దూడలకు అంటువ్యాధులు రాకుండా, గాలికుంటు (4వ నెలలో), బ్రూసెల్లోసిస్ (4వ నెలలో), గొంతువాపు (5వ నెలలో), జబ్బవాపు (5వ నెలలో) తైలేరియాసిస్ (6వ నెలలో), టీకాలు, ఆయా ప్రదేశాలలో ప్రబలివున్న అంటు వ్యాధులను బట్టి తప్పక వేయించి, ప్రతి సంవత్సరం తప్పనిసరిగా టీకా కార్యక్రమం చేపట్టాలి.

కాబట్టి ఈవిధమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వలన దూడల ఆరోగ్యాలను కాపాడుకొని, పాడిలో కలిగే నష్టాలను తగ్గించుకొని, పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికంగా లాభాలను ఆర్జించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9866922336

టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

క్రమ సంఖ్య	తేది	అంశము	సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం మరియు రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం			
1	08.4.2025	భూసార పరీక్షల అవశ్యకత మరియు నమూనాల సేకరణ పద్ధతులు	**డా॥ యం. రాజేశ్వర్ నాయక్,** ప్రధాన శాస్త్రవేత్త (ఎస్.ఎస్.ఎ.సి.) ఎ.ఐ.సి.ఆర్.పి.అన్ ఫోరేజ్ క్రాప్స్, రాజేంద్రనగర్, 8309101334
		వేసవి పూల సాగులో సూచనలు	**డా॥ ఎస్. ప్రశాంత్ కుమార్,** శాస్త్రవేత్త (క్రాప్ ఫిజియాలజీ) పూల పరిశోధన స్థానం, శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, 9492650276
		ఎండాకాలంలో పాడి పశువుల యాజమాన్యం	**డా॥ యం. కిషన్ కుమార్,** విస్తరణ సంచాలకులు పి.వి.నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, రాజేంద్రనగర్, 9848066708
2	15.04.2025	చిరుధాన్యాల పంటలలో విలువల జోడింపు	**డా॥ బి. అనీల కుమారి,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఫుడ్ అండ్ న్యూట్రీషన్) చిరుధాన్యాల ప్రొసెసింగ్ మరియు ఇంక్యూబేషన్ సెంటర్, రాజేంద్రనగర్, 9948123355
		వేసవి కూరగాయల సాగు – సూచనలు	**డా॥ ఆర్. ప్రితమ్ గౌడ్,** సీనియర్ శాస్త్రవేత్త (అగ్రో) కూరగాయల పరిశోధన స్థానం, శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, 9440130030
		పాడి పశువులలో పొదుగు వాపు వ్యాధి	**డా॥ కె. పద్మజ,** ప్రొఫెసర్, డిపార్టుమెంట్ ఆఫ్ వెటర్నరీ మెడిసన్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, పి.వి.నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ రాజేంద్రనగర్, 9100411199
3	22.04.2025	విత్తన నాణ్యత మరియు మొలకశాతం నిర్ధారణ పరీక్షలు – అవశ్యకత	**డా॥ పి. సుజాత,** అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ (ఎ.డి.ఆర్.) పరిశోధన సంచాలకులు కార్యాలయం, రాజేంద్రనగర్, 7989007024
		నిమ్మ, బత్తాయిలో ప్రస్తుతం చేపట్టవలసిన యాజమాన్యం	**డా॥ సి.హెచ్. రాజా గౌడ్,** సీనియర్ శాస్త్రవేత్త ఉద్యాన పరిశోధన స్థానం, శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మల్లేపల్లి, 7396400740
		పశువుల పోషణ, దాణా మరియు పశుగ్రాసాల పెంపకం	**డా॥ జె. నరసింహా,** ప్రొఫెసర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనిమల్ న్యూటిషన్ పి.వి.నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, రాజేంద్రనగర్, 9440671108
4	29.04.2025	భూసారం పెంచడానికి పచ్చిరొట్ట ఎరువుల వాడకం	**డా॥ ఆర్. ఉమారెడ్డి,** సహా పరిశోధన సంచాలకులు(ఎ.డి.ఆర్.) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, 9989625223
		అయిల్‌ఫామ్ పంటలో అంతరపంటల సాగు	**డా॥ జి. విజయ్ కృష్ణ,** శాస్త్రవేత్త ఉద్యాన పరిశోధన స్థానం, అశ్వారావుపేట, 7995890625
		పాలు, పాల పదార్థాల తయారీ	**డా॥ యం. సాహిత్య రాణి,** అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, పి.వి.నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ రాజేంద్రనగర్, 8686385184

రైతన్నకో ప్రశ్న...

డా॥ ఆర్. సునీత దేవి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

1. ఈ క్రింద సూచించిన వాటిలో ఏది సరియైనది?

ఎ) పి.ఎఫ్.ఏ చట్టం ప్రకారం పండ్లు మాగబెట్టడానికి కాల్షియం వాడరాదు

బి) కాల్షియం కార్బైడ్ ద్వారా మాగబెట్టిన పండ్లు తినడం ఆరోగ్యానికి హానికరం

సి) ఎ & బి డి) ఏదీ కాదు

2. మొక్కజొన్న గింజలలో ఎంత శాతం తేమ ఉన్నప్పుడు కోత చేపట్టాలి?

ఎ) 20-25 బి) 25-30 సి) 30-35 డి) 35-40

3. పుచ్చ మరియు తర్బూజ పిందె దశలో ఈ పురుగులు కాయలపై గ్రుడ్లు పెట్టి, లార్వాలు, కాయలు తొలచి వంకర్లు తిరిగిపోవడం వలన కాయ నాణ్యతపై ప్రభావంకు కారణం?

ఎ) ఎర్రనల్లి బి) తామర పురుగులు

సి) పండు ఈగ డి) ఏవీ కావు

4. పాల పుట్టగొడుగులలో అధికంగా ఉండే విటమిన్లు?

ఎ) విటమిన్లు ఎ & ఇ బి) విటమిన్లు బి & సి

సి) విటమిన్లు ఎ & డి డి) పైవన్నీ

5. ఐసిఏఆర్ ఆధ్వర్యంలోని జాతీయ పప్పుదినుసుల పరిశోధన సంస్థ (ఐఐపిఆర్) ఎక్కడ ఉంది?

ఎ) హైదరాబాద్ బి) కాన్పూర్

సి) ఢిల్లీ డి) బెంగుళూరు

6. ధాన్యాన్ని నిల్వ చేసే గోదాములలో దాగి ఉన్న పురుగులు/కీటకాల నివారణకు ఈ క్రింద పేర్కొన్న ఏ మందును గది గోడలపైన పిచికారి చేయాలి?

ఎ) మలాథియాన్ బి) క్వినాల్‌ఫాస్

సి) క్లోరోపైరిఫాస్ డి) ఎసిఫేట్

7. వయ్యారిభామ కలుపును నివారించాలంటే ఏం చేయాలి?

ఎ) జైగోగ్రామా బైకొలరేటా పెంకు పురుగులను వదలటం

బి) బంతి పంటతో పంట మార్పిడి చేయడం

సి) పూతకు రాకముందే మొక్కలను పీకి నాశనం చేయుటం డి) పైవన్నీ

8. వ్యవసాయ, ఉద్యానవన రంగాల్లో "ప్లాస్టిక్ మల్చింగ్ ఉపయోగించడం వలన కలిగే లాభాలు?

ఎ) నీటి ఆదా బి) కలుపు నివారణ

సి) నేల ఉష్ణోగ్రత నియంత్రణ

డి) పైవన్నీ

9. "స్వర్ణవిప్లవం" కి సంబంధించినది?

ఎ) విలువైన ఖనిజాలు బి) పప్పులు

సి) జనపనార డి) హార్టికల్చర్ మరియు తేనె

10. మనదేశంలో వరి ఉత్పత్తిలో అగ్రగామి రాష్ట్రం ఏది?

ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ

సి) పంజాబ్ డి) హరియానా

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు

"భవిష్యత్తు బాగు కోసం వరి పరిశోధన" అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం

వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో మార్చి 17న 'భవిష్యత్తు బాగు కోసం వరి పరిశోధన" అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫిలిప్పైన్స్‌లోని అంతర్జాతీయ పరిశోధన సంస్థ (ఇరి) ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ అజయ్ కోహ్లి ప్రసంగిస్తూ రానున్న సంవత్సరాలలో వరి పరిశోధనల్లో గొప్ప విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే విధంగా నూతన వరి రకాలను అభివృద్ధి చేయడానికి పరిశోధనలు జరుగుతున్నాయని, ప్రస్తుతం వరిలో వాడుతున్న నత్రజనిని సగానికి సగం తగ్గించి దిగుబడులు ఏ మాత్రం తేడా రాకుండా పరిశోధనలు చేపట్టడం ద్వారా నూతన వరి రకాలు అందుబాటులోకి తెస్తే వరిలో యూరియా వినియోగం తగ్గడంతోపాటు భూమి నాణ్యత మెరుగుపడి, మానవుని ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. వరల్డ్ ఫుడ్ ప్రైజ్ అవార్డు గ్రహీత డా॥ సమరెండు మహంతి మాట్లాడుతూ ఆగ్నేయ ఆసియా దేశాల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో వరి రకాల సాగును ప్రోత్సహించాలని, తద్వారా రైతులకు ఆదాయంతో పాటు ఎగుమతులకు కూడా ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ సంస్థతో అవగాహన ఒప్పందం

విశ్వవిద్యాలయంలో ఇటీవలి కాలంలో నెలకొల్పిన మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి సాంకేతిక సహకారం అందించడం కోసం నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)తో మార్చి 6న అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నార్మ్ డైరెక్టర్ డా॥ ఆర్. సి. అగర్వాల్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ మరియు మానసిక వికాసంపై సిబ్బందికి నిర్వహించే సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి మరియు పరిపాలన తదితర శిక్షణా కార్యక్రమంలో విశ్వవిద్యాలయ మానవ అభివృద్ధి కేంద్రానికి తమ సంస్థ నుండి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

విశ్వవిద్యాలయంలో "ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ" కార్యక్రమం

విశ్వవిద్యాలయ పరిధిలోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ సభ్యులకు మార్చి 20-22 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ డా॥ కె. సురేష్ స్వాగతోపన్యాసంలో మాట్లాడుతూ ఫ్యాకల్టీ సభ్యులకు అధునాతన బోధనా పద్ధతులు, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సి.హెచ్.విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సమయపాలన, నిజాయితీలే వృత్తిపరంగా విజయాలకు దోహదం చేస్తాయని, అదేవిధంగా ఆర్థిక వనరుల యాజమాన్యం చాలా ముఖ్యమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు మరియు 40 మంది ఫ్యాకల్టీ పాల్గొన్నారు

విశ్వవిద్యాలయంలో వాటర్ షెడ్ ప్రాజెక్టుపై జాతీయ సదస్సు

విస్తరణ విద్యా సంస్థ, రాజేంద్రనగర్‌లో విశ్వవిద్యాలయం మరియు డా॥ యం. చెన్నారెడ్డి మెమెరియల్ ట్రస్ట్ సంయుక్తంగా మార్చి 22-23న జాతీయ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా॥ యం. చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి శ్రీ మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో నీటి భద్రతకు వాటర్ షెడ్ విధానం సక్రమ నిర్వహణే పరిష్కారమని తెలిపారు. వర్సిటీ పరిశోధన సంచాలకులు డా॥ ఎం. బలరాం మాట్లాడుతూ వాటర్ షెడ్ కార్యక్రమం అమలులో క్షేత్ర స్థాయి సవాళ్ళు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, రైతులను పూర్తిగా భాగస్వాములను చేసి వారికి నిరంతరం సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. వర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ డా॥ కె.వీ. రమణారావు మాట్లాడుతూ నీటి సమర్ధ వినియోగంలో వాటర్‌షెడ్‌లదే కీలక పాత్ర అని, ఈ పథకం వల్ల సహజవనరుల పరిరక్షణ సాధ్యం అవుతుందని అభిప్రాయ పడ్డారు. ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొ॥ కె. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ నీటి సవాళ్ళను ఎదుర్కోవడానికి సమిష్టిగా పరిష్కారాలు కనుగొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాలు, సంస్థల నుంచి వచ్చిన ప్రతినిధులు, గొట్టిగారిపల్లి గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

సహజ వ్యవసాయంపై రైతు సదస్సు

కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల్ ఆధ్వర్యంలో రైతు వేదిక కొత్తగూడలో మార్చి 15న రైతు సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహజ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, వివిధ సహజ వ్యవసాయ ఉత్పత్తుల తయారి, తెగుళ్ళు మరియు పురుగుల నియంత్రణకు అనుసరించాల్సిన సహజ వ్యవసాయ పద్ధతుల గురించి శాస్త్రవేత్తలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ మరియు ఉద్యాన శాఖ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

పి. సుధాకర్ మరియు మార్ఫ్స్ బాబు

నల్లరేగడి నేలల్లో శనగకు బదులుగా ధనియాలతో పంట మార్పిడి చేసి అధిక దిగుబడులు ఆర్జిస్తున్న రైతుల విజయగాథ

డా॥ సిహెచ్. పల్లవి మరియు జె. విజయ్
ఏరువాక కేంద్రం, తోర్నాల

మన దేశంలో అత్యధికంగా సాగు చేస్తున్న సుగంధ ద్రవ్యాల్లో ధనియాలు ఒకటి. ధనియాలను అందించే ధనియా మొక్కలు లేదా కొత్తిమీరతో భారతీయ వంటకాలకు విడదీయలేని అనుబంధం ఉంది. దాదాపు అన్ని రకాల కూరల్లో కొత్తిమీరను, ధనియాల పొడి, ధనియాలను ఉపయోగిస్తుంటారు. అందుకే మార్కెట్లో దీనికి అధిక డిమాండ్ ఉంటుంది. తక్కువ కాలంలో కోతకు రావడం, సాగుకు పెట్టుబడి సైతం తక్కువగానే అవుతుండడంతో రైతులు దీనిని పెద్ద మొత్తంలోనే సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.

సిద్దిపేట జిల్లాలోని రైతులు దాదాపుగా 4000-5000 ఎకరాలలో శనగ పంటను సాగు చేస్తున్నారు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా వేరుకుళ్ళు తెగులు సోకడంతో దిగుబడి గణనీయంగా తగ్గడం జరిగింది. కావున రైతులు మొదట ధనియాలను అంతర పంటగా శనగలో వేయడం మొదలు పెట్టారు. తర్వాత ధనియాలను విధిగా శనగకు బదులుగా నల్లరేగడి నేలలో సాగు చేస్తున్నారు.

ధనియాలు మంచి లాభదాయకమైన పంట, స్వల్పకాలిక పంట కావడం విత్తనాలకు సాగు చేసే సౌలభ్యం ఉండటం, కొత్తిమీరకు భారీ గిరాకీ ఉండటం, తక్కువ నీటితో, చీడపీడల సమస్య తక్కువగా ఉండడం, సాగునీటి ఆధారంగా దిగుబడులు పెరుగుతాయి. కావున రైతులు శనగకు బదులుగా ధనియాలు సాగు చేస్తున్నారు

రైతులు అవలంభించిన పద్ధతులు: వానాకాలంలో మొక్కజొన్న కోసి జుళ్ళువేసి, తదనంతరం అక్టోబర్-నవంబర్ నెలల్లో తేమను బట్టి ఒకసారి దున్ని, గొర్రుతో లేదా సీడ్ కమ్ ఫర్టిడ్రిల్‌లో 30 సెం.మీ. ఎండంతో సాళ్ళలో 8 కిలోల విత్తనాన్ని మరియు 50 కేజీల 28:28:0 ను ఒకేసారి వేసుకోవాలి, విత్తిన తర్వాత పెండిమిథాలిన్ 1.3 లీ. ఎకరాకు 24-48 గంటల్లో పిచికారి చేసుకోవాలి. నీటి వసతి ఉన్న రైతులు ఒకటి లేదా రెండు తడులు డ్రిప్ ద్వారా 45 రోజులకు మరియు 60 రోజులకు ఇవ్వాలి. విత్తనం 15 రోజులకు మొలకెత్తుతుంది, 45 రోజులకు పూతకు వస్తుంది, 90-100 రోజుల్లో పంట కోతకు వస్తుంది. బూడిద తెగులు గమనించినట్లయితే థయోఫానేట్ మిథైల్ 100 గ్రా. ఒక ఎకరాకు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. చలికి పేనుబంక, రసం పిల్చే పురుగులు గమనించినట్లయితే ఆకులు, పూత నుండి రసాన్ని పీల్చి గింజలు ఏర్పడకుండా చేస్తాయి. దీని నివారణకు ఎకరాకు ఎసిటామిప్రిడ్ 40-60 గ్రా. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. పంటను కోసి కుప్పలుగా వేసి, ట్రాక్టర్ తోలి నూర్పిడి చేసిన ధనియాలు ఎకరాకు 5-6 క్వి. దిగుబడి వస్తుంది.

ధనియాల మరియు శనగ పంట సాగు వివరాలు (ఒక ఎకరాకు)

క్ర.సం.	వివరాలు	ధనియాల సాగు ఖర్చు (రూ./ఎకర)	శనగ సాగు ఖర్చు (రూ./ఎకర)
1.	నేల తయారీ	1,200	1,200
2.	విత్తన ఖర్చు	800 (రూ. 100/- కేజీ)	2,550 (రూ. 85/- కేజీ)
3.	ఎరువులు	1,700	1,300
4.	విత్తడానికి అయ్యే ఖర్చు	800	800
5.	పురుగు మందులు మరియు పిచికారి ఖర్చు	1,500	1,500
6.	కోత ఖర్చు (5 కూలీలు)	1,000	1,000
7.	నూర్పిడి/కంబైన్డ్ హార్వేస్టర్	1,000 (5 కూలీలు) + 1,000 (ట్రాక్టర్)	4,200 (గంటకు)
	మొత్తం సాగు ఖర్చు	9,000	12,550
	దిగుబడి (క్వి./ఎకరానికి)	5-6	6-8
	స్థూల ఆదాయం	40,000-48,000 80/కేజీ	33,900-45,200 56.50/కేజీ
	నికర ఆదాయం	31,000-39,000	21,350-32,650
	నికర ఆదాయం : ఖర్చు నిష్పత్తి	3.44:4.33	1.70:2.60

రైతుల అభిప్రాయం: ధనియాలు సాగు చేయడం ద్వారా మంచి దిగుబడి మరియు నికర ఆదాయం పొందవచ్చునని, అంతేకాకుండా శనగకు బదులుగా ధనియాను ఒక ఎకరాకు సాగు చేయడం ద్వారా రైతులకు 6,350-9,650/- రూపాయలు అదనంగా పొందుతున్నారని తెలిపారు. కావున చిన్న మరియు సన్నకారు రైతులు నల్లరేగడిలో వానాకాలం మొక్కజొన్న మరియు పత్తి తర్వాత శనగకు బదులుగా ధనియాల పంటను వేసి తద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని రైతులే నిరూపించారు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9963164507

47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు 1. సి 2. బి 3. సి 4. బి 5. బి 6. ఎ 7. డి 8. డి 9. డి 10. డి

కుసుమలో గుజియా వీవిల్ జీవిత చక్రం మరియు నష్టపరిచే విధానం

డా॥ కె. వాణిశ్రీ, డా॥ యస్. ఉపేంధర్, బి. సౌమ్య, డా॥ రాజేశ్వర రెడ్డి, డా॥ సి. సుధాకర్ మరియు డా॥ కె. విజయలక్ష్మి
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

1. గ్రుడ్లు (6–7 వారాలు)
2. గ్రబ్స్ (10–18 రోజులు)
3. కోశస్థ దశ (7–9 వారాలు)
4. తల్లి పురుగు
5. వీవిల్స్ చిన్న మొక్కలను కాలర్ ప్రాంతంలో గీరివేస్తాయి (నేల ఉపరితలానికి కొంచెం పైన మాత్రమే జరుగుతుంది)
6. సన్నని ఆధారం ఉన్న మొలకలు విరిగిపోతాయి
7. విరిగిన మొలకలు ఎండిపోతాయి
8. గుజియా వీవిల్ ప్రభావం వల్ల మళ్ళీ విత్తుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

RNI No : TELTEL/2015/60296 April, 2025 Postal Regd.No:HSE/1013/2024-2026
Total No. of Pages : 52
Date of Publication : 06.04.2025
Date of Posting : 09.04.2025



పశుగ్రాస అలసంద
విజయ (ఎపిఎఫ్‌సి -10-1)

వానాకాలం, యాసంగి మరియు వేసవి కాలాల సాగుకు అనువైన పశుగ్రాసం

Striving for a greener tomorrow...

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. R. Sunitha Devi on behalf of Professor Jayashankar Telangana Agricultural University,
Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. R. Sunitha Devi, RNI File No. 1262077, Title-Code: TELTEL00152